UNIVERSAL LIBRARY

OU_204652

UNIVERSAL LIBRARY

CHINTAMANI

(or LEELA SUKA)

OSMANIA UNIVERSITY
COLLEGE LIBRARY.

చింతామణి.

(లేక లీలాశుక)

రెండవ కూర్పు : 1000.

COMPOSED BY

RAMANARAYANA KAVULU.

సంపూర్ణరామాయణము. (రెండవకూర్పు)

గ్రంథకర్త:—గూడూరు కోటీశ్వరరావుగారు.

ఇది మొదటికూర్పుకన్న సవరించి అచ్చువేయబడినది. ప్రతిపాత్రము చక్కగా పోషింపబడినది. ఎక్కువ రసవంతముగా నుండును. వెల 1-4-0.

శ్రీ కన్యకామ్మవారి పాటలు.

ఇందు వైశ్యుల ౧౦౨ గోత్రముల వివరములున్ను, కన్యకామ్మవారిపాటలున్ను గలవు. కొద్ది కాపీలు మాత్రమే యున్నవి.

వెల 0-5-0.

హాస్యగ్రంథములు (ఒక్కొక్కటి అణా ఖరీదు.)

ఆడంగులముచ్చట్లు	తన్ను, ముద్దు	ఇద్దరు పెండ్లాల ఇబ్బంది
జైలు చిత్రము	వేశ్యా మధురము	ఆడషోకు
అంతా గమ్మత్తు	భోగము మేళము	మగషోకు
ప్రయివేటు వకీలు	కలివార్త	ముసలి మగడు-పడుచు పెండ్లాము 0-1-6
ధనము-దైవము	కథల కామరాజు	నాటకముల ఫార్సు 0-6-0
విచిత్ర పద్యములు	ఆడంగుల మీటింగు	

సుప్రసిద్ధనాటకములు.

గయోపాఖ్యానము	0-8-0	పాదుకాపట్టాభిషేకము	1-4-0
ప్రసన్నయాదవము	0-8-0	కంఠాభరణము	0-12-0
పారిజాతాపహరణము	0-8-0	సరస్వతి	1-0-0
చతురచంద్రహాస	0-8-0	పద్మవ్యూహము	1-0-0
సత్యహరిశ్చంద్రీయము	1-0-0	బొబ్బిలియుద్ధము	1-0-0
సాత్రాజితీయము	1-0-0	అర్జునపరాభవము	0-12-0

శ్రీ సీతారామాంజనేయ కంపెనీ

బుక్ సెల్లర్సు (అండు) పబ్లిషర్సు, బెజవాడ.

చింతామణి.

లేక లీలాశుక

గ్రంథకర్తలు:

రామనారాయణ కవులు

ప్రకటనకర్త

బెజవాడ, శ్రీ సీతారామాంజనేయ కంపెని ప్రొప్రయిటరు,

పోలిశెట్టి రామయ్య.

బెజవాడ:

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల, లిమిటెడ్.

[రిజిష్టర్డు కాపీరైటు] 1922 [వెల 1—0—0

ఈ నాటకరాజమున ప్రదర్శింపబడు పాత్రలు.

పురుషులు.

బిల్వమంగళుడు—కథానాయకుడు
రామశాస్త్రి—బిల్వమంగళుని మిత్రుడు
వాసుదేవమూర్తి—బిల్వమంగళుని తండ్రి
మధుసూదనుడు—చింతామణియొక్క విటుడు
బిల్వమంగళుని దూత
సుబ్బిశెట్టి—విటుడు
శరభయ్య—విటుడు
గఫార్‌సాహెబు—విటుడు
శ్రీకృష్ణుడు—అవతారపురుషుడు
సోమగిరియోగి—బిల్వమంగళుని గురువు

స్త్రీలు.

రాధ—బిల్వమంగళుని భార్య
వాసంతిక—రాధయొక్క చెలికత్తె
చింతామణి—వేశ్య
సుబ్బలక్ష్మి—దాసి
శ్రీహరి—చింతామణి తల్లి

చింతామణి.

లేక

లీలాశుక.

ప్రథమాంకము.

రంగము:—[వాసుదేవునిగృహము:—ప్రవేశము.
రాధయుఁ జెలికత్తెయగు వాసంతిక.]

వాసం—అమ్మా! రాధా! నిన్నెప్పుడు జూచినను నేదో సద్గ్రంథకాలక్షేపమునేఁ జేయుచుందువుగదా!

రాధ—వాసంతికా! గ్రంథావలోకన మెంతయుపకారము నైనఁ జేయగలదు.

వాసం—ఇన్ని దినములనుండియు నీవనేక గ్రంథములఁ జూచుచుంటివి కదా! వానియందు స్త్రీలవిషయమై యేమి విశేషము జెప్పఁబడియున్నది?

రాధ—ఇదియా నీ వెఱుంగఁ దలఁచినది?

తే. గీ. పతి పదాంబుజసేవయే ♦ సతికి, సకల
సౌఖ్యములఁ గూర్చు, నదియె య♦శంబుఁ దెచ్చు
మోక్షమిచ్చునటంచు గ్రంథ♦ ములిలఁ జాటు
చున్న వింతకంటెను నేమి ♦ చూడవలయు.

వేయేల!

సీ. సహధర్మచారిణీ ♦ సద్వ్రతంబున కెన్న
నాత్మనాథుని పూజ ♦ యాలవాల
మతిపాప సముదయా ♦ రణ్యంబుఁ జెక్కుండఁ
గోమలాంగుని భక్తి ♦ కులిశధార
సంసారనామక ♦ సాగరంబుఁ దరింపఁ
జిత్తేశు సత్పాద ♦ సేవ, నావ
యాచితానంద సౌ ♦ ఖ్యములిచ్చు ముక్తికిఁ
బ్రాణకాంతుభజన ♦ రాచబాట
తే. గీ. విమలభాగ్య భోగములతో ♦ వెలయఁజేయు
రమణుపద కమలార్చన ♦ యమరతరువు
సకలదిక్కుల యందును ♦ సద్యశంబు
దండిగాఁజాటఁ బతిసేవ ♦ డిండిమంబు.

వాసం—ఇది యంతయు బాగుగనేయున్నది. కాని స్త్రీలు చదువ గూడదని కొందఱు పలుకుదురే? స్త్రీవిద్యవలన ననర్థకము లున్నవని కొందఱందురు.

రాధ—అది కేవలము వెఱ్ఱితనము. పురుషులకెట్లో స్త్రీలకుఁగూడ విద్యవలన ననేక లాభంబు లున్నవి. స్త్రీలయొక్క యజ్ఞానంబు వలనఁగూడ గొంతవఱకు దేశము పాడయిపోవుచున్నదని చెప్ప వచ్చును. చూడుము: ఒకొక్క స్త్రీ,

సీ॥ మగని దారిద్ర్యంబు ♦ మదిలోన నరసి
యిదియది తెమ్మంచు ♦ నెప్పుడడుగు
పొరుగిండ్లలోనున్న ♦ పూబోండ్ల నీక్షించి
విభుని నగలకునై ♦ వేపుచుండు
నాత్మేశుఁడింటికి ♦ నరుదెంచువేళకు
ముక్కుచు మూల్గుచు ♦ మూలఁబండు

కొఱతయుంచుక యొనఁ ♦ గూడినఁ భర్తపై
బహుకోపమున నుండి ♦ పడుచునుండు
తే. గీ. కారణము లేకయున్న, నే ♦ కారణంబొ
తెలిపి మగనిని నెప్పుడు ♦ నెప్పుచుండు
మారుబల్కినఁ బొరుగింటి ♦ వారుజూడఁ
గొంపమునిగిన చందాన ♦ గోలఁబెట్టు.

ఇట్టివనితలు పెక్కండ్రుగలరు. దీనికిఁ గారణము వివేక శూన్యమే. విద్యవలన వివేక మొదవును. ఆ వివేకమువలననే పతిపదాంబుజ సేవయందు నిశ్చలత్వము గలుగును. దానం జేసి యిహపరసౌఖ్యము జేకూఱును.

వాసం—పురుషులలోమాత్ర మందఱును మంచివారే యున్నారా? ఒక్కొక్క పురుషుఁడు, తన సతివిషయమై యనేకరీతులఁ బ్రవర్తించుచుండుట నేను గన్నులార వీక్షించియుంటిని.

సీ. దిక్కుమాలినదాన ♦ వెక్కడనాకును
దొరకి నావంచును ♦ దూరుచుండు
వేళమించెను తిండి ♦ బెట్టకపెత్తనం
బులకేగితే యంచుఁ ♦ బలుకుచుండు
నేదైనఁ గోరిన ♦ నే నెపముననైన,
సాకుఁజేసికొనుచుఁ ♦ జావగొట్టు
చీరెలు రవికెలు ♦ సారెసారెకు నెన్నొ
దెమ్మందు వంచును ♦ దిట్టుచుండు
తే. గీ. ఎంత పెట్టినఁగాని యొ ♦ క్కింతయైన
తుష్టిలేని దానవనుచుఁ ♦ దూలనాడు
నట్టిపురుషులు లేరొకో ♦ యువనియందు
స్త్రీలయందును మాత్రమే ♦ చెప్పితేల.
పరవనితల మఱగి భార్యల నేడిపించువారెంతమందికలరు?

రాధ—వాసంతికా ! నీవు చెప్పినట్లు పురుషులలోఁగూడ నున్నారు. ప్రస్తుతవిషయము పాతివ్రత్య సంబంధమైనదగుటచే నదియే చెప్పితిని. నీ వేవో వెఱ్ఱి ప్రశ్న లడుగుచుందువు. వినుము!

చ. మగఁడు దరిద్రుఁడైన నప ♦ మార్గచరుండయినన్, నిజాంగనన్
వెగడెడివాఁడైనను, న ♦ ధీరుఁడైనను, హీనుఁడైన, రూ
పగుణము లేనివాఁడయిన, ♦ వారసతీరతుఁడౌచు నున్నచో
మగువల కెప్పుడుం బతియె ♦ మానము ప్రాణము దైవమున్ జుమీ॥

(బిల్వమంగళుఁడు ప్రవేశించును)

బిల్వ—(త్వరగా ప్రవేశించి) ఏదేది! నీవుచదివిన పద్యము మఱొక్కసారి చదువుము.

రాధ—(లేచి) నాథా! దయచేయుము. (అనిపూర్వోక్తపద్యమును జదువుచున్నది).

బిల్వ—తరుణీమణీ! ఈగుణము స్త్రీలయం దందఱకును నుండవలయును గదా!

రాధ—అట్టున్న కాంతయే సాధ్వియనంబడును.

బిల్వ—(తనలో)

మ. పరమాత్ముం డఖిలప్రపంచమయుఁడై ♦ భాసిల్లుచున్ వేడ్కఁ దు
ష్కరదుర్దాంతదురంతదుస్సహమహా ♦ గ్రక్రూర భీభత్ససం
సరణంబందున భార్యయంచు నొక య ♦ బ్జాక్షిన్ సృజించెన్ భళా
పురుషుం డెంతయు సంతసించుచును స ♦ మ్మోహాబ్ధి నోలాడఁగన్.

భార్యయనునది లేకపోయినచో సంసారమే లేదుకదా! సంసారరూపంబునం బడక, సర్వసంగపరిత్యాగము జేసి, కాననంబుల యందుఁ జేరి పరమేశ్వరునిఁగూర్చి యఖండతపము సేయుట మంచిదని కొందఱు నుడువుదురు. అదియు నొక విధముగ మంచిదే! కాని సంసారమునందు గొంతసౌఖ్య మనుభవించిన పిదప నట్లొనర్చినచో బాగుండును. లేకపోయినచో వంశవృద్ధికి

మాగఁ ముండదు. (ప్రకాశముగా) రమణీ! సద్గుణపేటివగు
నీవు నాకు భార్యవగుటంజేసి నేనెంతయుఁ గర్వించుచున్నాను.
రాధ—నాథా! మీ సేవకురాలనగు నన్ను శ్లాఘించెద రేల?

మ. ధనముంగల్గిన విద్య సున్నయగు గా ♦ దా! రెంటనుం గల్గినన్
గనఁగాఁ జాలము రూప మద్దియును గ ♦ ల్గన్ జ్ఞానముల్ శూన్యమా
ననఘా! యిన్నియు నీయెడన్ గలిగెఁబు ♦ ణ్యం బెంతయో మున్ను జే
సినదానన్ గనుకన్ నినున్ బడసితిన్ ♦ జిత్తేశుగా ధారుణిన్.

ఇంక నా కేకొఱంతయు లేదు. మీ పాదసేవఁ జేసికొనుచు
కృతార్థురాల నయ్యెదఁగాక!

ఉ మామకభాగధేయకరి ♦ మంబున నాపతివై చెలంగి తో
భూమిసురాన్వయాబ్ధిపరి ♦ పూర్ణసుధాకర! బంధులందు, న
త్యామిత్రవైభవంబుగని ♦ తద్దయు సౌఖ్యములందుచుంటి నీ
వీ మహిఁ జూపు సత్కృపకు ♦ నెంతయు సంతసమందితిన్ మదిన్.

బిల్వ—సఖీమణీ! ఇదియంతయు భగవత్సంఘటనము. ఇందు నీ నా
విశేష మేమియునులేదు.
రాధ—మనోహరా! ఎట్లయినను నాతను వున్నంతవఱకు నీ పాదసేవఁ
జేయుచు నెడబాటు గలుగకుండ వెళ్లిపోవుటయే కావలసినది.
నిరంతరము నీసత్కృపావర్షము నాపైఁ గురిపించుచు నుండు
టయే నాకు మహానందము.
బిల్వ—తరుణీ! ఇప్పటి కేకొఱంతయు లేదుకదా! ఇంక ముందుసంగతి
యెట్లు జెప్పఁగలము?
రాధ—అట్లు వచించితి రేమి?
బిల్వ—మఱేమియు లేదు. భగవంతుని చర్యలనంతములు.
మ. ధనికున్ బేదగ బేదనున్ ధనికుగా ♦ ధర్మైకసంవేద్యు దు
ర్జనుగా దుర్జను ధర్మతత్పరునిగా ♦ శౌర్యాన్వితున్ భీరుగా

ఘనకీర్తిప్రదుఁ గీర్తిహీనుఁగఁ గడుఁ ♦ గావింపఁగాఁ జాలు దే
వునిలీలల్ గన నేరికైనఁదరమే ♦ పూర్ణేందుబింబాననా.

(ఇంచుక యూరకుండి) ఏదో ప్రశంసఁ బెట్టుకొని నీచదువు జెడ
గొట్టితిని. పాపము! వాసంతిక కేదో బాధ సలుపుచుంటివి కాబోలు.

రాధ—పతివ్రతాత్వమునగూర్చి ప్రశ్నించినది.

బిల్వ—నీచేతనున్నది భారతమేనా?

రాధ—అవును.

బిల్వ—నీవిప్పు డే ఘట్టము జదువుచుంటివి?

రాధ—సత్యభామకు ద్రౌపది పతివ్రతాధర్మములు చెప్పుట.

బిల్వ—ఎంతవఱకుఁ జదివితివి?

రాధ—

"చం. పతిగడవంగ దైవతము ♦ భామలకెందును లేదు ప్రీతుఁడై
పతి గరుణించెనేనిఁ గల ♦ భాషిణి భాసుర భూషణాంబరా
న్వితధనధాన్యగౌరవము ♦ విశ్రుతసంతతియుఁ యశంబు స
ద్గతియును గల్గునొండుమెయిఁ♦గల్గునె యిన్ని తెఱంగు లారయన్."

(రామశాస్త్రి ప్రవేశించును.)

రామ—సాధ్వీమణీ! రాధా! ఆపద్యము నింకొకసారి జదువు తల్లీ. వ్రాసి
కొనిపోయి నాభార్యకైన వినిపించెదను. బుద్ధి వచ్చునేమో!

బిల్వ—మిత్రమా! రామశాస్త్రీ వచ్చితివా? ఇంతవఱకును నీవెందుకు
రాలేదని తలంచుచుంటిని.

రామ—ఏమి చేయుమందువు? దిక్కుమాలిన సంసారబాధ! ఈకూపమ
ములోబడి లేవలేక యున్నాను.

బిల్వ—రామశాస్త్రీ! సంసారబాధ యందఱకును నున్నదే! నీకు
మాత్రమే కాదు.

రామ—నాకున్నబాధ యెవరికినిలేదు. తెల్లవారి లేచినదిమొదలు ఒకటే
ఘోరు.

బిల్వ—ఎవరితో?

రామ—ఇంకెవరితో! చేసికొన్నదానితో!

బిల్వ—అగ్నిహోత్రుని సాక్షిగాఁ గొన్న భార్యతోడ నా నీవు కలహించుచుంటివి. చాలుఁ జాలు. ఎవరైన విన్న నవ్వెదరు.

రామ—మిత్రమా! నీవు సంగతిసందర్భములు దెలియకుండ మాట్లాడెదవు. నేనుదానితో బోరాడుటలేదు. అదియేనాతో బోరాడుచున్నది. బొత్తిగా నాకింపంటేనే గిట్టదు. నా మొగము చూడగానే మటమట మండిపడును, అనుదినమును చీరెలు రవికెలును గావలయు నన్నచో నెక్కడనుండి వచ్చును? అక్కడికి నాకు బ్రాహ్మణార్థములలో దొరకిన యంగవస్త్రములు మొదలగునవి విక్రయించి దానికి గావలసినవన్నియు యుదాన్ని పెట్టుచునేయుందును. ఎంతకును సంతృప్తిలేనిముండ.

బిల్వ—తిట్టకు. తిట్టకు.

రామ—ఏమి! తిట్టకు. ఏమిటో జిహ్వాచాపల్యముకదా. నిన్నటిరోజున మాయావిడకు శ్రావణమంగళవారపు బాపతు శెనగలు దొరకగా వానిస సాతాళించి పెట్టుమనుసరికి, నెక్కడలేని కోపమువచ్చి యెన్నియో దెప్పులుదెప్పి, యిరుగుపొరుగుననున్న యమ్మలక్కల సందఱనుజేర్చి తుదకు నాపాపముకుండగూడ బద్దలు కొట్టినది.

బిల్వ—నీకుఁ జాలనష్టము సంభవించినదే.

రామ—నష్టమనగా నష్టమా! నాము కూడిపోయినట్లున్నది.

బిల్వ—పోనిమ్ము. ఇంతకును శెనగలుతింటివా?

రామ—అవితింటేయికనేం. ఎన్నితిట్లయిన నొకగారెముక్కతో సమానముగావన్నారు. ఏదెల్లా గంగలోగలిస్తే నాకెందుకు. కృష్ణా! రామా! గోవిందా! అనుకుంటూవున్నంత సుఖ మింకొకటిలేదు. (ఇంచుక యూరకుండి) మఱచిపోయితిని. నేడొకచోట తద్దినపు బ్రాహ్మణార్థమున్నది. ఈరోజున నిదియున్నదని నిన్న భోజనముగూడ చేయలేను.

రాధ—(నవ్వును)

రామ—అమ్మాయీ! నవ్వెదవేమి! నే నన్నదానిలో లోప మేమియును లేదు. ఇటువంటి కార్యములపట్ల బ్రాహ్మణులు సంపూర్తిగ భోజనము జేసినఁగాని పితృదేవతలు సంతోషించరట. అందుచేత నేను నిన్న భుజింపక యుంటిని. ఆవంతుగూడ నేఁడు దీర్చెదను.

బిల్వ—నీవు దగ్గరనున్న కాలక్షేపమగుట కేమియు సందియము లేదు.

(తెరలో)

అబ్బాయీ! బిల్వమంగళా!

బిల్వ—ఓహో! తండ్రిగారు వచ్చుచున్నారు.

రాధ—మామగారు వచ్చుచున్నారు. మేము లోపలికేగెదము. (వాసంతికతో నిష్క్రమించును.)

(వాసుదేవుఁడు ప్రవేశము)

బిల్వ—(తండ్రినిఁజూచిలేచి) తండ్రీ! ఇటురమ్ము.

వాసు—తండ్రీ!

బిల్వ—ఈయాసనము మీఁదఁ గూర్చుండుము.

వాసు—(ఆసీనుఁడై) ఈతఁ డెవరు?

బిల్వ—నా స్నేహితుఁడు రామశాస్త్రి.

వాసు—అట్లనా! (రామశాస్త్రినిఁజూచి) నాయనా రామశాస్త్రీ! కుశలముగ నుంటివా?

రామ—మీదయవలన, దగ్ధపొట్లు దొరుకుచున్నంతవఱకు నాకు కుశలమున కేమియుఁ గొఱంత కలుగదు.

బిల్వ—మిత్రమా! అందఱియొద్దను నొక్కతీరుగనే మాట్లాడుదువు కదా!

వాసు—పోనిమ్ము. ఆతనితో నేమి! చమత్కారవచనప్రియుఁడు. (ఇంచుక యూరకుండి) కుమారా! నీతోఁ గొన్నివిషయములు మాట్లాడఁ దలంచితిని.

రామ—తండ్రికొడుకుల రహస్యముకాబోలు. నేనావలకుఁబోవుదునా?

వాసు—రామశాస్త్రీ! నీవుమాకుఁ బరుఁడవుకావు. (బిల్వమంగళుని జూచి)

బిల్వ—తండ్రీ! ఏమి సెలవు?

వాసు—వత్సా!

మ॥ తొలిజన్మంబున నేను జేయు సుకృత ♦ స్తోమంబునం జేసి, పు
త్రుఁడవై బుట్టితి వీవు నాకు గడుసం ♦ తోషంబు జేకూరె; ని
ర్మలకళ్యాణగుణాఢ్యయైన సతియుం ♦ భాగ్యంబునం జేసి నీ
కులంభించెఁ గొఱతెందు లేదు గదరా ♦ కుఱ్ఱా! సువిద్యానిధీ.

నాగర్భంబున జన్మించినందుకు సమస్తవిద్యావిశారదుండవైతివి ఒరులంజేరి యాశ్రయించు నవసరము లేకుండ మనకుఁ గావలసినంత ధన మున్నది. నీ విద్యాబుద్ధులు, నీ యశము, మొదలగునవి చూచి యానందించు భాగ్యము నీతల్లికిమాత్రము లేకపోయినది. విధిసంకల్ప మట్లున్నది. దాని కిప్పుడు వగవం బనిలేదు. నేను వృద్ధుండనైతిని. ఈకార్యభారము నేను వహింపఁజాలను. ఇంక నియ్యది యంతయు నీపై నిడి నేను భగవచ్చరణచింతనంబున సుఖముగాఁ గాలము గడపెదను.

ఉ॥ ఏనిఁక విశ్రమింపఁగను ♦ నెంచితి; నీవిక నిర్విచార భా
వానుగతుండవై పరమ ♦ హర్షమెసంగ సమస్తవర్తక
శ్రీ నిరవొందఁ జేయుచుఁ విబుధ ♦ సేవ ననారత మాచరించుచుఁ
మానితకీర్తిఁ గైకొనుము ♦ మాన్యచరిత్ర కుమారశేఖరా.

నేఁ డెంతయు సుదినము. భోజనానంతరమున వ్యవహారసంబంధమైన కాగితములు మొదలగునవియు, ద్రవ్యమును నీవశముఁజేసి, చెప్పవలసిన సంగతులన్నియుఁ జెప్పెదను.

బిల్వ—తండ్రీ! నీయాజ్ఞకు బద్ధుఁడను. (ఇంచుక యూరకుండి) భోజనమునకు వేళయైనది. నీవు స్నానము సేయుచుండుము. నేనీతని బంపి వచ్చెదను.

వాసు—మంచిది. (నిష్క్రమించును)

బిల్వ—మిత్రమా! మనము మరల గలిసికొందుమా!

రామ—నేను భోజనమునకు నీ యింట నుందునేమోనని బెంగపడకుము.

బిల్వ—శాస్త్రీ! నీమాటలకేమి!

రామ—సరేగాని, ఇంతవఱకును నీవు తడిక్రిచాటున నున్నవాడవగుటచే, మనమైత్రి కేవిధమయిన లోటును గలుగకయున్నది. ఇప్పుడు కార్యభారమంతయు నీపై బడుచున్నది. అధికారివై నన్ను మఱచి పోయెదవేమో సుమీ!

బిల్వ—అట్లన్నటికిని దలంపకుము. పోయిరమ్ము.

(నిష్క్రమింతురు)

ఇది ప్రథమాంకము.

చింతామణి.

లేక

లీలాశుక.

ద్వితీయాంకము.

(చింతామణి గృహముముందు మధుసూదనుఁడు ప్రవేశము)

మధు—(తనలో) అబ్బా! తిరిగి తిరిగి విసుగు పుట్టినది. ఎక్కడను ఋణము దొరకలేదే. ఈయూర పెద్దషావుకారగు బాపనయ్య దగ్గఱకుఁబోయితిని. ఆతఁడు ప్రస్తుతము తనయొద్ద దస్తులేదని చెప్పినాఁడు. తరువాత యెంతసొమ్ము కావలసిన నంత యిచ్చుచుండు మార్వాడీవర్తకుల నందఱను నడిగితిని. ఎవ్వరును నీయరైరి. (ఆలోచించి) అవును, నాయాస్తియంతయు విక్రయించి వేసితినని యందఱకును దెలిసినది. అట్టిచో నెవఁడిచ్చును. ఇప్పుడు నేనేమి సేయుదును? ఎక్కడనైనను ధనము దొరకువఱకును జింతామణి గృహంబున కరుగకుండ నుండఁ దలంచినచో నందులకుఁ జిత్తము సమ్మతింపదు. వేశ్యావ్యామోహయంత్రమున నేమి యాకర్షణశక్తియున్నదో భగవంతునకే తెలియవలయును. ఒక్క నిమిషమైనను నేనీ చింతామణిని విడిచి యుండఁజాలను. దానిని ముద్దుగొనని దినము నాకు దుర్దినమే.

తే. గీ. ఖండశర్కరకంటె, ద్రాక్షారసంబు
కంటె, మధువుకంటెను తీపి గల్గది యగుచు
పొలుచు చింతామణీకాంత ముద్దు వర్ణ
నంబు సేయఁ గవులకు శక్యంబు గాదు.

నేననేకమంది వారకాంతలను జూచితినిఁ గాని దీనింబోలుదాని నెందును జూడలేదు.

తే. గీ. పుడమియందు సంసారిగాఁ బుట్టఁజేయ
దలచి యావిధాత మరల దాసి మఱచి
యిట్లు వేశ్యగాఁ బుట్టించె నింతి నకట
కాకయున్న నీగుణములు గలుగ నగునె.

తక్కిన గణికలకును జింతామణికిని మిగుల భేదమున్నది. దీనికి ద్రవ్యాశయే లేదు. అనురాగమే ప్రధానము. కాని, దీని తల్లి ప్రోద్బలముచేత నడుగక తప్పదయ్యెను. ఎందఱో రాజాధిరాజులు వంటి వారు దీనికి వార్తలఁ బంపినను, నాపైనున్న మోహముచేత వారినెల్లర దృణప్రాయముగఁజూచినది. నేనొక్క నిమిష మాలస్యముగాఁబోయితినేని నాకై యెంతయో బెంగ పెట్టుకొనుచుండునని సుబ్బలక్ష్మి చెప్పినది. దానితల్లి బలవంతముచేతనే యిది డబ్బుకోసము నన్నింత తొందర పెట్టుచున్నది. కాకపోయినచో, నేనాడైన జింతామణి యింత కఠినముగా నన్నడిగినదా? (ఇంచుక యూరకుండి) ఇంక నేను లోపలి కేగెదను. అడుగు పెట్టగానే యాముసలిముండ కాట్లకుక్కలాగున మీదబడును. కాని, నేటికేదో తగిన సమాధానము చెప్పి తప్పించుకొందును. నేను వ్యాపారిబిడ్డనుగదా! అదిగో సుబ్బలక్ష్మి.

(సుబ్బలక్ష్మి ప్రవేశము)

సుబ్బ—(మధుసూదనునిఁ జూచి) ఇదిగో! బావయ్యగారు నిండా ఆలోచిస్తూ యిక్కడ నిలుచుండారే?

మధు—ఏం బావయ్యగారు.

సుబ్బ—ఏమల్లా అంటున్నారు. ఈయూలకూడా తడి దొరకలేదా యేం!?? మూపెద్దమ్మ మండిపోతూవుండది.

మధు—సరేలే. నేను నెమ్మదిగా లోనికేగి శయనగృహములోఁ గూర్చుండెదను. నేనువచ్చితినని చింతామణితోఁ జెప్పుము.
(లోపలఁ బ్రవేశించి కూర్చుండును.)

మధు—(తనలో ఈవేశ్యమాతకు నేను భయమందవలసి వచ్చినదే. పాపము! నామూలమునఁ జింతామణికిఁగూడ జివాట్లు వచ్చు చున్నవి.

తే. గీ. అరయు నధికార్లభవనంబు ♦ లందు, ముందు
గాపలాయుండెడి భటుల ♦ కరణి; వార
సతుల యిండ్లలోఁ గుక్కల ♦ సరణి విటుల
పైనఁబడగనుఁదురు వృద్ధ ♦ వనిత లహహా.

నేను వచ్చిన జాడ యింకను తెలియలేదు. లేకపోయిన నీసరికే నరకము మొఱిగిన ట్లఱచుచు వచ్చియుండెడిదే.

(చింతామణి ప్రవేశించును.)

చింతా—(మధుసూదనునిఁ జూచి) నిశ్శబ్దముగా వచ్చి కూర్చుండిన నీతెనిఁజూడ నాకెంతయు జాలియగుచున్నది. ఇప్పుడీతని ముఖము భయమునకు నిలయమై యున్నది.

తే. గీ. వేశ్యమాత లెటు జూచిన ♦ నిత్తుమేని
యనుచు నదుగుదురంచు భ ♦ యంబుఁ బూని
కన్నమును వేయవచ్చు త ♦ స్కరునిపగిది
జొచ్చెదరు విటులు గణికా ♦ సుదతి గృహము.

ధనముకై వేశ్యలు విటకాండ్రయొద్ద నెన్ని ప్రియవాక్యములు పలుకుచుందురో, యట్లే విటులలో గొందఱు వేశ్యలయొద్ద నా

సమయమునకు దాటిపోవుట కనేక పలుకులు బలుకుచుందురు. ఈ వ్యభిచారమే జీవనముగాఁ గల్పించి యీవేశ్యకులంబును భగవంతుఁడేల సృష్టించెనోకదా! ఛీ! ఏమిబ్రతుకు!

తే. గీ. ధనమొసంగినవానికే పో ♦ ధవుఁడటంచు
వానితోడను గూడుచుఁ ♦ బడుగవలయు
విటులహృదయముల్ రంజించి ♦ వెలుగవలయు
నకట! కడుపాపమీవెల ♦ యాలివృత్తి.

బాల్యమున నాకీవృత్తి వలదని యెంత బ్రతిమాలుకొన్నను వినక నాతల్లి యిందులో దింపినది. ఇప్పుడు నేనెంత విచారించినను నేమి ప్రయోజనమున్నది? ఇదివఱకనేక కొంపలు నావలన మాపబడినవి. ఇంకెన్ని మాపవలసి యున్నానో తెలియదు. (మధుసూదనుని జూచి) ఇదిగో! పంతులుగారు వచ్చి యెంత సేపయినది? నేను చూడనేలేదు.

మధు—ఇప్పుడు నేను నీకు గనుపించుచు ట్లున్నాను? నేను నీకుఁగనబడు రోజులు పోయినవి.

చింతా—మీరేమనినను సరే. మీకు నేను ప్రత్యుత్తర మీయలేను. నేను తక్కిన వేశ్యకాంతలతోపాటి దాననో కానో మీయంతరంగమునకే తెలియును. నాయనురాగ మెట్టిదో మీకు దెలియదా? చులకనగా మాటమాత్రము జారనిచ్చినారు.

మధు—చింతామణీ! పరిహాసమున కాడిన మాటను పాటించెద వేల?
చాలుచాలు సరసము. నాహృదయము నీ వెఱుఁగవా?

మ. వెలముండ్రన్ బదివేలమందిని భువిన్ ♦ వీక్షించి యున్నాను గా
నిలతాంగీ! నినుబోలునట్టి తరుణిన్ ♦ వీక్షింపలే దెందు; ని
స్తులమోహం బదియేమికారణమొ తొ ♦ ల్తోన్ జూడగా గల్గె నీ
యెడ నాకైనఁ దదాదిగా నెపుడు ని ♦ న్నే, నమ్మియుంటిన్ గదా.

చింతా—(తనలో) ఈతఁడు నన్ను నమ్మియున్నాఁడేమో గాని నేను మాత్రి మీతనిని నమ్మియుండలేదు గదా!

మధు—చింతామణీ!

తే. గీ. భవ్యభవదీయ వినయంబు ♦ భక్తి; ప్రేమ
వలపుగలిగించుచుండు, మా ♦ టల పసందు
నాకు తులందు నున్నయే ♦ నారికైన
గలదె నీకు నీవేసాటి ♦ కలికిమిన్న.

చింతా—(తనలో)

తే. గీ. అల కిరాతుడు పన్నిన ♦ వలనుఁజిక్కి
కదలలేక యుండిన కురంగ ♦ ంబు పగిది
నాదు మోహంపు టురులలో ♦ నందగులుకొని
నన్ను బాయఁగా జాలక ♦ యున్నవాడు.

కానిమ్ము. ఇక నెన్నిదినము లుండును. అనుదినమును నీతనికి స్వస్తివాక్యము చెప్పుమని నాతల్లి నాతోఁ బోరాడుచునే యున్నది. ఈతఁడు నాకొఱకు ఎంతయో ద్రవ్యము వెచ్చఁబెట్టెను గదా యని మర్యాద నాలోచించి నేనే చెప్పక యూరకుంటిని. (ప్రకాశముగా) పంతులుగారూ! ఈవేళ నన్ను మిగుల శ్లాఘించుచున్నారు. ఎక్కడా మీరు ప్రయత్నించేసే సొమ్ము దొరకలేదా యేమి? మీ ముఖము జూడఁగా నట్లేయున్నది.

మధు—త్వరలోనే యందును. కాని, సమయమునకు రానందుకు మాత్రము చింతపడుచున్నాను.

చింతా—ఎప్పటి కప్పుడే మీరిట్లు జెప్పుచున్నారు. నా యంతరంగము మీకు సంపూర్తిగాఁ దెలియును. మాయమ్మతో నేను వేగ లేక యున్నాను.

మ. మడిమాన్యంబుల నీకు నిత్తుమనుచుం ♦ బల్మారు నాయింటిముం
గలకేతెంచి; ధనాఢ్యులౌ ఘనులు వే ♦ డ్కన్ నాకు నెన్నెన్నొవా

ర్తలఁ బంపించుటయైనఁ జూడక, జమీం ♦ దారుఁ దృణప్రాయుగా
వలదంచుఁ బలుకంగలేదె విను నీ ♦ పైనున్న మోహంబునన్.

అదియట్లుండుము.

సీ. పలికినందుకె మీద ♦ బంగారు గుఱిపించు
బృథ్వీశమణులను ♦ విడచినాను
చెయి మీదవైచినఁ ♦ జెలఁగి కాసులనిచ్చు
వైశ్యుల బొమ్మంచు ♦ బలికినాను
నగుమోముఁ జూపిన ♦ నగ లిత్తుమనెడి వా
రి వలదని త్రుణీక ♦ రించినాను
ముద్దిచ్చితే జాలు ♦ ముత్యాలకోవలి
త్తుమనెడివారిని ♦ ద్రోచినాను
తే. గీ. నాకు నీమీద నున్నట్టి ♦ నవ్యమోహ
మీ ప్రకారంబుగాఁ జేసె; నిం ♦ కేమిసేతు
దల్లి కోపంబు భరియించి ♦ దినదినంబు
మార్గమేమి యూహింతువో ♦ మాన్యచరిత.

సీ. నిన్న మొన్ననెకదా ♦ వన్నెచిన్నెలమేడ
కట్టించి యిచ్చె శ్రీ ♦ కాంతరావు
మోహంబు విడలేక ♦ భూమివ్రాసి యొసంగె
ఘనసిక్కపట్టెమౌ ♦ ఖాసదారు
నిలువెల్ల నగలతో ♦ నింపివైచెను తోడి
సతుల కనులుకుట్టి ♦ చంద్రరెడ్డి
యేకోరిన దాని ♦ నిచ్చి కోరికదీర్చె
యమలగుణుఁడైన ♦ యాదిశెట్టి
తే. గీ. వీరికందఱు కాకాశ ♦ వీథిఁ జూపి
స్వస్తిజెప్పుట జూడ నీ ♦ పైని నాకు
గలిగియుండిన మోహంబె ♦ కారణంబు
గాదె; దీనినైనను నీవు ♦ గాంచవేల.

మాతల్లి ప్రోద్బలమునఁజేసి మిమ్ములను గట్టిగా నడిగినచో మీకెక్కడ నాగ్రహ మొదవునోయని భయమంది యుందును.

మధు—చింతామణీ! నీహృదయము నే నెరుంగుదును. నేనుమాత్రము నీయెడల గావించిన కొఱంత యేమియును లేదు.

సీ. నినుఁ బాసినను నేను ♦ నిమిష మోర్వన నెడి
పాపాచలంబును ♦ బాసినాను
యెచట కేగిన వెంట ♦ నే తెంచు చుండెడి
పుష్పవేణిని ద్రోసి ♦ పుచ్చినాను
మీరుండినం జాలు ♦ మేలొదవు ననెడి
శ్రీమనోహరిని ద్వ ♦ేషించినాను
ధనమేమి వలదంచు ♦ మనసారఁ జెప్పు న
రోజముఖిని నిట్టె ♦ రోసినాను

తే. గీ. తక్కినట్టి వెలందులఁ ♦ దలఁపనేల
నాకు నీపైన గట్టిగా ♦ నాటియున్న
మోహమేకద గినికి ♦ మూల మరయ
నిఖిల గుణమణీ! చింతామ ♦ ణీవధూటి.

చింతా—(తనలో, వీరందఱకును నీతనిమీఁద నిజముగాఁ బ్రేమ యున్నదనియే తలచుచున్నాఁడు.) చినఱకు నన్నుఁగూడ నా సామాన్య వెలయాండ్రలోనే చేర్చినారా! అవునవును. నేనుమాత్రము మాకులమునఁ బుట్టలేదా?

మధు—నే నిట్లంటినని నీవు మఱొకవిధమునఁ దలపవలదు. మాటవరుస కంటిని. పోనిమ్ము. ఆసంగతియేల!

సీ. ఉన్నంతవఱకును ♦ నొప్పుగా ద్రవ్యంబు
దెచ్చి యంతయును నీ ♦ కిచ్చినాను
మాపూర్వులుంచిన ♦ మాన్యముల్ తెగనమ్మి
వచ్చినసొమ్ము నీ ♦ కిచ్చినాను

జనకుండు గట్టిన ♦ ఘన సౌధమును నీకు
చీరెలకుఁ గ్రయంబు ♦ జేసినాను
నీయింట శుభముకై ♦ నెలత మంగళసూత్ర
మునునమ్మి యదినీకె ♦ పోసినాను

తే. గీ. వేయు నేటికి మొన్ననే ♦ వెలదిగంటె!
యలుకరోజున నాకును ♦ నత్తవారొ
సంగిన ప్రశస్తమైనట్టి ♦ యుంగరంబు
గూడ నమ్మి ధనమునీకె ♦ గూర్చినాను.

ఇది యట్లుంచుము. నల్లమందుకనియుఁ బోగాకున కనియు నడిగినప్పుడెల్ల నీకిట్లకి యిచ్చినది లెక్కయే లేదుకదా! "అర్థము ప్రాణము ఆచార్యులవారి స్వాధీన"మన్నట్లు సర్వమును నీ యధీనము జేసితిని.

చింతా—(తనలో) ఈతఁడన్నమాట నిశ్చయమే. నా మాయామాగురం జిక్కి యింత ధనము వెచ్చించిన యీతనిని నిలువెడల నడపుట కెట్లు చిత్తము సమ్మతించును? (ప్రకాశముగా) పంతులుగారూ! మీ రీయలేదని నేనెన్నడైన ననియుంటినా! అట్లు పలికినచో నా నాలుక వేయిచీలికలు గాదా. (ఇంచుక యూరకుండి) ఇంతకును మీకు నిశ్చయము ద్రవ్య మేరోజునకు వచ్చునో చెప్పఁగలరా!

మధు—నే నావిషయమై సకలవిధములఁ బ్రయత్నము సేయుచున్నాను. రెండు మూడు రోజులలోనే యందును. అదియునుగాక, నే నొక్క స్నేహితుని నడిగియుంటిని. ఆతఁ డీరోజున మధ్యాహ్నము ప్రత్యుత్తర మిచ్చెదనని పలికినాఁడు.

చింతా—అట్లయిన మీరు నాయందు దయయుంచి తత్ప్రయత్నమున నుండుఁడు. జాగుసేయ వలదు.

(లోపల)

అమ్మాయీ! చింతామణీ!

చింతా—అదిగో! మా యమ్మ వచ్చుచున్నది.

మధు—నేను వెళ్ళివచ్చెదను. (ఈవలకువచ్చి) ఇప్పుడీ ముసలిముండ కంట బడరాదు.

ఆహా! ఆ భగవంతుఁ డీ వేశ్యమాతల హృదయములు కఠినపాషాణములతో నిర్మించియుండనోపు.

తే. గీ. గౌరవంబును మర్యాదఁ ♦ గాంచకుండ
నెట్టివారినినైనను ♦ నిట్టె గడ్డి
పోచగాఁగట్టి శునకంబు ♦ పోల్కిఁబైన
బడును; జూచినంతనె యెంతో ♦ భయము గలుగ
విటులపాలిఁటి యమదూత ♦ వేశ్యమాత.

వేశ్యమాతామారణమున కేమైన మంత్రముండిన బాగుండును.
(నిష్క్రమించును.)

(శ్రీహరి ప్రవేశించును.)

శ్రీహ—(చింతామణినిజూచి) ఎవరే నీతో మాట్లాడి వెళ్ళువారు?

చింతా—ఇంకెవ్వరు! మధుసూదనపంతులు.

శ్రీహ—బాగానే వున్నది. ఈతని కింకా నీవు స్వస్తి చెప్పలేదుకదా! ఇట్లున్నచో మనబ్రతుకు తెల్లవారినట్లే. ఇంతవిద్య నభ్యసించిన దానవు. ఇందులోమాత్రము తెలివిలేదు.

ఉ. ఒక్కనిగూడ గావలె ను ♦ నొక్కనితో పలుకాడనౌను నిం
కొక్కనిఁ జేర్పఁగానగును ♦ నొప్పుగ బ్రిక్కగదిన్ మఱొక్కనిన్
నిక్కముగాగ రమ్మనుచు ♦ నే నడువన్ వలె నంతెగాక ని
ట్లొక్కనితోడ సంతతము ♦ నుండుట యొప్పునె వేశ్యకాంతకున్.

అమ్మాయీ! పండితులు శతావధానము సేయునట్లే, మనము విటుల యెడలఁ జేయుఁ గార్యములు నడుచు చుండవలయును.

చింతా—అమ్మా! శతావధానమునకును, మనచర్యకును బోలికయా! చాలుఁ జాలు.

శ్రీహ—ఈ మధుసూదనుని విషయములో నేనెంతజెప్పినను నీవు వినకున్నావు.

తే. గీ. పీల్చి పిప్పినిగావించి ♦ విడిచినట్టి
చెఱుకుముక్కను చీమ లా ♦ శించుకరణి
జేత నొకకానియును లేక ♦ చెలగుచున్న
వీనిపై నింత యడియాస ♦ బూనెదేల.

ఉన్నంతవఱకు నేదో తెచ్చియిచ్చినాడు. ఇంక నీతనివలన మనకుం బ్రయోజనమేమియును లేదు. ఇట్టి విషయములలో మనకు మొగమాటమి యావంతయు నుండరాదు. విటునియొద్ద ధనమున్నంతవఱకె మనము లేనివలపు చూపవలెను. ధనముపై నాసలేనట్లు పలుకవలయును. ఎవనిఁజూచినను నీమీదనే ప్రేమయని నటించవలయును. ఇట్టి చర్యలన్నియు వానివలన ధనము గొనుటకే!

తే. గీ. తొలుత విటునకె మోహంపు ♦ వలను బన్ని
పట్టి; కష్టములో లేనట్టి ♦ వలపుతోడ
గట్టిగాఁగట్టి ధనము లా♦గంగవలయు
శూన్యహస్తుడైన విటుని ♦ శునకమట్లు
వాని నిల్లు వెడలనడ♦పంగవలయు.

అంతియెగాని యొక్క విటునితోడనె కాలక్షేపము సేయుచుం గూర్చుంటివేని తోడివేశ్యలు నవ్వరా! మనకు గౌరవముండునా?

తే. గీ. అఖిల సౌఖ్యాళిరోసి స ♦ న్యాసియైన
వాని కొక్కయూరును దొంగ ♦ వాని కొక్క
యిల్లు, వెలకాంత కొక విటుం ♦ డెందునైన
నిర్ణయంబయి యుండునే ♦ నెలతమిన్న.

నాకు నీ యీడున్న దినములలో నెట్లు వర్తించితినో నీకేమి తెలియును.

సీ. వెలపతికా జూడని ♦ విబుధులంబట్టి కు
క్కులఁజేసి యింటిలోఁ ♦ గట్టినాను
కులకాంత నెప్పుడు ♦ విడువనొల్లని వారి
మోహాబ్ధిలోపల ♦ ముంచినాను
సదాచార మనువారి ♦ పట్టిబట్టుక నోట
గట్టిగా "తమ్మను" ♦ బెట్టినాను
విషయమే యెఱుఁగని ♦ విజ్ఞానులందెచ్చి
విషయేచ్ఛఁ గలిగించి ♦ వెలసినాను
తే. గీ. సర్వమును రోసిన యతీ ♦ శ్వరులఁబట్టి
విటులగాఁజేసి యున్నాను; ♦ విటులబట్టి
సర్వమునురోసి చను యతీ ♦ శ్వరులుగాఁగ
మార్చియున్నాను వేయేల ♦ మగువ వినుము.
సీ. కడు లోభియైనట్టి ♦ గారయశ్రేష్ఠికిఁ
జిప్ప చేతికిరాఁగఁ ♦ జేసినాను
చిల్లిగవ్వయుఁ గూడ ♦ జేర్చిన బంగారు
సెట్టిని యతులలోఁ ♦ జేర్చినాను
యలకుబేరునకు నీ♦డైన, జమీందారు
శిరమును నున్నగా ♦ గొరిగినాను
ధనముండెనంచును ♦ ఘన గర్వమూనిన
ధీరులఁ దిరిప మె ♦ త్తించినాను
తే. గీ. యింతనేటికి వెలది! నీ ♦ కేమితెలియు
నల్లరాత్రిపైనుండి ధ ♦ నంబులాగి
నాను; నాకు సాటి వార ♦ నారి యొందు
గల్గదనుభంగి విఖ్యాతిఁ ♦ గాంచినాను.
సీ. ఒకసారి క్రీగంట ♦ నొప్పుగా వీక్షించి
చిత్రమౌ నగల నా ♦ ర్జించినాను
సుద్దులం జెప్పుచు ♦ ముద్దు మాత్రమెయిచ్చి
దుద్దులజత లెన్నొ ♦ దోచినాను

కల్లప్రేమను జూపి ♦ కౌఁగలించినయంత
వేలు నూరులు గుంజి ♦ పించినాను
హస్తంబు దగిలించి ♦ యరగంటలోపల
నెన్నొ మాన్యముల వ్రా ♦ యించినాను

తే. గీ. వేయు నేటికిఁ బుత్త్రికా ♦ విటులయెడల
జేయవలసిన పనులన్ని ♦ చేసి; రక్ష
కభటులవిధాన నాయిల్లు ♦ గాచియుండు
నట్లు వారినిగావించి ♦ యలరినాను.

చింతా.—మనమెంత యార్జించుచున్నను మన మేరోజున కాఁజే యిబ్బంది పడుచుందుము. ఇది మనకు శాపము గాబోలు. అదియుఁగాక యింత పాపమొనర్చి యార్జించిన సొమ్ము నిలుచునా?

శ్రీహ.—అమ్మాయీ! మనసంపాదన పాపమని నీ వెప్పుడును దలంపరాదు.

చింతా.—ఈదుర్వృత్తి పాపముగాక పుణ్యమా?

శ్రీహ.—నీవు వెఱ్ఱిదానవు. "కులవృత్తికి సాటిలేదు గువ్వలచెన్నా" అని నీవు చదివినది మఱచి పోయినావు కాబోలు!

చింతా.—ఎంత విద్యావంతురాలనైనను నీమాటకు మాత్రము నేను జవాబు చెప్పలేను.

శ్రీహ.—అన్ని విషయములలోను నీకు దెలివి కేమియు లోపములేదు. కాని, మన కులవృత్తి విషయములోనే నీవు సరిగా గమనించుటలేదు. ఆ గోపాలము కూతురగు రాజరత్నమును జూచితివా? అది నీకింటె చక్కనిదా? నీకాలి గోరునకైనను జాలదు. కాని, కులవృత్తి విషయములో మంచి చాకచక్యమున్నది.

సీ. వెలలేని సాధ మ ♦ ర్పించిన రామయ్య
దవ్యంబుదోచి స్వ ♦ ర్గంబుజేర్చి

పరకాంత నెన్నఁడు ♦ బరికించి యెఱుఁగని
శేషగిరిర్యాఖ్యునిఁ ♦ జేరదీసె
ఆర్యవందితుఁడైన ♦ సూర్యనారాయణు
మోహాబ్ధియందున ♦ ముంచివైచె
వరభిషఙ్మణియాచు ♦ వరలు సీతారాము
వలపెంతొ చూపించి ♦ పదిల పఱచె

తే. గీ. యొకఁడు వచ్చిన జాడ వే ♦ రొకనికింత
యేని దెలియకుండెడిరీతి ♦ నెట్లు మెలఁగు
చున్నదో కనలేవె! యా ♦ సుదతినైన
జూచి నేర్చుకొనుము నీవు ♦ శోభనాంగి.

చింతా—నేను నేర్చుకొనవలసిన విషయములన్నియు నొక్కటియు గొఱఁతలేకుండ నన్నియు నీవే బోధించితివి.

శ్రీహ—ఏమి లాభము! అన్నియు "గూటఁబెట్టి గంటవాయించితివి." నేఁడేమైనను సరే! నీవు మధుసూదనునితో నింక మనగృహమునకు రావలదని చెప్పుము.

తే. గీ. అతివ! "దీపమున్నప్డె గృ ♦ హంబు జక్క-
బెట్టుకొనవలె" ననురీతి ♦ వేశ్యకాంత
యౌవనమునందె యార్జించి ♦ యలరవలయు
వయసు ముదిరిన నేమి లా ♦ భంబు గలదు.

ఇంక నీవు మధుసూదనునియెడల మొగమోటమి విడిచి వర్తింపుము.

చింతా—అమ్మా! నేనొక్కటి చెప్పెదను వినుము. తక్కిన వేశ్యలకును నాకును నించుక భేదమున్నది. నేను విద్యావంతురాల నగుటచే గొంచె మాలోచించుచుందును. అంతియేగాని మఱియొకటి గాదు.

సీ. మురిపెఁబు జూపించి ♦ మొహరీలు మాడలు
పెద్దకాసులును దె ♦ ప్పించినాను

చీరెలు లేవంచు ♦ జీకాకు గనఁజేసి
మెఱుఁగుబోడి నగల ♦ మ్మించినాను
చట్టాలు వచ్చిరి ♦ చూడఁగా మమ్మంచు
ముంజేతి గొలుసులు ♦ గుంజినాను
వైద్యున కీయంగ ♦ వలెనంచు మురుగుల
మ్మించి తాకట్టు పె ♦ ట్టించినాను

తే. గీ. యిన్ని చెప్పనేల యతని ♦ కున్న యస్తి
తోటలును గృహములు గొడ్లు ♦ తుదకు భార్య
కంఠమున సూత్రమును గూడఁ ♦ గరుణ లేక
యమ్మగాఁజేసి యీరీతి ♦ నలరినాను.

అందుచేత నాతనిని నింత తొందరగా వెళ్ళుమని చెప్పుటకుఁ గొంచెము వెనుక ముందులు చూచుచున్నాను.

శ్రీహ—వేశ్యవృత్తికి యీజాలి బొత్తిగా సరిపడదు. ఒక్కనితోడనే యుండుటకు మనమేమైన సంసారులమా! వీరందఱును మన గళమున దాళిబొట్టు గట్టినవారా! ఈ విషయమున నేను చెప్పినవన్నియు మఱచిపోయినావు. చూడుము.

సీ. కురులు లేకున్న స ♦ వరమొక్కటి సొంపు
జూపింప దలలోనఁ ♦ జుట్టవలయు
స్తనభారమధికమై ♦ గనుపట్ట రెవికపై
రెవికెను వేడ్కధ ♦ రింపవలయు
మొగమందు మచ్చలు ♦ నగపడకుండగా
"పౌడర్" చేత గ ♦ ప్పంగవలయు
నధర మెఱ్ఱగనుండు ♦ నట్లెఱ్ఱ రంగును
దగిలించి వింతగాఁ ♦ దనరవలయు.

తే. గీ. తమలపాకులు నములుచు ♦ దనరవలయు
[illegible] ♦ నటికరణి

సరసవాక్యములాడుచు ♦ సందెవేళ
వీథి గుమ్మమువద్దను ♦ వెలయు వలయు.

వీథిగుమ్మములో నిలఁబడుట యనఁగా స్థావరజంగమాకృతిని సూచుమని కాదు. ఉన్న వ్యాపారమంతయు నానిలబడుటలోనే యున్నది?

సీ. సరసులెవ్వరు వెల ♦ సతులవాకిటి కరు
దెంచుచుందురో పరీ ♦ క్షించవలయు
కని, కనిపించని ♦ కరణిని నాస్యంబు
జూపుచు వారినిఁ ♦ జూడవలయు
చేతితోఁ బిలువక ♦ చిత్తంబు జల్లున
నఁగఁ జిఱునవ్వును ♦ నవ్వవలయు
నప్పగైన నావల ♦ కిడకుండ సుమశరం
బుల నేలుచూపుల ♦ గొలుపవలయు

తే. గీ. హృదయమంతయు నొకసారి ♦ యూగులాడ
పైట నటునటు సర్దుచుఁ ♦ బరగవలయు
గబ్బిగుబ్బల మేటిపొం ♦ కంబుఁ జూపి
చిత్తము వికారమందంగఁ ♦ జేయవలయు.

సీ. తోయజాస్త్రుని చేతి ♦ తూపులో యనునట్లు
బల్ చూపులను మీఁద ♦ బఱపవలయు
ఎట్టులైనఁ దనకన్ను ♦ చిటికెలో మనమీఁద
బడునట్లు గావించి ♦ వరలవలయు
వ్యామోహ మనస్త్రి ♦ వలబన్ని దానిలోఁ
జిక్కెడు విధముగఁ ♦ జేయవలయు
జిక్కికొన్నవిటునిఁ ♦ జేరగాదీసి మా
యవలపున బంధించి ♦ యులరవలయు

తే. గీ. నిటు నటు గదలలేకుండ ♦ నెన్ని యుచ్చు
త్రాళ్ళ గట్టంగవలయునో ♦ తప్పకుండ

వాని నన్నింట బిగియించి ♦ పదిలపఱచి
బూటకపు నాటకమునందు ♦ బొమ్మ జేసి
విటుని నాడింపవలయును ♦ వేశ్యకాంత.

సీ. నీ మీఁదనే నాకుఁ ♦ బ్రేమ యున్నదటంచు
మించు మోదమున భా♦షించవలయు
నీవు రాకున్న నే ♦ నిముషమైనను నోర్వ
నంచును గన్నీరు ♦ నించవలయు
గాఢానురాగంబు ♦ గలిగినట్లు శిరంబు
ఱొమ్మునగదియించి ♦ గ్రుమ్మవలయు
లేనట్టి వలపు నె ♦ ట్లైన దెచ్చుకొనుచు కొసరి
ముద్దులు వేడ్కఁ ♦ గొనఁగవలయు

తే. గీ. మాటలాడిన నెంతయో ♦ మమతఁగల్గు
నట్టి విధమును జూచి మా ♦ టాడవలయు
వెలది! విటుల విషయమున ♦ వెల వెలంది
యాచరింపంగ దగిన కృ ♦ త్యంబు లివ్వి.

తే. గీ. వేయు నేటికి దరుణిరో ♦ వినుము విటుల
హృదయములు జూఱగొనుటకై ♦ యింతి మనము
నిలయమై యుండవలె మాయ ♦ వలపునకును
కల్లప్రేమ కసత్యవా ♦ క్యంబులకును.

చ. విటుఁ డెవఁడైనఁగాని విను ♦ వేడ్కలనారఁగ నింద్రుఁడంచునున్
బటుతరభంగి వాని సలు ♦ పన్ వలె సన్నుతి; నట్లు సేయుచున్
దటుకున లాగుచుండవలె ♦ ద్రవ్యమువచ్చిన యంతమట్టుకున్
కుటిలవినీలకుంతలల ♦ కున్ ఘనగౌరవ మిందె యబ్బెడిన్.

చిం. తా—అమ్మా! ఇది యంతయు నిదివఱకు నీవు పాడినపాటయే కదా! నీవు చెప్పిన విషయములన్నియు నేను గమనించియే యుంటిని. వానికి భంగము లేకుండనే వర్తించుచుంటిని. ఇఁక నేఁజేసిన లోపమేమున్నది?

సీ. మేళానఁజూచి, వి ♦ రాళిఁ బొందినయట్టి
పూర్ణయ్య కొంపను ♦ ముంచినాను
మోము జూచినయంత ♦ మోహంబు నొందిన
కమలనాభుని నేట ♦ గలిపినాను
పాటకు మెచ్చినన్ ♦ వలచి వచ్చినయట్టి
కొండయ్యకును ముంతఁ ♦ గూర్చినాను
నన్నుయిల్లాలుగా ♦ నమ్మిన మాధవ్యుడా
శ్రీపతిన్ జోగిగా ♦ జేసినాను
తే. గీ. యిరుగు పొరుగూళ్ల కెపుడేని ♦ యేగునపుడు
విడిచియుండగలేక నా ♦ వెంట గుక్క
వరణి వచ్చుచుండెడి భాగ్య ♦ శాలియైన
శిష్టికరణము తలబోడి ♦ జేసినాను.

ఇంక మధుసూదనుని విషయములే చెప్పనక్కరలేదు. అత నికిని నేడో రేపో చెప్పదలంచితిని యుంటిని.

శ్రీహ—ఇంకను నేడో రేపో యేమిటి? ఒకవేళ నీవుచెప్పుటకు సంశ యించుచుంటివేని, నన్నుపంపించుము.

చింతా—అమ్మా! అంత అవసరములేదు. ఆతని కెవ్వరో మిత్రుడు కొంతధనము ఋణముగా నిచ్చెదనని చెప్పియున్నాడట. ఆవిష యమై కనుగొన బోయినాడు. ఇంతలో మనము తొందర పడనేల!

శ్రీహ—అమ్మాయీ! నీకింకను బిచ్చిభ్రమ పోలేదు. ఆతనియొద్ద నున్న యాస్తియంతయు విక్రయించివేసెనని మనయూరిలోఁ బ్రతివానికిని దెలియును. అట్టిచో నీతని కెవ్వరు దేనినిజూచి ఋణము నిచ్చున? ఆతని బూటకపుమాటల నీవు నమ్మ వలదు. ఇట్టివారిని మనమెంతమందిని జూచినాము. ఇదియుం గాక, యాతడు వ్యాపారిబిడ్డ, సామాన్యుఁడుగాడు. మనకంటె నెక్కువ టక్కులు నేర్చినవాడు. ఎట్లో యీవిధముగానే

కొన్నిరోజులు కాలక్షేపము జేయుట కిన్ని మాయవాక్యములు పలుకుచుండును.

చింతా—కానీ! రెండు మూడు రోజులు చూతము.

(సుబ్బలక్ష్మి ప్రవేశించును.)

సుబ్బ—(శ్రీహరిని చూచి) పెద్దమ్మాయి-దేవాంగవాయనే-శరబలింగం వొచ్చాడు.

శ్రీహ—ఏమైనా చీరెలు దెచ్చినాడా?

సుబ్బ—అబ్బో. సాలా పెద్దమూట ఁట్టించుకొచ్చాడు.

శ్రీహ—(చింతామణిని జూచి) అమ్మాయీ! చూచితివా! శరభలింగనివద్ద యెక్కడనులేని పట్టుచీరె లనేకరకము లుండును. నెమ్మదిగా నీతనియొద్ద కొన్ని మనము "పెరుమాళ్లారగింపు" చేయవలయును. ఈతని నిప్పుడు నీవశము జేసికొంటివా మనకెక్కడ లేని చీరెలు దొరకును.

చింతా—పెద్దపెద్దలందఱును వచ్చుచుఁ బోవుచుండిరికదా! ఈస్వల్పపు వ్యాపారమునం దేల దిగవలయును?

శ్రీహ—చాలుచాలు నీమాటలు. వేశ్యలకు కొద్దిగొప్పలతో నేమి పని యున్నది? వర్తకుడైనవాడు పెద్దవ్యాపారమును జేయును. చిన్నవ్యాపారమును జేయును. "చిల్లర" మహాలక్ష్మియని పెద్దలు చెప్పినారు. ఈవిషయమునన్న పరమరహస్యము నీకుఁ దెలియలేదు కాబోలు? వినుము.

సీ. దినవెచ్చమును దెచ్చి ♦ తిన్నగా నిచ్చుచుఁ
బరమమోదము నందు ♦ వైశ్యుఁడొకఁడు
వలసినచీరెలు ♦ వస్త్రంబులను దెచ్చి
యర్పించుచుండు దే ♦ వాంగి యొకఁడు
డబ్బేమి గొనకుండ ♦ నబ్బి నగలు జేసి
కూర్మినిచ్చు సొ ♦ న్నారి యొకఁడు
యనుదినంబును మంచి ♦ యత్తర్వు గొని తెచ్చి
యిచ్చి మోదించు సా ♦ హేబ్ ఒకఁడు

తే. గీ. వేశ్యకును ముఖ్యమైనట్టి ♦ విటులటంచు
జిత్తమందున నెంచుమీ ♦ చిగురుబోడి
వారులేకున్న నే వార ♦ నారియైనఁ
గాపురము సేయఁగలదె ♦ జగంబునందు.

ఒక వేళ నేనిట్టుండెనను జేరదీసినను నేఁ జెప్పినట్లు వచ్చుచు బోవుచుండుట కావలెను భ్యంతరముండదు. వీరిరాక యజమాని కనుమానము వొడమనీయదు. ఇట్టివన్నియు వేశ్యలయొక్క వేదశాస్త్ర రహస్యములు.

(తెరలో)

ఏమ్మాటా- సెప్పరే- కావాలా- లేదా?

శ్రీహ—(చింతామణినిఁ జూచి) అమ్మాయీ! ఆతని నిక్కడకుఁ దోడ్కొని వచ్చెదను. ఎట్లు వలలోఁ బడవేసెదవో!

(నిష్క్రమించును.)

చింతా—(తనలో) వేశ్యవృత్తి యెంత హీనమైనది.

తే. గీ. ఇతఁడు బ్రాహ్మణుండు మరియు ♦ నితఁడు వైశ్యుఁ
డితడు కంసాలి, దేవాంగి ♦ యితఁడు; యితఁడు
కమ్మ; యనునట్టి భేదంబు ♦ గాంచకుండ
వలపుఁ గలిగించి గూడంగ ♦ వలయు నకట
వారసతి వర్తనము పశు ♦ వర్తనంబు.

సుబ్బ—అక్కయ్యోవ్! చెరబలింగాన్ని మెల్లిగా వొకకో కొడు పెయ్యాలి.

చింతా—(తనలో) బిబ్రతుకుఁ గాంచిన నాకెంతయు జాలియగుచున్నది. ఇట్టికన్నెలు ప్రతి వేశ్యాగృహమున నుందురుగదా! వీరు తొలిజన్మమున నెట్టిపాపమును జేసికొని యుండుటంజేసి యీ జన్మమున నిట్టి నీచపుబ్రతుకు ప్రాప్తించినదోకదా!

సీ. పట్టుపాన్పున వేశ్య ♦ పవళింప వీరలు
పాషాణవేదిక ♦ బడవలయు

వెలలేని చీరెలు ♦ వేశ్యధరింపంగ
బాగ్రిశది వీరు దా ♦ ల్పంగవలయు
షడ్రసోపేత భో ♦ జనముసేయుగ వేశ్య
మిగిలిన వీరు మె ♦ క్కంగవలయు
వారసతి ధరించి ♦ పారవేసిన పూల
బంతులె వీరుదా ♦ ల్పంగవలయు
తే. గీ. నీటిలోన నుండెడి పను ♦ లెల్లజేయ
వలయు; విటకాండ్రు వచ్చెడి ♦ భంగి నరయ
వలయు; కటకటా వీరి పా ♦ పం బదేమొ
మిగుల నీచమా బ్రతుకన ♦ మెలంగ వలసె.

(అంతట శ్రీహరి శరభలింగముతోఁ బ్రవేశించును.)

శ్రీహ—రండీ! శరబలింగంగారూ! ఈమధ్య బొత్తిగా మామీద శీత కన్ను వేసినారు. అనుదినమును మాఅమ్మాయి శరభలింగం గారు కనపడుట లేదేమని యడుగుచుండును. ఒకవేళ మా యింటికి వస్తే బట్టలమూట యేమైనా మేము తీసికొందుమని తలంపలేదుకదా!

శర—ఎంతమాట సెప్పావు. చరబలింగం వంతనుమానపోడు కాదు.

చింతా—అమ్మా! ఈయనతో మనకేమి పనియున్నది? ఈరోజున నీయన దారితప్పి యిట్లు వచ్చినారు. ఎప్పుడూ వారు కంజాక్షి యింటికేగాని యితరుల యిండ్లకు వెళ్ళరు.

శర—సరిసరిలే. కంజాక్షికి నాకూ యేదైనా తగులాట ముండదను కొంటుండావా యేంటి.

చింతా—వుండఁ గూడదాఁ యేమి! మీరు మగవారు కారా! అది వేశ్యకాదా.

శర—అట్టే యాబ్రాసిముండ. దానికే సెవడు సూస్తాడు.

శ్రీహ—అమ్మాయీ! నీవు శరభలింగంగారి విషయంలోనా చమత్కారముగ మాటలాడుట. ఆయనను నీవెట్లు గౌరవింపవలెను? (శరభలింగమును జూచి) అల్లుడు గారూ! పిల్లదానితో

నేమిలెండి? అప్పనుగాని, నేనిప్పుడు చూచిన పట్టుచీర యేమా
త్రము ఖరీదులోనుంది? అది మాకేమయిన నందుబాటులో
వుండునా?

శర—(తనలో) ఏంటో! యీళ్లకు కరీదు సెప్పేదేంటి. ఈ సీరిచ్చినా
నంటే కొంత మొగవోటవన్నా కదురుతాది. (ప్రకాశముగా)
అత్తయ్యా! మీకూ నాకూ బేరాలేంటి. మొదవడబ్బు మర్యా
దుండాలి కాని.

చింతా—అమ్మా! శరభలింగంగారికి మనమీద నెంతైన యనురాగ
మున్నది. ఏది! నీవు చూచిన చీర?

శ్రీహ—(సుబ్బలక్ష్మినిం జూచి) సుబ్బలక్ష్మీ! మూట మోసికొని
వచ్చిన వానిదగ్గఱనున్న యాచీర నిట్లు దెమ్మా.

సుబ్బ—(నిష్క్రమించి వెంటనే ప్రవేశించి చీరెను చింతామణికిచ్చును.)

చింతా—(చీరె పుచ్చుకొని) శరభలింగముగారూ! ఇది యెక్కడనుంచి
తెప్పించినారు?

శర—మాకేంకర్మం తెప్పించాలని. మేము నెయ్యలేవా యేంటి. చరబ
లింగమంటే సామాన్యుడనుకొన్నావా యేంటి! మగ్గందగ్గిర కూ
సుండానంటే దెబ్బకు మూరెడు జరుగుతుంది.

శ్రీహ—మీరెక్కడ దేవాంగబ్రాహ్మణులు.

శర—దేవాంగులంటే సామాన్యులనుకొంటుండావా యేంటి. దేవత
లకు అంగోస్త్రాలు "సరప్రాయి" సెయ్యడంచేత దేవాంగు
లని పేరొచ్చింది. మాకులంతో సరియైనకుల మింకోటివుందా!
అయితే వొక్క సిన్నకిటుకొచ్చింది. మొగోళ్లు కొత్త తాగు
బోతులు. ఆడోళ్లు కొందరు కొంత కకుర్తిపడ్తారు. అది
లేకపోతే సెప్పనా! రెండో భేమ్మలముగా వా?

చింతా—(తనలో) విడిమాటలు కులికిపోవ! ఏమి చమత్కారముగ
నున్నవి? (ప్రకాశముగా) శరభలింగంగారూ! ఈచీర నేను
ధరించి మీయెదుట నిలచినచో నెట్లుండును.

శర—అసలే సుక్కల్లో శందురుడులాగుంటావు. ఈ సీర సింగారిత్తే పట్టపగ్గాలుంటాయా! ఏది కట్టుకో సూస్తాను.

శ్రీహ—(చింతామణినిఁ జూచి) అల్లుడుగారి సెలవైనది. కట్టుకొని వారికిఁ జూపించు.

చింత—(నిష్క్రమించి వెంటనే క్రొత్తచీరె గట్టుకొని ప్రవేశించును.)

శర—అబ్బా! అబ్బా! సింతామణి సీరసింగారిస్తే మనస్సు పరిపరి యిధాల పరుగులెట్టూవుండది.

చింత—(తనలో) వీనికిఁ బెద్దరోగము పట్టినది. (సుబ్బలక్ష్మినిఁ జూచి) సుబ్బలక్ష్మీ! శరభలింగముగారికి తాంబూల మియ్యవేమె!

సుబ్బ—ఇదిగో! ఇత్తుండా. (శరభలింగమును జూచి) బావయ్యగారూ! నాకో సిన్న చీరెయియ్యరూ!

శర—నీకూ సీరకావాలి. మూటలోనుంటాది నేతసీర తెచ్చుకో.

సుబ్బ—(చంకలు కొట్టుకొనుచు నిష్క్రమించి వెంటనే ప్రవేశించి) అక్కయ్యోయ్! ఇదిగో సీర శరభలింగం బావయ్యగారిచ్చారని సెప్పకుంటాను.

శర—(తనలో) రవ్వంటి సీర చివార్పణమైంది. అయితేనేం. సింతామణితో చరసం సెయ్యడమే సెయ్యడం. దీన్నిసూస్తూ యిక్కడ కూకుంటే వొళ్ళు దడదడమంటూ వుండది. ఇప్పుడే సీరయిచ్చామా! అచంగతి కూంత కదిపితే భాగ్గునాసికి లోపం వత్తుంది. మరోప్పుడు. కానీ. (శ్రీహరిని జూచి) శ్రీహరీ! సాలా పనుంది వెళ్ళొత్తాను.

శ్రీహ—దయయుంచండి. మీకు మేమెప్పుడూ యధ్యాంతరము గలుగజేయువారము గాము.

శర—(చింతామణిని జూచుచు నిష్క్రమించును.)

శ్రీహ—(సుబ్బలక్ష్మినిఁ జూచి) సుబ్బలక్ష్మీ! ఆచీరె యిప్పుడే కట్టుకొనకు. ఉన్నచీరెలు చినుగనిమ్ము.

సుబ్బ—అక్కయ్య చేతికిచ్చి దాపించుకొంటూ.
చింతా—(తనలో)

తే. గీ. సరసత యనంగనేమొ, యా ♦ సరణిలేక
మాటలపసందు లేక యి ♦ మ్మాసిక వేశ్య
కాంతలను జేరు ఓటులను ♦ గాంచినంత
నవ్వువచ్చును నాకు మ ♦ నంబునందు.

సుబ్బ—అక్కా! అన్నంవేళ్లైంది. లే.

శ్రీహ—అమ్మాయీ లెమ్మ.

చింత—ఇదిగో! వచ్చుచున్నాను.

ఇది ద్వితీయాంకము.

చింతామణి.

లేక

లీలాశుక.

తృతీయాంకము.

రంగము:—[చింతామణి శయనగృహము:— ప్రవేశము:—

చింతామణి, శ్రీహరి]

శ్రీహ—వింటివా? నే నెందుకుఁ జెప్పితినో!

తే. గీ. చిత్తమందు గోరిక జనిం ♦ చినను గాని
పురుషు డెప్పుడు మనవార ♦ తరుణులుండు
వాడ కేరాడు; కావున ♦ వాని జాడ
నరసి; యెట్లైన మనయింట ♦ నడుగు బెట్ట
సలుపవలయును సమ్మోహ ♦ శరము బఱపి.

ఈ విషయమున నతిజాగరూకతతో నుండవలయును. వేశ్య వాడ కనుపించిన యీ పురుషుని చూపులే గృహమ్ముపైఁ బ్రసరించుచున్నవో యెఱుంగవలయును. సాధ్యమగునంతవఱకు జూపులచేత, చేష్టలచేత, వానిని వశునిగాఁ జేసికొని యింట

బ్రివేశ పెట్టవలయును. గృహప్రవేశ మహోత్సవమునకే మనము తొలుత కష్టపడవలయును. తరువాత కట్టకట్టబడిన పాముబలె మనమెక్కడ నుండమనిన నక్కడనే యా విటుం డుండును. (ఇందుక యూరకుండి) ఇంతకును నేను చెప్పందలం చినమాటయే మఱచిపోయితిని. ఈమధ్య నాలుగురోజులనుండి బాదంవారి పిల్లవాడు, నీవు చూడలేదటే, రమణయ్యగా రంటారు అతడు సంధ్యవేళ నను దినమున నిట్లు వచ్చుచున్నాడు. ఈతనిని నీవు పోనీయరాదు. ఇట్టివారే మనకు ముఖ్యముగ నుండవలసినవారు.

తే. గీ. మోహ వారాశిలోపల ♦ మున్గియుండు
మత్స్యమె విటుండు; వెలసతీ ♦ మణియె పల్లె
వీక్షణంబను గాలముచే ♦ విడిచి వాని
బట్టి; మాయవలప నా ♦ బుట్టయందు
బెట్టి మోదంబు నందుచు ♦ వెలయ వలయు.

ఈ బాదంవారి యబ్బాయి విషయములో నీవు మఱచియుండ వలదు. ఇప్పటివఱకు నీతని చిత్తము పెద్దాపురపు వేశ్య కాంతలమీద నున్నది. నీ వెట్లయినను నీతనిని వలలోం బడ వేసికొని, పెద్దాపురపు "కాంతా" నీవైపునకు ద్రిప్పుకొనుము.

(సుబ్బలక్ష్మి ప్రవేశించును.)

సుబ్బ—(శ్రీహరిని జూచి) పెద్దమ్మా! చుబ్బిచెట్టి వచ్చాండు.

చింతా—ఏ సుబ్బిశెట్టి!

శ్రీహ—నీకంతా మఱుపే! మనవూళ్ళో పెద్దసాహుకారు కొడుకు. ఈతనితండ్రి యీమధ్యనే పోయినాండు. పెత్తనమంతా యీత నిదే.

చింతా—తెలిసినది. తెలిసినది. మొన్న యీతని యింటిప్రక్కనున్న పావుకారింటం బెండ్లికి మేళమునకై యరిగినప్పు డీతండు నన్ను జూచినాండు. ఆకారణముచేతనే యీతనికి వెఱ్ఱియెత్తి వచ్చి యుండును.

శ్రీహ.—చూచితివా! అమ్మాయీ! మేళంవలన నెంత ప్రయోజనమున్నదో! కొందఱు సంఘసంస్కారప్రియులు బయలుదేరి వేశ్యలను మేళమునకుఁ బిలువఁగూడదని పలుకుచుందురు. నిజముగా మన బ్రతుకంతయు మేళములమీఁదనే నిలచియున్నది.

సీ. కాళ్ళకుఁ గజ్జెలు ♦ గట్టి యాడుచునప్పు
డు పరవశత్వముజెంది ♦ బరగు నొకడు
శృంగారరసముతో ♦ పొంగి పొరలఁబాడ
డెందమున వికార ♦ ముందు నొకడు
హస్తముల్ ద్రిప్పుచు ♦ నాడుచుండుటనుజూ
చి మదిని ఖంగారు ♦ జెందు నొకడు
వనజాస్త్రు తూపులా ♦ యన నొప్పుచూపులం
గాంచి విరాళినిఁ ♦ గాంచు నొకడు

తే. గీ. మృదుల భాషణంబులకును ♦ మెచ్చు నొకడు
చీరె తగిలిన ముదమును ♦ జెందు నొకడు
మాయమస్తాబు వీక్షించి ♦ మఱుగు నొకడు
హంసనడకల కానంద ♦ మందు నొకడు.

మేళముల కఱిగినప్పుడే మన సౌందర్యాది విశేషములు పదిమందికిఁ దెలియును. వివాహాదికార్యములలో నూరేగింపు మహోత్సవ సందర్భమున మేళము వెనుక నెంతమంది శునకంబులట్లు వచ్చుచుందురో చూడలేదా? జనసంఘమెక్కువగానున్నస్థలములందు మనలఁజూచుట కొకరి భుజములపై నొకరు చేతులువైచి యదిమిపట్టుచు, గాలివ్రేళ్ళపై నిలుచుండి చూడకపోయినచోఁ బ్రాణములు నిలువనట్లు నానావస్థఁ బడుచుందురు.

తే. గీ. విటుల మనములఁ గోర్కెలు ♦ వెలయఁ జేసి
పడపుగత్తెల యిండ్లకుఁ ♦ బరుగులిడగ
జేయజాలిన మంత్రమై ♦ చెలఁగు, గాదె
మేళముండిన నెంతయో ♦ మేలు మనకు.

(ఇంచుక యూరకుండి) పాపము సుబ్బిశెట్టిగారు నిలఁబడియే యున్నారు గాబోలు. (నిష్క్రమించి వెంటనే సుబ్బిశెట్టితోఁ బ్రవేశించును.)

శ్రీహ—(చింతామణినిఁజూచి) అమ్మాయీ! ఈరోజున మనయందు సంపూర్ణమైన కృపవహించి సుబ్బిశెట్టిగారు వచ్చినారు. వీరి నెట్లు మర్యాద జేయుదువో! ఏమాత్రము లోటువచ్చినను గౌరవము దక్కదు.

చింతా—(సుబ్బలక్ష్మినిఁజూచి) సుబ్బలక్ష్మీ! చూచెదవేమి! పెద్ద మనుష్యులు నిలఁబడియుండిరి. ఆకుర్చీ యిటు వేయుము.

సుబ్బ—కుర్చీ తెచ్చును.

చింతా—సెట్టిగారూ! నిలఁబడితిరేమి! నేను మీకు పరాయిదాననా యేమి? కుర్చీమీదఁ గూర్చుండుఁడు.

సుబ్బి—(కుర్చీమీదఁ గూర్చుండును.)

సుబ్బ—మా బావయ్యగారికి కుర్చీ సరింగా సరిపోయింది. అటూ యిటూ రవ్వంతైనా జాగాలేదు.

శ్రీహ—ఏడిశావు. ఇటువంటిమాట లన్నావు.

సుబ్బి—(సుబ్బలక్ష్మినిఁ జూచి) నన్నుజూస్తే నీకు యెకచకాలుగా వుందేం!

చింతా—సెట్టిగారూ! ఈరోజున మీరు మాయింటికి దారితప్పి వచ్చినట్లున్నారు. మనోహరం మిమ్ము రానిచ్చినదా?

సుబ్బి—ఆడితస్సాగొయ్యా! మనోహరవింటి కెవడెళ్ళుతున్నాడు. అప్పుడెప్పుడో కాస్త ఖవపుట్టి యెళ్ళాను. యెళ్ళానన్నమాటే గాని యేఁటో ఛఁటక్కారిముండ. యేమనిసి కెల్లా గౌరవం సెయ్యాలో దానికేం తెల్సు.

చింతా—సెట్టిగారూ! అది సరియైన వేశ్యగనుకనా, మిమ్ముఁదగిన భంగి గౌరవ మొనర్చుటకు.

సుబ్బి—(శ్రీహరినిజూచి) ఏంటేంటి. అత్తమ్మా! అది సరియైందికాదే. మీబోగవాళ్ళలో రెండు రకాలుంటాయా యేంటి.

శ్రీహ.—సెట్టిగారికీసంగతి యింకను గోచరము కాలేదు కాబోలు. మావేశ్యలలో నెక్కడనో గాని సంతానయోగ ముండదు. అందుచేత పల్లె, యానాది, యుప్పరి, యాడిగె మొదలగు నీచ కులములలోని పిల్లలను ధనమిచ్చి తెచ్చుకొని యాట పాటలు నేర్పించెదరు. అది వేశ్యయే యగును. ఇట్టివారే మాలో నెక్కుఁడుగ్రుందురు.

సుబ్బి—ఏంటి. సెప్పవింకాను. నిజవే యీసంగతి. ఇంత కష్టపడ్డా భోగంవోళ్ళకు పిల్లలుట్టకపోవడం అమ్మోరి శాపంకాబోసు. పైకి డాబుగా యేసాలు యేసేవాళ్ళల్లా యీరకవే? నేను యేవో అనుకొన్నాను.

శ్రీహ—ఈవిషయములో సందేహ మేమియు లేదు.

సీ॥ సామర్లకోటలో ♦ సంతలోఁగొన్న గ
వళ్ళది నేఁడుగో ♦ పాలమువ్వ
మూఁడు కాసులనిచ్చి ♦ పుచ్చుకొన్నరజకి
పద్మాక్షియై నేఁడు ♦ పరిణమించె
కనిపెంచలేక యి ♦ చ్చిన దెచ్చుకొనినట్టి
పల్లెది పుష్పమై ♦ పరిఢవిల్లె
సాలెవిధవకును ♦ జన్మమందిన ముండ
వనజాక్షియై మోహ ♦ వాసిగాంచె

తే. గీ. ఆటపాటలనేర్చి శ్రీ ♦ ధరమనంగ
బొల్పెసగినది యానాది ♦ ముండకాదె!
ఱేఁడు నేటికి మీఱును ♦ వెల్లినట్టి
పాతకి మనోహరంబు ను ♦ ప్పరిదికాదె.

సుబ్బి—అబ్బే! ఇంతేనా యీళ్ళ పటాటోపం. ఈళ్లందరికే మాట కేవిగాని, మనోహారం యిషయంలో నీవు సెప్పినమాట నిజవే. ఉప్పరిది గనుకే కాబోసు. ముద్దెట్టుకుంటే వుప్పగా వుంది. ఛీ! రోతేసింది.

చింతా—అటువంటిదానింటు మీరేమని యడుగుబెట్టితిరి.
సుబ్బి—బుద్ధి గడ్డితిని యెళ్ళివాను. సెంపలేసుకుంటాను. ఇంకెప్పు డన్నా దానిం టకుగెళ్తు మా అబ్బాయితోడు.
చింతా—పోనీయండి. అంతమాట యెందుకు. మీనోటితో నేచెప్పాను. మనోహరము బాగుండునా? నేను బాగుందునా?
సుబ్బి—ఆ సెట్కారిముండకీ నీకు పోలికెక్కడ. నీది నికామ్సనరుకు. అందసందాల్లో అది నీలో యేన్నోవంతు.

సీ. సందమామకయినా ♦ సాల వంకున్నది
నీకేమి వంకుంది ♦ నీరజాచ్చి
సెంగల్వ పుస్పాలు ♦ సిగ్గంతో పడ్తాయి
నీకళ్ళు సూస్తేను ♦ నీల వేణి
సన్నని నీనడుం ♦ సక్కదనానికి
సింహాలు భయపడు ♦ చిగురుబోడి
నీనడకందంకు ♦ నిజవుగా హంసలు
తలలొంచుకుంటాయి ♦ కలికిమిన్న

తే. గీ. యింద్రినీలాల్ని మెక్కువ ♦ యెక్కిరించు
తాయి నీతలపీసులు ♦ ధరణిలోన
యెక్కడెతికినగాని మీ ♦ యేశ్యలందు
నీకు బోలిందిదొరకదు ♦ నిజవు నిజవు.

ఇందర్లోకంలో యింద్రుడికి సింతామణివుంది. భూలోకంలో మాఅంటోళ్ళందరికి నువ్వు సింతామణివి.
శ్రీహ—ఏమండోయి! సెట్టిగారూ! మేము తక్కిన వేశ్యలవంటి వారమని తలచితిరా యేమి! మాయంటి వాళ్ళందఱకును జింతామణిపని పలుకుచున్నారు. అట్లున్నను నుసుపకుడు. ఏమిటో మీవంటి పెద్దమనుష్యులతోడనే మాఅమ్మాయి మాట్లాడును. కాని, గోపాలం కొంపలాగును మాయిల్లు పందిలిదొడ్డికాదు.

సుబ్బి—అత్తమ్మా! కోపపడకు. కసింత నోరుజారింది. మీసంగతి సందర్భాలు యెఱగనాయేటి. ఇప్పుడంటే మీవక్కడ మేడకట్టావుగాని, మాఅయ్య మీయింటిపక్కనేగా నాచేత సిల్లరదుకాణం పెట్టిచాడు. అప్పుడు మీసింతామణి యెచ్చాలకి నాదగ్గరకొచ్చేది. బావయ్యా రవ్వంత బెల్లపెట్టవా అని అడిగేది. అట్టాటిది, యిప్పుడు పెద్దదై నాకు సదువు సెప్తావుంది. మొన్న మాయింటిపక్క కోవట్లోట్లో మేళానికొచ్చింద. అప్పుడు సూశాను. మేజువాణీకెల్లినాను. అబ్బా! యేవాట, యేంపాట. చిరినవ్వు నవ్వుతూ సేతులు తిప్పకొంటూ నామూతిమీద పోడవబోయింది. పోడుస్తుందే అనుకొన్నాను. ఇంతపనిసేస్తే నలుగురూ యెకసకాలు చేసేవారే!

శ్రీహ—అల్లుడుగారూ! దానికి మీయ డతిమోహమున్నది. దాని యభిప్రాయము మీరు కనగొందురుకదాయని యట్లు చేసినది. నిత్యము దానికి మీమీద మోహమున్నదని చెప్పని ఘడియ యేలేదు. నేను మీకు కబురుపంపినచో మీరేమనుకొందురో యని తలంచి యూరకొని భగవంతుడు మీదర్శన మెప్పటికొసంగూర్చునో యని వేచియున్నాను.

సుబ్బి—(తనలో) ఈమాట నిజవే. ఇందులో యేమీ సందేహంలేదు. (ప్రకాశముగా) ఇటుసూడు. శ్రీహరీ! మేళంలో మీఅమ్మాయిని సూసినకాడినుంచి యికారంపుట్టింది. కాని వద్దామంటే యేపారం తొందరసేత రాలేదు. ఇంకోరహస్యం. యేమిటంటే యేపారాయన మధుసూధనంపంతులు వుంటాడు. కసింతజాడ తెలిసిందంటే నాపరువు సిలువునా తీసేస్తాడనికూడా సందేహించాను. (తనలో) ఒకవేళ నేనిక్కడవుండగా అతడొచ్చాడంటే కొంపమునగుతుందే. ఆడు మాసెడ్డోడు. మక్కలిరగతంతాడు. అంతగా అనేవొస్తే యిళ్లు నన్నిక్కడో దాసేస్తాను. (ప్రకాశముగా) అయినా! నాకాభయవేలేదు. మీపంతులునాకు అర

పంచి రూపాయలియ్యాలి అది తీర్చినావలేదు ఇంకా అప్పు కావాలని నాల్గురోజులకిందట వొచ్చి అడిగాడు.

సుబ్బ—(శ్రీహరినిఁజూచి) పెద్దమ్మా! నల్లమందు లేదంటివే. డబ్బిస్తే మనరామన్న బజారెల్తాడు.

శ్రీహ—ఎక్కడనుండి డబ్బు తెచ్చియివ్వను రామన్నయిప్పుడే బజారు వెళ్లునా?

సుబ్బి—అత్తమ్మకు నల్లమందు లేదాయేంటి ఈపాడలవాటెందుకు నేశావు?

శ్రీహ—బాబూ! పెద్దమనుష్యులు మీరు మీతోఁజెప్పఁగూడదు. ఏమిటో పెద్దముండను కాస్తనడుమునకు పట్టుగా వుంటుంది.

సుబ్బి—ఇదిగో! ఈరూపాయిచ్చి మందు తెప్పించుకో (అని రూపాయయిచ్చును.)

శ్రీహ—(పుచ్చుకొని) అల్లుడుగారు కోవటులలో జన్మింపవలసిన వారు గారు. (చింతామణినిఁ జూచి) నీవనుదినమును సుబ్బిశెట్టిగారు, సుబ్బిశెట్టిగారని స్మరించుచున్నందులకు నీభాగ్యవశమున నాయన నేడువచ్చినారు. ఆయనచిత్తము, నీభాగ్యము.

(నిష్క్రమించును)

చింతా—సుబ్బలక్ష్మి! వెండిపళ్లెములో నిన్ని యాకులు వక్కలు మొదలగునవి వేసి తీసికొనిరా! అత్తరుసీసా కూడఁ దెమ్ము.

(సుబ్బలక్ష్మి నిష్క్రమించి వెంటనే పళ్లెముతోఁ బ్రవేశించును.)

సుబ్బి—(తనలో) అతర్వ నాకు రాస్తుంది కాఁబోసు. రాయకముందే వొళ్ళు దడదడ మంటూవుంది. సెయి తగిలిందంటే కంపరం సెప్పనా?

సుబ్బ—(సుబ్బిసెట్టినిఁ జూచి) బావయ్యగారి కదేమిటి. వంటిమీదంతా తామరాయేంటి? బాగా గోకి నిమ్మకాయ పుల్సొట్టించలేకపోయారు?

సుబ్బి—ఓసెల్లో! మంటకి సావడవే. మందిముందె సెప్పావు.

చింతా—(సుబ్బలక్ష్మిని జూచి) అది తామరయునరాదు. అది వైశ్యులకుండు సిరి.

సుబ్బి—మంచిమాటన్నావు. యెట్టిమొగం దీసికేం తెలుస్తుంది.

(తెరలో)

సుబ్బలక్ష్మి - సుబ్బలక్ష్మి

సుబ్బి—(తనలో) పీడవదిలింది.

చింతా—(తనలో) వంటివిండ తామరయు, జేతులకుఁ దీటయు గలిగి కబంధుని చందమున నొప్పుచు, శరీరచ్ఛాయయందు గాకిమే మేలనిపించుచు, భరింప శక్యముగాని గబ్బువాసనతో నొప్పుచున్న యీలేఁడొక విటుఁడు ఇట్టి వారికొఱకే కాబోలు. భగవంతుఁడు నారాంగనల సృజించినాఁడు. ఛీ! ధనమునకై యెట్టి నీచకార్యము సేయవలయును.

సీ. కుంటివైనను లేక ♦ గుడ్డివైనను గాని
సంధియుఁబునుపీడి ♦ పొందవలయు
కుష్ఠుఁడైన, మఱియుం ♦ బష్టుఁడైనను నేవ
గింపక వేడ్క ర ♦ మింపవలయు
కడు నీచుఁడైనను ♦ బ్రహ్మర్షిసుతునకుఁ దుల్య
డవటంచుఁ గడు బొగ ♦ డంగవలయు
రూపహీనుఁడైన ♦ రూపవంతుఁడవంచు
బ్రియవాక్యములను మె ♦ ప్పింపవలయు
తే. గీ. యెట్టి రోతకైనను నోర్చి ♦ యెసఁగవలయు
గాక యుండిన ధనమెట్లు గలుగు? వెంప
డ తిరమై పుట్టుకంటె వ♦నాంతమందు
జెట్టుగా జనించుటయె మం ♦ చిదగుఁగాదె.

సుబ్బి—చింతామణీ! మాఅలోచిస్తుండావే. సిగ్గుపడుతుండావా యేంటి. సిగ్గక్కఱలేదు. సుబ్బిశెట్టి సిరోడు. ఈయూల సూస్తావుగా, యూంపారాయన సరసకెల్లా వుండూడో. కోమటాయన సరస వెల్లా వుండూడో.

చింతా—(తనలో) నీవాడనేయని చెప్పినవారిదివఱకెంతమంది కలరో! ఈతనియొద్ద సరసత్వమున కేమియు లోపములేదు. (ప్రకాశముగ) సెట్టిగారికి యీరోజున నామీద దయవచ్చినదికదా! మాభాగ్యము పండినట్లే.

సుబ్బి—కాతా సెడగొట్టుకోకుండా వుంటే నీయిల్లు పచ్చతోరణం నిత్తెకల్లేణంగా వుండదూ.

చింతా—మీదయ యుండవలెను. అనుదినమును మీరు మాయింటికి వచ్చుచుండవలయుననియే నాకోరిక.

సుబ్బి—అద్దది. మహామంచిమాట సెప్పావు. ఇహ నీకు తక్కువేవుంది. కాని, చిన్నరహస్యం. వంతులుండకు మఱి!

చింతా—ఉండనిండు. మీకంటె నాకెవ్వరెక్కువా?

సుబ్బి—అయితే యీడ్సిపాజేస్తావాయేంటి. నే సెప్పానని అనేవు సుమా! నామీదపడి యేడుత్తాడు. సరేగాని, నామీద నీకు సాలా మోహంవుందని మీయమ్మ సెప్పిందికదా! నిజవేనా?

చింతా—నిజమోయని సన్నడుగుచుంటిరా? చూడుడు ఆపేక్షయున్నదో లేదో. (నెమర కణతల యొద్ద మెటికలు విఱచును.)

సుబ్బి—(సంతోషముతో) నిజమే. నిజమే. యెన్నిరిగాయి. ఆపేచ్చవుంది. ఎందుకింత ఆపేచ్చవుండాలి?

చింతా—మీరు రసికాగ్రేసరులు. సుగుణవంతులు. చేసినచో స్నేహము మీతోడనే చేయవలయును. తక్కినవారు మీకాలిగోరునకుం బోలరు.

సుబ్బి—(సంతోషముతో) అబ్బో! అబ్బో! దీనికి నేను నచ్చాను. వహవ్వా! నాపుణ్యం పండింది. యెదవడబ్బు పోతేనేంగాక! సరసంసేస్తే దీంతోటే సెయ్యాలి.

చింతా—(సమీపించి) శెట్టిగారికత్తరువు వ్రాసెదను. (వ్రాయుచున్నది.)

సుబ్బి—ఓహోహో! సంతోసం పట్టలేకుండావున్నాను. శరీరం

ఝల్లుమంటూవుంది. సింతామణీ! అతర్వాకంపు మహా పరిమళ
గానేవుందిగాని, యెట్లాగైనా, వల్లిపాయ పుల్సోసనకు సాలదు.

చింతా—(నవ్వును)

సుబ్బి—(పరవశుండై) ఏన్నవ్వు! ఏన్నవ్వు! బంగారు సిదిపి పచ్చాశాయలో
యేసి కాసెయ్య బుద్దేస్తుంది.

చింతా—(తనలో)

తే. గీ. విటులు వెలకాంత చేసెడి ♦ ప్రియములకును
నబ్బి తబ్బిబ్బుజెందుచు ♦ నోడలుడిలియు
నట్టి మోహాబ్ధిలోమున్గి ♦ తుట్టతుదకు
బిచ్చమెత్తుకొందురు గదా ♦ పృథ్వియందు.

ఇదిగో! ఆకులురాసితిని. తాంబూలము వేసికొనుడు (పళ్లె
ము ముందుబెట్టును.)

సుబ్బి—"అలవాటులేనెపూనసం చేసుకొంటే మూతిమీసాలు
కాలినాయంట" పొద్దల్లా కొట్లుమీదకూసుండేవాణ్ణి తాంబూ
లవలవా ఏట్లావుంటుంది. నీదగ్గఱకు వచ్చానుకదా నెమ్మళం
మీదలవాటు సెయ్యి. దీనిమాటకేంగాని, పళ్లెంసాలాపెద్దదే.
ఇంత పెద్దపళ్లెం యేబోగందానికుంది? ఇది పంతులు సేయించిం
దేనా యేంటి?

చింతా—గట్టిగా మాట్లాడకుడు.

సుబ్బి—(భయముతో) పంతులుండాడా యేంటి. సెప్పు. సెప్పు.
ఎనకదాచినావా యేంటి కొంపదీసి. నాకు యీపుమీద తాసా
మర్పావాయిస్తాడు. మాసెడ్డోడు.

చింతా—(తనలో) ఎంత ధైర్యచిత్తము గలవాడు. (ప్రకాశముగా)
సెట్టిగారూ! భయమందవలదు! మీ ప్రాణమునకు నాప్రాణ
మడ్డువేసెదను.

సుబ్బి—అదీమాట.

(తెరలో)

అమ్మాయీ!

చింతా—మా అమ్మ పిలుచుచున్నది.

సుబ్బి—(తనలో) శనిగొట్టుముండ.

శ్రీహరి—(ప్రవేశించి చింతామణి చెవిలో నేదియో చెప్పి నిష్క్రమించును.)

సుబ్బి—తల్లీ కూతుళ్ల రహస్యాలు నన్ను గురించేనా యేంటి.

చింతా—సెట్టిగారు! మీరీ దొడ్డితోవను నడుగుడు. పంతులు వచ్చుచున్నాడఁట. రేపు మీరు తప్పక దయచేయుడు. రాక పోయినచో నన్నుఁ జంపుకొని తినినట్లే.

సుబ్బి—నువ్వొట్టెట్టుకోవద్దు. నేను వచ్చినట్లే. అమ్మతోడు వస్తాను.

(నిష్క్రమించును.)

చింతా—(తనలో) ఎందుచేతనోగాని నేఁడు నాయెడమకన్ను మిగుల నదరుచున్నది. పురుషులకు కుడికన్నును స్త్రీలకెడమకన్నును నదరినచో నేమో శుభంబు లొదవునని పెద్దలు చెప్పుదురు.

తే. గీ. మదినిఁ బరికింపఁగా, వెల ♦ మగువ గృహము
నిత్యశోభనలీలకు ♦ నిలయమగుచు
వెలసి, ధనము నెప్పుడు గుఱి ♦ పించునట్టి
వైశ్యునిదుకాణమని తల ♦ పంగవలసె.

(ఎదుటజూచి) అమ్మో! మధుసూదనుఁడు దొడ్డితోవను వచ్చుచుండెనేమి? ఈతఁడెప్పుడును నీదారిని రాలేదే. నావిషయమై యీతని కేమైన ననుమానము గలిగి యిట్లు జేసియుండునా? సుబ్బిశెట్టిని దొడ్డితోవను బొమ్మంటిని. ఒకవేళ నీతఁ డాతనిని జూచియుండ లేదుకదా! చూచి యనుమానమందియే యుండునుగాక! నన్నేమి చేయఁగలఁడు? చేతఁ రొక్కము లేని వీనికెట్లో. నేఁడో రేపో పొమ్మనఁ జెప్పఁదలఁచియేయుంటిని. అది

యుంగాక, యీతని హృదయమున కనుమానము గలుగకుండ నేఁజేయఁ జాలనా?

తే. గీ. ఉంచుకొనువాని మఱుఁగున ♦ నువిద దుష్కృ
తంబుల నొనర్చి వానిచి ♦ త్తమున కేమి
సంశయము గల్గకుండగ ♦ సల్పజాలు
సత్కృతములకు బాసలకును ♦ నాటపట్టు
గాదె వేశ్యమానసము జ ♦ గంబునందు.

ఇదియొక పెద్దకార్యముగా నేను యోచింపనేల!

తే. గీ. సకలవిద్యలనేర్చిన ♦ జ్ఞానమెల్ల
మంటలోఁగల్పి, మానాభి ♦ మానములను
విడిచి, విటులకు మానంబు ♦ విక్రయించు
నేనసత్యమాడగ భీతిఁ ♦ బూననేల?

(మధుసూదనుడు ప్రవేశము.)

మధు—(తనలో) సుబ్బిశెట్టి నేడీ గృహంబున కేల వచ్చెనోగదా! చింతామణి నిమిత్తమే యైయుండునా? ఈతడు రహస్యవృత్తిని బ్రవేశించుటకు రానివాఁడేని దాడ్డితోఁగ నేల పోవలయును? ఏమో! నామనంబున నించుక యనుమానము గలుగుచున్నది.

సీ. పరిమళద్రవ్యంబు ♦ పైఁ రోత జనియించి
నీరుల్లిపై వేడ్క ♦ నిలిచెనేమొ
వివిధమృదూక్తులు ♦ వెగటుగాఁగనిపించి
గార్ధభస్వరకాంక్ష ♦ గలిగెనేమొ
హాటకావళికాంతి ♦ యతికటువుగదోచి
తామరపైఁ గాంక్ష ♦ తగిలెనేమొ
సన్ననికాయమ ♦ సహ్యమై స్థూలదే
హాలింగన భ్రాంతి ♦ యలరెనేమొ

తే. గీ. యతిసుగంధ లేపనముపై ♦ నాసవిడిచి
మురికికంపుపై చిత్తంబు ♦ మురిసెనేమొ

కోరమీసముల పయిసఁ ♦ గోర్కెఁబోయి
బోదకాళులపై బుద్ధి ♦ పోయెనేమొ.
(చింతామణిని సమీపించును)

చింతా—(లేచి) రండి!

మధు—(ఆసీనుఁడై) సుబ్బిసెట్టివచ్చెను కాబోలు. కాసులు, మొహరీలును కుంచముతోఁ గొలిచెనా? మానికతోఁ గొలిచెనా? కొలిపించుకొనునప్పుడు నీవు మిగుల జాగ్రత్తతోనుండవలయును. కోమటులు కొలతలోఁ గొంపదీసెదరు. వారియొద్ద రెండు రకముల కుంచములుండును. పిచ్చికుంచము, మంచి కుంచము.

చింతా—(తనలో) నే ననుకొనిన ట్లీతఁ డనుమాన మందినాఁడు.

తే. గీ. కల్ల కపటంబులను తరం ♦ గముల చేత
బరగు మోహవారాశిలో ♦ పలనున్న
ధనముఁనిచ్చి కామముఁదీర్చు ♦ కొనడి విటుఁడు
గనక పరులతోఁగూడుటఁ ♦ గాంచెనేని
బాగులుపదియేమొ తనకొంప ♦ మునిగినట్లు.

(ప్రకాశముగా) పంతులుగారూ! మీచమత్కార వాక్యములు నాకంతమాత్ర మర్థముగాకపోవు. మీయనుమానము నాకుఁదెలియును. సుబ్బిసెట్టినాకేల కాసులును మొహరీలును నొసఁగును?

మధు—మోహముచేత.

చింతా—అవునవును. మీరిట్టి యనుమానపు మనుష్యులని నాకు దెలియును. నాహృదయము మీకుఁదెలియదా? ఎంతమంది రాజాధిరాజుల వంటివారు పాదాక్రాంతులై బ్రతిమాలినను నిరాకరించి, యింతకు పూర్వము నాయభీష్టములన్నియు దీర్చుచున్న మహాసీయుల బోద్రోసి, యెంత వేశ్యనైనను బాపము నకుఁ గొంతవెఱచి, మీయందున్న యనురాగముచే మీకు

గట్టుబడి యుండుటచేతనే మీరిట్లనఁగలిగితిరి. మిమ్ముల నమ్ముకొని యుండుటచేతనే మాయవస్థ యిట్లున్నది. మాయమ్మచేఁ జీవాట్లు దినలేక చచ్చిపోవుచున్నాను. మీరు రదుదెంచినంతనే నే నెక్కడ ధనమడిగి పోవుదునాయని యిట్లు పలికితిరని తోచుచున్నది.

మధు—(తనలో) నిశ్చయముగా దీనికి నాయందు వలపధికము.

తే గీ. ఎందఱెందఱు చనుదెంచి ♦ కుందరదన!
మమ్ముఁగూడుము కూడిన ♦ మాస్యమిత్తు
మనుచు యాచించియుండిరి ♦ యతివ వారి
కడ్డిపోచగ గనదె నా ♦ కారణమున.

వేశ్యలలో నింత యనురాగమున్న వారి నెందును జూచి యుండలేదు. (ప్రకాశముగా) చింతామణీ! ఆగ్రహింపకుము. సుబ్బిసెట్టి యిక్కడకు వచ్చినాడా లేదా?

చింతా—రాలేదని యెవ్వరుచెప్పినారు. వచ్చినాడు. అతఁడు వచ్చినంతమాత్రముననే మీరిట్లను మానమందవచ్చునా? ఇట్టికులములోఁ బుట్టుటంజేసి నేను మీకెంత చులకనయితిని.

మధు—అతఁడు దొడ్డిత్రోవను బోవునంతటి యవసర మేలవచ్చెను?

చింతా—అట్లడుగుఁడు. ఆతనిబంధువుల గృహంబులలో నదేయూరనో వివాహము జరుగునట. ఆ సందర్భమున మేళమునుగూర్చి మాట్లాడుటకై వచ్చినాడు. నాకడకరుదెంచి యడుగగా, నాకిదియంతయుఁ దెలియదు. పెద్దదిమాయమ్మ యున్నది. దానినడుగుఁడని చెప్పితిని. మాయమ్మ పెరటిలో బూలమొక్కలకు నీరుపోయుచున్నది. అతఁడక్కడకు వెళ్ళిమాట్లాడి, మరల వీధిగుమ్మము వరకు బోనేలయని పెరటిత్రోవను బోయియుండెను. ఇంతమాత్రమునకే మీకనుమానమా! ఇట్లయిన నేనేమి మీతోఁగాపురము సేయుదును. ఇంతనమ్మకము లేకున్న నెట్లు? అసలు నేనీ వృత్తిరే మాని భగవంతుని ధ్యానించుచు దనువు

వెళ్లదీయఁదలఁచుచున్నాను. ఇంకమీాసంగతి నేటితోఁ దెలిసినది.

మధు—(సమీాపించి)

మ. కనుబొమ్మల్ ముడివేసి కన్నులను ర ♦ క్తచ్ఛాయఁగల్గించుచున్
గనినన్ నేను భరింపఁగాఁగలనె స ♦ త్కారుణ్యమున్ బూని; నే
నను వాక్యంబులకున్ క్షమించుచు సము ♦ ద్యత్ప్రీతి జేకూర్పు మ
వ్వనజాతాంబకు జేయు సాయకములన్ ♦ వారించి చింతామణీ.
సగసమున కనిన నింతకోపమా!

తే. గీ. ముక్కుచివఱ నింతటికోప ♦ మున్న నెట్లు
దాళగలవాఁడ నేనును ♦ దరుణిమిన్న
భవ్య భవదీయ కరుణకుఁ ♦ బాత్రుఁడనగు
నన్ను నాదరింపవలదె వన్నెలాడి.

చింతా—(తనలో) ఈవిటుల చర్యలు నాకు నవ్వుఁబుట్టించును.

తే. గీ. వారలేదైన నన్నచో ♦ వారనారి
భావమున గిన్కదాల్చిన ♦ భంగిఁదోఁచి
యప్రియంబులు బలికిన ♦ నవ్వి సైప
లేక యిటుబ్రతిమాలుటే ♦ గాక కాళ్ల
బిసుకమన్నఁ బిసికెదరు ♦ విటులు భళిర!
సరసమన్న నిట్టిమాటలాడుటా! నాహృదయము మీా
రెఱుగరా.

మధు—రమణీ! నీయనురాగము నాకుఁ దెలియదా! నీవు లోకములో
వేశ్యలతోఁ బాటుదానవు గావు.

చింతా—అందులకని యే యట్లంటిరి.

మధు—అబ్బా! ఆవాక్యమునే యస్తమానము సాగదీసెదవేల?

చింతా—పంతులుగారూ! మీారరిగిన ధనమువిషయములో సఫలీ
కృత మనోరథులైతిరా?

మధు—అయినట్లే.

చింతా—చేతి కందినదా?

మధు—అందలేదు. కాని మనకిక నావిషయమలో నేమాత్రమును సందియముండదు.

చింతా—మీరెప్పుడును నిట్లే చెప్పుదు గోడమీది పిల్లిచందమున దాటుచుందురు. మీ మాటయందొక సత్యమైనను గానిపించుట లేదు.

మధు—(తనలో) ఈపలుకులయం దసత్యమేమియును లేదు.

తే. గీ. వేశ్యమాత్రలైనను లేక ♦ వేశ్యలైన
నర్థముంగూర్చి యడిగిన ♦ యప్పుడెల్ల
నిదిగొ యదిగోయటంచును ♦ నెంతొముదము
గలుగ; నన్నృతవాక్యంబులం ♦ బలుకునుంట
విటుల లక్షణమేకదా ♦ పృథ్వియందు.

(ప్రకాశముగా) ఇంక నావిషయములో నీవు సందియమంద నవసరము లేదు. నాకొక యాప్తమిత్రుండొకండు గూడి నాడు.

చింతా—సరే. ఇదివఱ కిచ్చెదనన్న మిత్రులిచ్చి యుండిరిగదా. ఇంక నీతడిచ్చున; మీరు పుచ్చుకొందురు. ఇదివఱకు లేని యీ మిత్రుండిప్పుడెక్కడనుండి వచ్చినాడు?

మధు—నీవును నాతని వినియే యుందువు. బిల్వమంగళుండు.

చింతా—వాసుదేవమూర్తిగారి కుమారుండా యేమి? ఆతఁడు మీకు స్నేహితుండా! ఒకసారియైనను నాకీసంగతి జెప్పియుండలేదు.

మధు—చెప్పిననేమి చేయుదువు?

చింతా—అట్టి యఖండలక్ష్మీసంపన్నుండు మీకు హితుండైయుండెను గదాయని సంతోషించెదను.

మధు—ఇప్పుడుమాత్రము మిగిలినదేమున్నది. వినుము. ఆతఁడును నేనును నొక గురునియొద్దనే విద్య నభ్యసించితిమి. చదువు మానినతరువాత, నొకరికొకర మింతపఱకును గలిసికొనలేదు. నేడు తలవనితలపుగా నాతనిని నేనుజూచుట తటస్థమైనది. ఆతఁడు నాయెడలఁ జూపిన చిరతరాబాల్య ప్రభృతిస్నేహవాత్స

ల్యము జెప్పదరము గాదు. ఆతనివలన నాయిబ్బంది తీరునని ధైర్యమున్నది.

చింతా—వాసుదేవమూర్తిగారు కుబేరునితోఁ దుల్యుఁడని నేను విని యుంటిని. కాని, బిల్వమంగళుఁడు తండ్రిచాటువాఁడుకదా!

మధు—ఆసంశయము మక్కరలేదు. వాసుదేవమూర్తిగారు వ్యవహార భారమంతయు నీబిల్వమంగళునిపై వేసినారు. అన్నిటికిని నితఁడే స్వతంత్రుఁడు. ఈరోజుననే యాతనిని నేను గలిసికొని యుండుటచే మనవిషయమై యేమియు ముచ్చటింపక వచ్చితిని. మరల నేను రేపాతని యొద్దకరిగి వలసిన ధనమడిగెదను. వాత్స ల్యముసంజేసి నేనడిగినదే తడవుగా నాతడిచ్చితీరును. వానికున్నంత ధన మీయూర నెవరికినిలేదు.

చింతా—ఆతనివలన మీకు ద్రవ్యము లభ్యముకాఁగలదని ధైర్య మున్నది. (తనలో) బిల్వమంగళుఁడు విద్యయందపరసరస్వతి యనియు, రూపమున మన్మథుండే యనియు, నైశ్వర్యంబునఁ గుబేరుఁడనియు వినియున్నాను. ఆతనితో మైత్రిజేయుటకు నాకుఁ గుతూహలమగుచున్నది. కాని, నా యభిప్రాయము నావంతయు బయలుపెట్టక, చిత్రముగా నీకార్యమునందు మధుసూదనునే నియోగించెదగాక. [ప్రకాశముగా] పంతులుగారూ! మీయందున్న యనురాగముచేత నీయుదలచినచో నా బిల్వమంగళుఁడు మీకెంత ధనమైనను నొసంగఁగలఁడు. కాని యీవిషయంలో మీకు నేనొక సంగతిఁ జెప్పదలఁచినాను. నేజెప్పినట్లు మీరు చేసెదనని చెప్పినచో వచించెదను.

మధు—చింతామణీ! ఎప్పుడైనను నేను నీమాటకన్యథా వచించితినా!

తే. గీ. సత్యభామకు గృష్ణుడే ♦ సరణి నతివి
సముద్రైయుండెనో యట్లె ♦ నాతినీకు
నేవిధేయుండ నంచును ♦ నీదుమదిని
దలఁచి వచియింపదగుసుమీ ♦ తథ్యముగను.

చింతా—పంతులుగారు! మీకు బిల్వమంగళుడు స్నేహితుడని చెప్పితిరికదా! ఆతని నెట్లయిన నుపాయముజేసి యిక్కడకు గొని రాగలరా?

మధు—(తనలో) ఏమిది! ఇది యిట్లగుచున్నది. బిల్వమంగళునిపై నేమైన భ్రాంతి వొడమినదాయేమి? (ఆలోచించి) కాదుకాదు. లేనిపోని యనుమానమును నామనంబున బ్రవేశింపనీయరాదు. ఈచింతామణి హృదయము నేను సంపూర్తిగ నెఱుంగుదును. నేను దీనియింట నడుగు బెట్టినదిమొదలిది యన్యుని గన్నెత్తియైన చూడలేదు. (ప్రకాశముగా) చింతామణీ! ఆతనిసంగతి నీవు పూర్తిగా వినియుంటివో లేదో! ఆతడు సకల శాస్త్రములును నభ్యసించిన మహాపండిత చక్రవర్తి. ఆచారసంపన్నుడు. సద్గుణములన్నియు నొక ముద్దగాఁజేసి యాతని యందు బితామహుఁడుంచినాడు. పరనారీ సోదరుఁడని చెప్పవలసి వచ్చినపుడాతనినే చెప్పవలయును. అట్టివాడు వేశ్యాగృహంబు నెట్లు ప్రవేశించును? ఈవిషయము కొంచెము సందేహమే! అయినను నాతఁడియ్యెడ కరుదెంచినందువలన బ్రయోజన మేమియున్నదో చెప్పితివికాదు.

చింతా—ఈరహస్యము మీచిత్తమందే యుంచుకొనుడు. ఆతఁడు మహాధనవంతుడని మీరే నుడివియుంటిరికదా! మీరేపన్నుగడమీదనైనను నాతని నిక్కడకుఁ దోడ్కొని వచ్చితిరా మీభాగ్యము ఫలించినట్లే భావింపుడు. మీదగ్గఱనున్న ధనమయిపోయినది. ఈవిషయములో మాఅమ్మ నన్ను రంపపుకోత కోయుచున్నది. మీ మీదనున్న మోహముచేత మిమ్ము నేను విడువలేక యున్నాను. ఆబిల్వమంగళుడు మనయింట నడుగుబెట్టినఁజాలు. మీకు ధనముచేకూరినట్లే భావింపుడు. మనమిరువురమును స్వేచ్ఛగ సుఖింపవచ్చును. బిల్వమంగళునియొద్ద నున్న ద్రవ్యమంతయు మీకును నేనును ననుభవించు మార్గము నేఁజేసెదను. ఆతనియెడల నడపవలసిన

మాయతంత్రమంతయు నే నడిపెదను. కాని, మీరు మాత్రి మాతనియొద్ద నెట్టి చమత్కార వాక్యములాడి, యాతని హృదయము నాకర్షించి యిచ్చుటకుఁ దోడ్పాటుని వచ్చెదరో, యా విషయమున మాత్ర మతి నిపుణతతోఁ బ్రవర్తింపవల యును.

మధు—చింతామణీ! నీవుచెప్పిన యుపాయము కడుఁ జక్కగనే యున్నది. కాని,

సీ. సకలవిద్యా రహ ♦ స్యంబులనారసి
యమరగురునిమించి ♦ యలరువాడు
నిరతంబు శ్రీరమా ♦ వరపాదకమల సే
వాసక్త చిత్తుఁడై ♦ బరగువాడు
పరకాంతలను మాతృ ♦ భావంబుతోఁజూచి
వినతులర్పించుచు ♦ వెలుగువాడు
కల్లనైన మఱియుఁ ♦ నవ్వులకైన నిసుమంత
బొంకి యెఱుంగక ♦ పొలుచువాడు

తే. గీ. ధర్మమే జయంబనుమాటఁ ♦ దలఁచి యెపుడు
గురుజనంబులఁ బూజించి ♦ వరలువాడు
వపరశుకుఁడను పేరున ♦ నమరువాడు
నైన బిల్వమంగళు డెట్లు ♦ లరుగు దెంచు.

అందులో వేశ్యయింటి కరుగుదెంచునా?

చింతా—మీసామర్థ్యము, చమత్కారమును జూపవలయును.

మధు—ఒకవేళ నాచమత్కార వాక్యములకు లోనై యిచ్చ్యోడకపు దెంచుఁగాక! అతఁడు నీవాక్యముల కలరుటెట్లు.

చింతా—పంతులుగారూ! మీ రాతనింగూర్చి విశేషము చెప్పనక్కరలేదు.

ఉ. ఇంత వచింతువేల విను ♦ మీ! పలుమాటలు బల్కనేల, తా
నెంతటి శిష్టుఁడైన మఱి ♦ యెట్టి తపోనిధియౌచు నొప్పినన్

గాంగేలఁ జూచినంతటనె ♦ గాముని బారికిఁ జిక్కి దాసుఁడై
యింటికి సంచరింపఁడె మ ♦ హీతలమందున నీవెఱుంగవా.

మధు—బిల్వమంగళుఁడు మాత్ర మట్టివాఁడు కాడని నాయభిప్రాయము.

చింతా—మీరు చెప్పినది కేవలము వెఱ్ఱిమాట.

సీ. తాపసోత్తముఁడయ్యు ♦ దాశకన్యాకేళి
సల్పిన ఘనపరా ♦ శరునికంటె
నతినిష్ఠవీడి కా ♦ మాంధుఁడై మేనక
జేఁసయట్టి కౌ ♦ శికునికంటె
నవిదలఁ జూడకే ♦ యుండి వేశ్యల వెంట
బడిన విభాండకు ♦ కొడుకుకంటె
నాచారవంతుఁడై ♦ యలరియు, వెధవల
మఱిగిన యలవ్యాస ♦ మౌనికంటె
తే. గీ. బరమనైష్ఠికుఁడా! నిరం ♦ తర తపోర
తుండ! యీమాట లింకేల ♦ తోయజాక్షు
లం గనిన యంతనీవు వి ♦ నంగ లేదె
బ్రహ్మకైనను బుట్టును ♦ రెమ్మతెగులు.

ఆతఁడు మనకు వశుఁడగునట్లు చేయుభారము నాది. మీ రెట్లయినను దోడ్పడవచ్చుటకుఁ బ్రయత్నము సేయుఁడు. వేపాగులకు యుక్తు లొకరు చెప్పవలయునా?

మధు—కానిమ్ము: నా కీకార్యములో ముఖ్యప్రాణదేవుఁడు తోడుపడకుండునా?

(తెరలో)

చింతా—మా అమ్మ పిలుచుచున్నది. మీ రిఁక బోయిరండు. శుభమగునా. (నిష్క్రమించును.)

మధు—(తనలో) బిల్వమంగళునిఁ దనకడ కెట్లయినఁ దోడితెమ్మని నన్నే నియోగించినది. ఇం దేమయినఁ బరమరహస్యమున్నదా? ఇంత బ్రదుకు బ్రదికి, యిట్టి కార్యమును నేను జేయవలయునా? ఛీ!

ఏమిబ్రిదుకు. ఏమైననుసరే! నేనిట్టి యకార్యము సేయను. ఇయ్యది గౌరవభంగమైన పనికాదా! (ఆలోచించి) కాదు!కాదు! చింతామణి హృదయము నిష్కల్మషమైనది. ఎట్లయినను బిల్వమంగళునిఁ దనయొద్దకుఁ దీసికొనివచ్చినచో, నాతని నెట్లయిన మాయపుచ్చి యతనివలన ద్రవ్యముగ్రైకొని, నాతో సుఖింప వచ్చుననియే చింతామణి తలంపు. నావద్దధనము లేదని శ్రీహరి దానిని చూపించుచున్నదని, యెట్లయిన నన్నుఁ బాయకుండు ట కీతంత్రము పన్నినది. కానిమ్ము ఎట్లయినను బిల్వమంగళుని నియ్యెడకుఁ దెచ్చెదగాక! చింతామణి చెప్పినదంతయుఁ జేసితీరును. బిల్వమంగళుని మాయలోఁబడవైచి గ్రైకొనిన ధనముతో నేనును జింతామణియు హాయిగ సుఖించెదము. ఇప్పుడీకార్యము నేను జేసినందువలన నాకువచ్చెడి గౌరవహాని యేమున్నది?

సీ. అగ్నిసాక్షిగఁగొన్న ♦ యతివల విడనాడి
వేశ్యలంగూడుచు ♦ వెలయువారు
యుద్యోగమాసించి ♦ యుపిదల నధికారి
పొందుకై పంపించి ♦ పొలుచువారు
వేశ్యనుంచియు వేడ్క ♦ విత్తమార్జింపంగ
భర్తలఁ జేకూర్చి ♦ బరగువారు
వ్యామోహమును వార ♦ వనితను విడలేక
దాసానుదాసులై ♦ దనరువారు

తే. గీ. తిట్టినను గొట్టిననుగాని ♦ రట్టుపెట్టఁ
కుండనే వెదిక్కని పడి ♦ యుండువారు
గలరు లోకంబునందుఁ బె ♦ క్కండ్రు, వార
లందు నేఁగూడ నొక్కండ ♦ నగుదుగాదె.

ఇంక సంశయింపక బిల్వమంగళుని కడకేగెదను.

(నిష్క్రమించును.)

ఇది తృతీయాంకము.

చింతామణి

లేక

లీలాశుక.

చతుర్థాంకము.

[బిల్వమంగళుని యారామభవనము:—(ప్రవేశము,)

సంభాషించుచు, బిల్వమంగళుఁడు - మధుసూదనుఁడు.]

బిల్వ—మిత్రమా! మధుసూదనా! నీవు చెప్పినదానిలో నతిశయోక్తి యున్నది. ఇది యెంతమాత్రమును విశ్వసింపఁదగిన విషయము కాదు.

మధు—చింతామణి విషయమున మాత్రమెవ్వరును నట్లు దలంపరాదు. అది నిశ్చయముగాఁ జింతామణి యనియె నాయభిప్రాయము.

బిల్వ—విటుల పాలిటికా !

మధు—బిల్వమంగళా! నీవు మహాపండితుఁడవు. నీతో నెవ్వఁడు భాషింపఁగలఁడు?

బిల్వ—నీవు చెప్పునది లోకవ్యవహారమునకు దూరము.

తే. గీ. కాకి జాతియందు తెలుపు ♦ గణికకులము
నందు నిక్కపు వలపు నీ ♦ వాగ్చనార

తునకు విష్ణుదేవుకొలువు ♦ ధనము కొఱకు
లంచములమేము సధికారి ♦ కంచితమగు
న్యాయమందుదలంపు; మన ♦ మరయలేము.

మధు—నీవు చెప్పినట్లు వేశ్యకు నిక్కమైన వలపుపుండదు. కాని యీ చింతామణిని మాత్రము తక్కిన వారాంగనలతోఁబాటు చేర్చరాదు. అదిసామాన్య వారాంగన కాదు.

సీ॥ భరతశాస్త్రంబు, న ♦ భ్యాసంబుగావించి
యందులో మేటి ప్ర ♦ ఖ్యాతిఁగాంచె
గానంబుసందీజ ♦ గాన దిసికి నీడు
లేరను భంగినిఁ ♦ బేరుగాంచె
యుభయ భాషాప్రౌఢి ♦ యొప్పగానార్జించి
కవయిత యాదుము ♦ గణనకెక్క
నక్లిపం కయింత ♦ చదివియందలి రహ
స్యములెల్ల గ్రహియించి ♦ యశముఁనొందె
తే. గీ. వ్యాకరణమందునఁ గూడ ♦ ప్రజ్ఞఁగాంచె
తర్కశాస్త్రంబు జవిచూచి ♦ ధన్యయయ్యె
నట్టి చింతామణిస్తుతికి ♦ నర్హురాలు
గాదె! సంశయంబేటికిఁ ♦ గాంచె దీవు.

బిల్వ—

ఉ. ఇన్నిదినాలనుండి యిట ♦ నే వసియించుచు నుంటిగాని, నే
నెన్నడు నిట్టివారజల ♦ జేక్షణ యిప్పరినుండె నంచునుఁ
విన్నదిలేదు విద్యలను ♦ నేర్చి యశంబునుగాంచెఁగాభళా
పెన్నిది వేఁయిలెల్లరును ♦ వేర్చికొనందగు గాదె విద్యలఁ.

విద్యావైభవమును నొప్పు వారేకులము వారైననేమి? విద్యావిశారదయగు నీవుచెప్పిన యీచింతామణి వేశ్యకుల మున జన్మింపక మఱియొక కులమున జన్మించియున్నచో మఱింత కీర్తి చేపట్టియుండునుగదా!

మధు—అది వేశ్యయేగాని సాధ్వీలక్షణము లున్నవి. దానికిఁ దోడు సౌందర్యము చెప్పనక్కఱలేదు?

బిల్వ—పాండిత్యమునకుఁదోడు సౌందర్య విశేషముగూడ నున్నదా?

మధు—సామాన్యసౌందర్యమైన నేను నీతో వచియింతునా?

సీ. పల్లవాధర వేణి ♦ బంధంబు వీక్షింప
సారంగపాళి పరి ♦ సన్నమగును
నబ్జాతదళనేత్రి ♦ యమలమృదూక్తుల
సరణిజూడ హరి సా ♦ క్షాత్కరించు
దిలనాసముఖరుచిఁ ♦ దిలకించినంతనే
యంబుజోద్భవుఁడు పరి ♦ త్యక్తమొందు
గళ్యాణి దృగ్గాళ ♦ ధళ్యంబుఁగన మహా
నిమిష ప్రకాండంబు ♦ నివ్వటిల్లు

తే. గీ. రమణి పదములఁజూచినఁ ♦ గమలరాజ
గరిమ గనిపించు విరిబోడి ♦ గమనమెంచఁ
బరమహంస ప్రబంబు గ ♦ న్పట్టు; నింత
యేల! నలువకైనను నింతి ♦ నెన్నదరమె.

బిల్వ—నిజముగాఁ జింతామణి యెట్లున్నదో నేను జూడలేదుకాని, నీవర్ణనావిశేషమున మాత్రము శ్లాఘింపవచ్చును.

మధు—ఇయ్యది నా వర్ణనావిశేషముగాదు. ఆ లేమసౌందర్య విశేషమే.

బిల్వ—నీవక్కాంతామణి నెందులకుఁ దిలకించితివి?

మధు—ఈమధ్య నా స్నేహితుఁడొకఁడరుదెంచి, దానిపాండిత్యమును బరీక్షింపఁ దలఁచి పోవుచు నన్నుఁగూడ వెంటదోడ్కొని పోయెను. ఆసమయమున నేనాచింతామణిని జూచుట తటస్థించినది. నేనును, బండితమణియైన నామిత్రుఁడును జింతామణి రాకకు నిరీక్షించుచు దన్మందిరమున నొకచావడిలో మాకై యేర్పాటుచేయబడిన యాసనంబులయందు గూర్చుండి యుంటిమి. మిత్రమా! అప్పుడేమని చెప్పుదును!

సీ. కమలాక్షపుత్రిని ♦ కార్ముకరసమున
సరస వాఙ్మాధురి ♦ నెరపుకొనుచు
నతను జయార్భటు ♦ లన హస్తకంకణ
క్వణనిక్వణంబులు ♦ బరపుకొనుచు
మరునివింటనునొప్పు ♦ మహితశింజినియున
మించువేణినిఁ గద ♦ లించుకొనుచు
స్మరుచేతిలోనుండు ♦ విరితూపులోయన
నేత్రిఁగన్నదోయి పే ♦ ర్మించుకొనుచు
తే. గీ. హంసనడకల నడచుచు ♦ నతిముదమున
నేము గూర్చున్నస్థలమున ♦ కేగుదెంచి
మహితభక్తితోనిమాకు న ♦ మస్కరించి
నట్టి చింతామణినిగాంచి ♦ యద్భుతంబు
గాంచినాడ దత్సౌందర్య ♦ గరిమకేను.

బిల్వ—మిత్రమా! వేశ్యయయ్యు, సుగుణసంపత్తిగలదై, దానికిఁ దోడు విద్యనార్జించి సౌందర్యవతియైగూడ నుండెనుగదా! నిశ్చయముగా నా చింతామణి ధన్యురాలనియే చెప్పవచ్చును. (ఇంచుక యూరకుండి) మధుసూదనా! ఎవరోపండితుఁడు నీమిత్రుఁడాచింతామణిని విద్యాపరీక్ష సేయుట యెఱిగెనని చెప్పితివే. ఆతని పరీక్షకామె యూగెనా?

మధు—బిల్వమంగళా! నాస్నేహితుఁడ క్కాంతను గొన్ని ప్రశ్నలడిగెను. అడిగినదే తడవుగా నన్నిటికిని సదుత్తరములిచ్చి యాతని కానందము గలుగఁజేసెను. కాని, యొక్క విషయములో మాత్రము, అసంగతి నాకు జ్ఞాపకములేదు. అన్నట్లు - మఱచితిని. ఈ సందర్భమున నీపేరుగూడ వచ్చినది.

బిల్వ—అక్కడ నాపేరుగూడ వచ్చెనా! ఇది వింతగనున్నదే.

మధు—మఱేవిషయమోయని నీవు సంశయింపవలదు. నాస్నేహితుఁడా చింతామణి నేదో ప్రశ్న యడిగినాడు. ఆవిషయము నది యొక్కింత యాలోచించినది. అప్పుడాతఁడు "చింతా

మణీ! అపరశుకుఁడను పేరు వహించిన బిల్వమంగళ పండితా
గ్రేసరుఁ డీపురంబున నున్నాఁడనుగదా! నీవేల యాతని నాశ్ర
యించి యీశాస్త్ర మభ్యసింపలేదని” యడిగెను.

బిల్వ—ఆపండితుఁడు నాపేరేల నడుగవలెను?

మధు—ఇందు తప్పేమియున్నది? నీవు పండితాగ్రేసరచక్రవర్తివి
గాన యాతఁడట్లు వాకొచ్చెను.

బిల్వ—దీనివలన నాకు లేనిపోని శ్రమయేమి కలుగునోయని సంశ
యించుచున్నాను.

మధు—శ్రమ యేముండును? ఒకవేళ నాచింతామణి నీవద్ద నేదేని
శాస్త్ర మభ్యసించుటకు వచ్చునేమో! అప్పుడు నీవు దానికి
గురుఁడవై యుండుట కంగీకరించెదవా? లేదా?

బిల్వ—విద్యార్థులై యెవ్వరైన వచ్చినచోఁ దెలిసియుండియు నట్టి
విద్యఁ బ్రసాదింపని గురుఁడు మహాపాపము నందగలడని ధర్మ
శాస్త్రములు చెప్పుచున్నవి. అయినను, నా చింతామణి యిప్పు
డింకను విద్య నభ్యసించుటకుఁ గోరునని తలంపను.

మధు—నీవట్లు తలంపఁగాదు. అది నామిత్రునితోఁ జెప్పిన పలుకులం
బట్టి చూడగా, నీవద్దకుఁ ద్వరలోనే వచ్చి నిన్నాశ్రయించు
నని తోఁచును.

బిల్వ—ఆహా! ఇది యొకటియా! గొప్ప చిక్కే తెచ్చిపెట్టితివి.

తే. గీ. ఎంత విద్యాప్రవీణమై ♦ యొసఁగుచున్న
గాంత వేశ్య యగుటచేత ♦ స్వాంతమందు
సందియంబును బొందెద ♦ జనులనేక
గతులఁ జెప్పకొ నెదరిద్ది ♦ కలిగెనేని.

మధు—మిత్రమా! నీయొద్ద దాచనేల. చింతామణి నేడో రేపో
నీగృహమున కరుదెంచి తాను నేర్వఁదలంచిన శాస్త్రమును
బోధింపుమని నిన్నాశ్రయించి తీరును. ఈసంగతి నేను గ్రహిం
చినాను. గ్రహించితిననేల! నీకును నాకును మైత్రి యున్నదని
యెఱింగి దాని నిశ్చయాభిప్రాయమును నాతోడనే చెప్పినది.

బిల్వ—సఖుఁడా! ఈసంగతి నీవు నాయొద్ద దాఁచెదవేల? నిశ్చయముగా నది యిక్కడకు వచ్చెనేని మహాజనకుఁడు నావిషయమై మిగుల ననుమానమందఁగలఁడు. నాయందు వాత్సల్యముంచి యక్కాంత నాకడకు రాకుండఁ జేయఁగలవా?

మధు—దాని యుద్దేశమును మానఁజేయుటకు నేనెట్లు శక్తుఁడనగుదును? పోనిమ్ము. నీవచ్చుటకేఁగెదవా!

బిల్వ—ఎంతమాటఁ జెప్పితివి.

తే. గీ. బహుళ విటజనాకీర్ణమై ♦ పాపభరిత
మై; కల్లలకు నిలయ ♦ మై; దనరెడి
వేశ్యగృహమందు నడుగేను ♦ బెట్టియుంట
నీవు వీక్షించియుంటి వే ♦ నేస్తకాడ.

మధు—బిల్వమంగళా! నీవు పరనారీవిముఖాంతరంగుండవనియు, నేకపత్నీ వ్రతుండవనియు నేనెఱుఁగుదును. కాని, నీవు చింతామణి గృహంబునకు మఱియొక దురభిప్రాయమును బూని యరుగవుకదా! విద్యావిషయ ప్రశంసకేకదా!

బిల్వ—మధుసూదనా! నీవు జెప్పినమాట నిశ్చయమే. అది వేశ్యయైనను విద్యాసంపన్నురా లగుటం జేసి యొకసారి చూడవలసినదే? అంతమాత్రముచేత నా పత్నీవ్రతమున కావంతయు భంగము గలుగదు; కాని,

మధు—కాని, అనియేమో సంశయముగా జెప్పుచున్నావు. చింతామణిం జూచుట యెట్లనియా నీయభిప్రాయము. ఎట్లయినను నది యిక్కడకే వచ్చును. నీవందులకు సందియమందుచుంటివి గాన, విద్యాపరీక్షకై నీవే యరిగినచో బాగుండును. దీన హాని యేమియును లేదు.

బిల్వ—మిత్రమా!

తే. గీ. కల్లుపాకయు సారాదు ♦ కాణము; మఱి
వెలవెఁలది యిల్లు నొక్కటే ♦ విధముసుమ్మ

సుజనుఁడై నను నాదరిం ♦ జొచ్చనేని
మూర్ఖు లోకవిధమునఁ దల ♦ పోయుచుందు.

అయినను నిప్పుడీ విషయమునుగూర్చి యనవసరముగా నింతగా నాలోచింపనేల? తరువాత చూడవచ్చును.

మధు—(తనలో) ఈతని నెట్లయినను జింతామణి గృహములోఁ బ్రవేశపెట్టఁగలుగుదునని ధైర్యమున్నది. కాని నేనిప్పు డిందు కేవలము వైదికునిరీతి వర్తింపరాదు. తొలుత నెట్లయిన రెండవ కంటివానికిఁ దెలియకుండఁ జింతామణియే యీతనికడ కరు దెంచునట్లు జేసెదను. (ప్రకాశముగా) మిత్రమా! చీకటి పడుచున్నది. అనుజ్ఞ యిచ్చితివేని యరిగెదను.

బిల్వ—మరల మనము రేపు కలిసికొందముగాక. (ఇటునటుజూచి) మాటలసందడిలో మనము కాలమునే మఱచితిమి. సూర్యాస్తమయమైనది. నేను త్వరగా గృహంబున కరుగకపోతినేని నా తండ్రిగారు నాకై పరిపరివిధముల జింతించి మదన్వేషణమునకై బయలు దేరుదురు.

మధు—(నిష్క్రమించును.)

బిల్వ—(ఎదుటఁజూచి) సేవకా! గృహమునకు ద్వరగా బోవుదము. దీపము వెలిగించుము.

(నిష్క్రమించును.)

రంగము:—[చింతామణి - గృహమున గదిలోఁ బ్రవేశము.]

చింతా—(తనలో) ఆహా!

సీ. వరభక్తి శ్రీహరి ♦ పాదాబ్జ నవసార
సధ్యాన మెవ్వేళ ♦ సలుపువాని
భ రిఘాత్రి శ్రేష్ఠ ♦ వారంబు నిరతంబు
దనుఁ బరివేష్టింప ♦ దనరువాని
విశ్వ విశ్వంభరా ♦ బృందార కాన్వయ
వారాశి చంద్రుఁడై ♦ వరలువాని

వివిధశాస్త్రార్థ సం ♦ వేదియై యుల బృహ
స్పతికి దుల్యుండయి ♦ బరగువాని

తే. గీ. తనఘన యశోలతావళి ♦ ధరణియందు
నఖిల దిక్కులందునఁ బ్రాక ♦ నలరువాని
బిల్వమంగళు దర్శించి ♦ వెలయుభాగ్య
మెదవుటెన్నఁడొ కదనాకు ♦ మదినిజూడ.

ఆ బిల్వమంగళునిఁ దలఁచినపుడెల్ల నాహృదయము జల్లుమనుచుండును. ఎన్నిదినముల క్రిందటనో దేవాలయములో జరుగు మహోత్సవమునకు వచ్చినప్పుడు జూచితిని. నాఁటి నుండియు నామనం బతనిపైఁ దగిలియే యున్నది. కాని, యవ్విషయమైన ప్రయత్నమే నేను చేయలేదు. (ఇంచుక యూరకుండి) నేను నెమ్మదిగా బిల్వమంగళుని నియ్యెడకుఁ దోడ్కొనిరమ్మని మధుసూదను నియోగింపఁ గలిగితిని. నా యుద్దేశమున కాతఁ డంగీకరించెను. మధుసూదనుఁడు బిల్వ మంగళునియొద్ద నెట్లుమాట్లాడునో!

ఉ. ఆతఁడనేక శాస్త్రముల ♦ నారసి పండిత సత్కవీంద్రుఁడై
ఖ్యాతినిఁ గాంచినాఁడు శుకు ♦ డంచు నుతింపఁగ సజ్జనుల్; మహా
నీతిపరుండు; సద్గుణుఁడు ♦ నిర్మలచిత్తుఁడునట్టిచో నన్నుఁ
బ్రీతినిజూడగాదలచు ♦ నే యవినీతిని దోచదయ్యెడిన్.

ఇంతకును మధుసూదనుని వాక్యములపై నాతడేమి చెప్పునో!

మ. వెలయాలయ్యది దానిఁ జూచుటకు నే ♦ విచ్చేసినన్ బాపమి
య్యెడఁ బ్రాప్తించును; నిట్టికార్యమున కీ ♦ వేతెంచి తేయంచు దా
నలుకన్ బూని వచించునో; మదిని ను ♦ ద్యత్ప్రేమనుం బూనుచున్
లలి నన్నున్ దిలకింపరాదలచునో ♦ నాభాగ్య మెట్లున్నదో.

(శ్రీహరి ప్రవేశించును.)

శ్రీహ—(చింతామణినిఁ జూచి) అమ్మాయీ! ఎప్పుడుచూచినను

నిట్లాలోచన పెట్టికొని కూర్చున్నచో వ్యాపారమెట్లుసాగును? బాగానేవుంది.

చింతా—ఇప్పుడు నేను చేయవలసిన వ్యాపారమేమున్నది.

శ్రీహ—మనకేమి వ్యాపారములుండును. ఒకటే వ్యాపారము.

తే. గీ. వాడిపోయినట్టి తమల ♦ పాకు పగిది
వయసుగడచినచో వార ♦ వనితనెవ్వ
డైన జేరునె? యందుచే ♦ యౌవనంబు
నందె ద్రవ్యంబు నార్జించి ♦ యలరవలయు.

చింతా—ఈవిషయములో నేను నీమాటకన్యథా వర్తించిన దేమున్నది?

శ్రీహ—నీవన్యథాఁ జేయుచుంటివని నేనుజెప్పలేదు. మధుసూదనుఁడు మరలరాలేదుకదా!

చింతా—బిల్వమంగళుని నెట్లయిన నిటకుఁదెచ్చుకార్యముమీఁద నాతని నియోగించితినిగదా?

శ్రీహ—ఈవిషయములో నీవు మిక్కిలిమంచిపనిఁ జేసితివి. బిల్వమంగళుఁడు నీకు వశుఁడయ్యెనా మనపుణ్యము ఫలించెనని చెప్పవచ్చును. అన్నట్లు మఱచిపోతిని. చావడిలో పెద్దమనిషినిఁ గూర్చుండఁ బెట్టి వచ్చినాను.

చింతా—ఆ పెద్దమనిషి యెవరు?

శ్రీహ—ముత్యాల వర్తకుఁడు. హైదరాబాదునుంచి వచ్చినాఁడఁట, సాహేబు.

చింతా—నీవేమైన ముత్యములు వెలకుఁ దీసికొందునని పిలిచితివా యేమి?

శ్రీహ—ఆతనియొడల నీప్రజ్ఞ గనఁబఱచినచో మనము వెలకుఁ దీసికొనవలయునా! ఆతఁడీ యూరునకువచ్చి మూఁడురోజు లయినదఁట. నిన్నటిరోజున యుదయమున నీవు వీధిగుమ్మమువద్ద నిలఁబడియుండఁగా చూచినాఁడఁట. ఎట్లు స్నేహము కుదురునదోగాని రామన్న యింతనిని దీసికొనివచ్చినాఁడు.

చింతా—సాహేబు నింటఁబ్రవేశింప నిచ్చితివా! ఎవరైనఁ జూచిన

గెలిసేయఁగా! ఇదివఱకు జేయుచున్న పనులు చాలక మ్లేచ్ఛుల సంపర్కము గూడ గలుగ జేయదలంచితివా?

శ్రీహ—నీవు చదివిన శాస్త్రములందు వేశ్యలు మ్లేచ్ఛులను జేరనీయ గూడదని చెప్పబడియున్నదా యేమి?

చింతా—మనలో తుఱకలను గూడినవారిని కులమునుండి వెలి వేయుదురుకదా!

శ్రీహ—ఎప్పటిదో పూర్వపుమాటలు చెప్పెదవేమి? ఇప్పుడా యాచారము నెవ్వరును పాటించుటలేదు. నీవు వింటివో లేదో. పాపాచలము గృహమునకు దఱచువచ్చుచుఁ బోవుచుండువాఁ డెవ్వఁడని తలఁచినావు? తెల్లవర్తకము సేయు లబ్బేసాహెబే కదా? ఇప్పటికి మనమా విషయమును గూర్చి సంశయింపఁ బనిలేదు. ఆయనను లోపలికి తీసికొని వచ్చెదను.

(నిష్క్రమించును.)

చింతా—అక్కటా!

తే. గీ. ధనమ! నిన్ను వర్ణింపగా ♦ దరమె! యెంత
కైనఁ దగుదువు; నావిద్య ♦ గంగగలిపి
కులము నెంచక వేశ్యయుఁ ♦ దలపకుండ
విటులతో జరింపఁగ జేసి ♦ వెలసినావు.

[గఫార్ సాహెబుతో-శ్రీహరి ప్రవేశించును.]

శ్రీహ—అమ్మాయీ! ఈసాహెబుగారు చాలా గొప్పవారు. ముత్యాల వర్తకులు. నవాబులతో సమానులు. నీవెట్లు గౌరవించెదవో.

గఫార్—ఠీక్ బాత్.

శ్రీహ—(సాహెబును జూచి) సాహేబుగారు! మా వేశ్యలలో సాధారణముగ నెవ్వరును మీతుఱకలతో సహవాసము సేయరు. మీముఖము జూడఁగనే గొప్పవారనియు, మర్యాదగలవారనియు గ్రహించి సమ్మతించినాను.

గఫార్—షత్తెం షత్తెం. మర్యాద కావాల. మన్షుమన్షు కలిసేతో డబ్బుక్యా! మనషంగతి నీకి తెల్సేతో లేదో. ఏక్ రూపాయ్

కాడిగా ఖర్చు చేస్తామ్.

శ్రీహ—మీదయ, దానిభాగ్యం.

గఫార్—ఫర్వానహి.

శ్రీహ—(నిష్క్రమించును.)

చింతా—(సాహెబునుజూచి) సాహేబుగారిచేతులో నున్నదేమి?

గఫార్—వర్తకంకా తోల్పెట్టె. దీనిమే ముత్యాలపేర్లకా సరుక్ భోత్ వుంది.

చింతా—నేను దానిని జూడవచ్చునా?

గఫార్—ప్యారీ! మాకీషందేహం లేదు. నీకు షూపిస్తాం. షూడు. (పెట్టెతెఱచి) మంచిముత్తేలకా పేరల్ భోత్ ధరవుంటాయి.

చింతా—(ముత్యాలహారమును దీసి) సాహెబుగారు ఈచిన్నముత్యములపేరు ఎంతఖరీదు వుండును?

గఫార్—ఏక్ వెయ్యిరూపాయల్ వుంటుంది.

చింతా—అమ్మో!అంతధరపెట్టి మేమెక్కడ కొనగలము?

గఫార్—నీకీకొనడం యేమిటి. మేము దీన్కి నీకు తగిలిపిస్తామ్. నీమీద మాకీనిండా ఖుషీగావుంది. (మీదచేయివేసి) మాకీ దగ్గిరగాబైటో డర్ నకో.

చింతా—(తనలో) వీనిచేతులు కాలిపోను. తాటిపట్టెల చందమున నున్నవి.

గఫార్—(ముత్యాలహారము చింతామణిమెడలో వేసి) ఇప్డు భోత్ ఠీక్ గావుంది. అచ్ఛాహై. మేము భోత్ కంచెన్కు షూశాం, నీకీ మోస్తర్, దేఖేనై.

చింతా—సాహేబుగారు! మీరీ యూరనింక నెన్నిదినములుందురు?

గఫార్—మాకీ యేమీ తెలుస్తాది. సరుకు ఖర్చు అయేతో జల్దీ బహానాకట్తాం.

చింతా—మీరు మాతల్లిము మాయింటికి వచ్చినారన్న సంగతి యెవ్వరికిని దెలియనీయవలదు. మాకు నగుబాటుగ నుండును.

గఫార్—నీకు భయమేమి? నీకీ మెహర్బానీ చేస్తార్. మాసల్

మూత్ వాలాకు తుంమెష్లా షుండలేద్. మాకీ చెప్పో. ఖతర్ చేస్తాము! ప్యారీ! నీమోహ్తర్ కంచెన్ మాబస్తేమే వుంటే భోత్ పైసావస్తాది.

చింతా—నన్ను మీవూరికిఁ దీసికొని వెళ్లుదురా?

గఫార్—ఆవ్. మాకీ షందేహంలేదు. నీకీ మేము తీస్కుపోయి నిఖా షేషి బీబీచేస్తాం. డేస్టి కట్టించి మీకీ అందులో వుంచుతాం. ముసల్మాన్‌వాలా తఫాఖా కంచెర్కు క్యామాలూం.

సుబ్బలక్ష్మి—(ప్రవేశించి చింతామణి చెవిలో నేదియో చెప్పి పోవును.)

గఫా—ఈబూబు కోన్.

చింతా—మాయింట దాసి.

గఫా—ఆరికి యీరికి తెచ్చి మీకీ తగిల్పించడానికి మీకీవుంది. అచ్ఛా అచ్ఛా. హాంకు మాలుంలే.

చింతా—సాహేబుగారు! మీకు నామీఁదనున్న దయచేత నీ ముత్యాలహారమిచ్చితిరిగాని, యది నేనుపుచ్చుకొన్నందుకు మాయమ్మ కోపించును. రొఖమేల పుచ్చుకొనలేదని దూరును.

గఫార్—భయంలేదు. మాకీ మోజువుండి ముత్తెల్ హారం యిచ్చినాము. పైసాకు పర్వాలేదు. ఇదిగో లేవ్ (జేబులోనుంచి పైక మిచ్చును.)

చింతా—మీవంటివారు వచ్చినప్పుడే మాకు కడుపునిండుట.

గఫార్—మాకీ యిక్కడ నిండా కష్టంగావుంది. గాలిలేదు.

చింతా—అట్లయిన మీకు గాలివచ్చుస్థలమున గూర్చుండబెట్టెదను. రండు. (నిష్క్రమింతురు.)

రంగము:—[ఆరామమందిరమున నొంటిగా బిల్వమంగళుఁడు ప్రవేశము]

బిల్వ—(తనలో) నిజముగా మధుసూదనుడు చెప్పినంత సౌందర్య మాచింతామణియందున్నదా? సౌందర్యమున కేమి? అంతటి విద్యావంతురాలై యుండునా? స్త్రీలయం దిట్టి సకలశాస్త్ర

పారంగతురాలున్నదని యెక్కడను వినియుండలేదు. అయ్యది వేశ్యయైననేమి? విద్యాగౌరవమునుబట్టి యొకసారి చూచి సంతోషింపవలసినదే. ఇంతమాత్రముచేత బవిత్రమైన నాస ద్గుణములకేమి కళంకమువచ్చును? (ఎదుటజూచి) అదుగో! మిత్రుఁడగు మధుసూదనుడు వచ్చుచున్నాడు.

మధుసూదనుఁడు—(ప్రవేశించి) మిత్రమా! యొంటిగ నుంటివేమి?

బిల్వ—పనియంతయుఁ బూర్తిఁజేసితిని. సంధ్యాసమయ మగుచుండు టంజేసి, యింక గృహమున కరుగఁదలంచు చుంటిని. ఇంతలో నీవు వచ్చితివి.

మధు—అన్నా! నీకు శ్రమయిచ్చితిని కాఁబోలు.

బిల్వ—ఏమియు శ్రమలేదు. కూర్చుండుము.

మధు—కూర్చుండుటకు వ్యవధిలేదు. ఇప్పుడొక చిత్రముజరిగినది.

బిల్వ—ఆ చిత్రమేమి?

మధు—ఏమున్నది. నీయందున్న వాత్సల్యముచే నీవాక్యముల ననుస రించి, చింతామణిని నిక్కడకు రాకుండఁజేయవలయునని శతవిధములఁ బ్రయత్నించితిని. కాని నాప్రయత్నము విఫల మైనది. విఫలమైనదని నేను విచారించుటలేదు. ఎప్పుడో గాదలచుకొనిన యాచింతామణి నీ సందర్శనమాచరించి తీర వలెనని యిప్పుడేవచ్చి, వీధిలో నిలఁబడియున్నది.

బిల్వ—అన్నా! ఎవరైనఁజూచినఁ బహువిధముల ననుమానపముందెదరు కదా!

మధు—ఇప్పుడేమి చేసెదవు?

బిల్వ—విద్యావతియగు నాచింతామణి యెంతయో గుతూహలముతో వచ్చినప్పుడు నేను నిరాకరించినచో నేమి గౌరవముగ నుండును. కానిమ్ము. లోపలికిఁ దీసికొనిరమ్ము. త్వరగా మాటలాడి యెవరును జూడకుండఁ బంపివేయుదము.

మధు—(నిష్క్రమించి వెంటనే చింతామణితోఁ బ్రవేశించును).

బిల్వ—(చింతామణినిఁజూచి) ఇది నిశ్చయముగా జింతామణియే!

ఏమి! ఈచక్కదనము వింత గొలుపుచున్నది.

మ. హరిణీ జూపుల రంభనూరువుల హే ♦ మాభిఖ్యనుర్దేహవై
ఖరి, దార్ల సునఖప్రశస్తి శశిరే ♦ ఖ; జెక్కులర్ జిల్రే
ఖ; రహిర్ భ్రూలతికర్ హసించి దనరం ♦ గా! దేవతాకాంతలే
సరిరారన్నను మానవాంగనల స ♦ త్సౌందర్యమింకేటికిన్.

చింతా——(బిల్వమంగళునిఁ జూచి) ఆహా! ఏమి! ఈదివ్యమంగళ స్వరూపము.

సీ. సంపూర్ణ పూర్ణిమా ♦ చంద్రబింబము వ
ర్ణింపదగును వీని ♦ నెమ్మొగంబు
పరిఫుల్లవారిజ ♦ ప్రసవంబులంచు భా
వింపగా నొప్పును ♦ వీనికనులు
ఘనగజతుండంబు ♦ లనుచు శ్లాఘింపగా
దగువీని దృఢభుజా ♦ తల్లజములు
శ్రీకుమారుని భర్మ ♦ సింహాసనంబని
వినుతింప దగువీని ♦ వెడద యురము

తే. గీ. నలుమొగంబుల వేలుపు ♦ తొలుత నశ్వి
నీకుమార జయంతుల ♦ సృష్టిఁజేసి
మదినిఁ దృప్తినొందక నిజ ♦ మహిమ మెరయ
బిల్వమంగళుసృష్టించి ♦ వెలయనోపు.

(బిల్వమంగళునిఁజూచి) పండితాగ్రేసరచక్రవర్తీ! బిల్వమంగళనామధేయా! నమస్కారములు. అటఁగూర్చుండుడు.

బిల్వ——(మధుసూదనునిఁజూచి) మిత్రమా! మధుసూదనా! నిలఁబడియుంటివేమి!

చింతా——(బిల్వమంగళునిఁజూచి) మహాత్మా! మీరు నాసాహసమును మన్నింపవలయును.

బిల్వ——చింతామణీ! ఇందు నీవొనర్చిన యపరాధమేమున్నది? నీవు వారకామినీమణివైనను విద్యావతివని యెంతయు సంతసించితిన్. ఇది వఱకెన్నఁడును నిన్ను నేఁగని యుండలేదు. ఇప్పుడు చూచ

తిని. ముదంబొదవె. లోకముననున్న కాంతలు నిన్నాదర్శకముగఁ జేసికొని విద్యావతులై వెలయుదురుగాక!

మధు—(చింతామణిని జూచి) చింతామణీ! నీవు నాహితుఁడగు నీ బిల్వమంగళునియొద్ద నభ్యసింపఁ దలంచిన విద్య యేది?

చింతా—ఆవిషయమున నీరికిప్పుడు శ్రమ గలిగింపఁ దలంపలేదు. నెమ్మదిగా తరువాత మనవిఁ జేసికొందును. (బిల్వమంగళుని జూచి) మహాత్మా! నాకెన్ని దినంబులనుండియో భవదీయ పాదారవింద సందర్శనమాచరింప గుతూహలమున్నది. అయ్యది నాపురాకృత సుకృతంబునంజేసి నేటికి లభించినది.

బిల్వ—నీకు నాయందున్న గౌరవముచే నట్లువచించెదవుగాని, లోకము నందున్న పండితులందఱికన్న నేనగ్రగణ్యుఁడనా?

మధు—చింతామణికి మాత్రము నీవట్లే యుంటివి.

బిల్వ—చింతామణీ! నీవిద్యావిషయమునుగూర్చి యొక్కింత ప్రశ్నింపఁగోరిక యున్నదిగాని, యిప్పుడు కాలము చాలదని చెప్పుటకుఁ జింతయయ్యె. సాధారణముగ జీకటి పడక పూర్వము నేనింటికి బోవనైతినేని మాతండ్రిగారే స్వయముగా నన్న న్వేషించుచు వత్తురు.

(తెరలో)

బాబూ! బాబు!

బిల్వ—(మధుసూదనునిఁజూచి) మధుసూదనా! ఆపిలుచుచున్నది మాతండ్రిగారి సేవకుఁడగు కేశవునివలె నున్నాఁడు. వానిని ద్వారమువద్దనే యుంచి యెందులకు వచ్చెనో కనుఁగొని రమ్ము.

మధు—(నిష్క్రమించి వెంటనే ప్రవేశించి) మిత్రమా! నీతండ్రిగారు నిన్ను సత్వరముగ దోడ్కొని రమ్మని యాజ్ఞ యిచ్చినారఁట.

బిల్వ—మిత్రమా! ఇంక నేను తడయరాదు. (చింతామణిని జూచి) చింతామణీ! నీవేవియో విద్యావిషయమైన కార్యము బూని

వచ్చితివి. సావకాశముగ మాటలాడఁ జాలనందుకు విచారించు చున్నాను.

చింతా—ఆర్యా! ఇప్పుడు మించిన దేమియును లేదు. ఇంతవఱకు మీకు శ్రమయిచ్చినందుకు క్షమింపుఁడు. మరల మీసందర్శనలాభము నాకుఁ గలుగఁ జేయుఁడు.

బిల్వ—మిత్రమా! నీవు నెమ్మదిగా నీచింతామణిని దోడ్కొని పొమ్ము.

చింతా—దేవా! నేను సెలవు దీసికొందును.

(తెరవాలును.)

ఇది చతుర్థాంకము.

చింతామణి.

—లేక—

లీలాశుక.

పంచమాంకము.

రంగము:—[బిల్వమంగళుఁడొంటిగాఁ బ్రవేశము.]

బిల్వ—(తనలో) ఆహా! ఆచింతామణి సౌందర్యము వర్ణనాతీతము. తొలుత మధుసూదనుఁడాయింటింగూర్చి చెప్పినపుడు నేనేమో యని తలంచితిని.

కం. విన్నందుకుఁ గన్నందుకు
బన్నఁగఁడఁగియున్న దా య ♦ బల భళిరా యా
చెన్నగునాకృతిఁ బొగడఁగ
బన్నగనాయకునికైన ♦ వశమే తలఁపన్.

ఆచింతామణీప్రతిబింబము నాకన్నులకుఁ గట్టినట్లే యున్నది. ఆనాఁడు మాతండ్రి నన్ను సత్వరముగరమ్మని కేశవునిఁ బుత్తెంచుటంజేసి యక్కాంతతో విశేషముగ బ్రశంసించుటకు సావకాశము గుదురలేదు. నిజముగా నట్టిసౌందర్యవతి భూమండలంబున లేదని తలంపవచ్చును.

సీ॥ జలజాక్షి వేణితోఁ ♦ సరిరాక గాబోలు
జీమూతసంఘంబు ♦ జేరెఁ గట్ల
పడతి నెమ్మోముతోఁ ♦ బ్రతిగాక గాబోలు
నాసుధానిధి బహు ♦ ళార్తిస్రుక్కె
మెలతగుబ్బల తోడఁ ♦ దులగాక గాబోలు
పర్వతరాజముల్ ♦ వాసెగతుల
నిందువదనకౌను ♦ కెనగాక గాబోలు
సింహముల్ భీతిని ♦ జేరెగుహల

తే. గీ. బాలతి యూరుల కోడి కా ♦ బోలుకదళి
కాతరువులు తలలువంచె ♦ గదితచరణ
ములకు సీడుగా లేక కా ♦ బోలుఁ గమల
తతులు పంకోదయావాప్తిఁ ♦ దనరియుండె.

ఆకాంతామణి సౌందర్య విద్యుచ్ఛక్తి సంపూర్తిగ నన్నాకర్షించి వేసినది. చింతామణి స్వరూపమును నింకొక్క సారి కనుల కఱవుదీరఁ దిలకింప వలయును. (ఇంచుక యూరకుండి) ఇయ్యది నాకెట్లు ప్రాప్తించును? విద్యావిషయంబును గూర్చి ప్రశంసింప వలయునుగాన నొకసారి రమ్మని నేనే వార్తఁ బంపితినేని, యది యంత గౌరవముగ నుండదు. నేనే తద్గృహమునకు స్వయముగఁ బోవుదునేని, యదియొక విధముగఁ బరిణమించును.

తే. గీ. ఏనుశిష్ట చరిత్రుఁడ, న ♦ య్యింతి వేశ్య
యెట్లు బోవగానగు దాని ♦ యింటికిప్పుడు
పరులు దీనినిఁ జూచినఁ ♦ బరివిధముల
వాదములయందు ననుమాన ♦ మొందకుండ్రె.

ఇందుల కుపాయమేమి? ఎంత యూహించినను నాకేమియు నుపాయము పొడఁగట్టుటలేదు. (చింతామణి నుద్దేశించి) చింతామణీ!

తే. గీ. ఇట్టు వచ్చితివట్టి పో ♦ తింతి; నాదు
హృదయమందు వికారంబు ♦ నొదవఁజేసి,
యైంద్రజాలికునిం బోలి ♦ యలరునీదు
రాక కేమంచుఁ దలఁతును ♦ రమణిమిన్న.

(మధుసూదనుఁడు ప్రవేశించును.)

బిల్వ—(తనలో) నాయభిప్రాయ మీతని కొక్కింతయుఁ దెలియ నీయరాదు. (ప్రకాశముగా) మధుసూదనా! వచ్చితివా రమ్ము. ఇటుఁ గూర్చుండుము.

మధు—(ఆసీనుఁడై) మిత్రమా! మొన్న చింతామణి యొక్కడ కరుదెంచిన రహస్య మెవ్వరికిని దెలియలేదుకదా!

బిల్వ—అట్లేలజరుగును? పాపము! వట్టిగారవము. నాయందేదియో యాధిక్యము కలదని వచ్చినది. ఇంతకును దనకోరిక చెప్పనే లేదు. అయినను సవిస్తరముగ సంభాషించుటకుఁ గూడఁ జీకటిపడిపోయినది. అదియుంగాక తండ్రిగారుగూడ సత్వరముగ నన్ను రమ్మని వార్తబంపినారు. సావకాశముగ నేను సంభాషింపలేదని యక్కాంత నావిషయమున మఱియొక విధమున దలంపలేదుకదా!

మధు—అట్లేల తలంచును. అది మంచి రసజ్ఞురాలు.

బిల్వ—అవును. నేను గ్రహించితిని.

మధు—దాని సౌందర్యవిషయములో నేను చెప్పిన యంశముల యం దేమైన నసత్యమున్నదా?

బిల్వ—ఆచింతామణి నిశ్చయముగ చింతామణియనియే చెప్పవచ్చును.

ఉ. కన్నులఁ గట్టినట్టులనె ♦ కన్పడుచుండెను పన్నెమీఱ, నా
యున్నులమిన్నరూప మహా ♦ హా! యికనేమని తెల్పువాఁడ; నా
పన్నగనాథుఁడైన నవ ♦ పద్మదళాయతనేత్రవైభవం
బెన్నఁగ జాలఁడంచు వచి ♦ యింతును నిశ్చయిమిద్దిమిత్రుఁడా.

మధు—నీవన్నటుల ఁ గాత్రులైన యీచింతామణి యొక్క ధన్య

యనియే చెప్పవచ్చును. కాని, చింతామణి మొన్న గృహమునుం జేరగనే, తనకోరిక నీతో దెలుపనందుకు దానితల్లి యాగ్రహించినది సుమా!

బిల్వ—సావకాశముగాం దెలుపుదునని చెప్పినది. దాని విద్యావిషయమునుగూర్చి ముచ్చటించుటకుం గాలము లేకపోయినది.

మధు—తనయనుమానములం గొన్ని నీవలన దీర్చుకొనుటకుం గోరుచున్నది. మరల నీదర్శనమునకు నేటిరోజున వచ్చుటకుం బ్రియాణముగాగ వారించితిని.

బిల్వ—విద్యయందాసక్తియున్న దానియభీష్టము నేరు దీర్చియే తీరవలయును. కాని, చింతామణియే యిక్కడకువచ్చుట యసంభవము.

మధు—అట్టిదాని గృహమునకు విద్యావినోదమునకు మనమరిగినను దోషములేదు.

బిల్వ—నిశ్చయమే.

మధు—మిత్రమా! నన్నుగూర్చి నీవు మఱియొకవిధమున నభిప్రాయము బూనువాడవు గావని చెప్పుచున్నాను. నీదర్శనమున కొకసారి వచ్చిన యాచింతామణియింటికి రెండవసారి మన మరిగినచో గౌరవముగ నుండునని నాయభిప్రాయము. ఇందు గౌరవమున కేమైన భంగముండునని తలంతువా?

బిల్వ—విద్యావిశారదయగు నాచింతామణి గృహమునకు మన మరిగినందువలన దోష మేమియును లేదు. కాని, వేశ్యాగృహమగుటచే నాడెంద మొక్కింత వెనుదీయుచున్నది.

తే. గీ. ఎంత సద్బుద్ధితో మన ♦ మింతి గృహము
జొచ్చినను గాని, దానిని ♦ సుజనసమితి
జూచి రేని దోషంబుగా ♦ జూచి నింద
వేయకుందురె నా కవి ♦ దేకియనుచు.

దానియింటికి బోవుటయని తలంచినంతనే నాశరీరము కంపమెత్తినది.

మధు—మిత్రమా! నీవావిషయమున సందియుంబందఁ బనిలేదు. నిన్ను రెండవకంటివాడు జూడకుండ నేను చింతామణి గృహమునకుఁ దోడ్కొని పోవుదును.

బిల్వ—ఈవిషయమున నామనంబున నించుక భీతికలుగుచున్నది.

మధు—బిల్వమంగళా! నీవు భయమందవలదు. ఒకసారి చింతామణి నీకడకు వచ్చియుంటచే నిప్పుడు నీవరిగితివేని యెంతయో గౌరవముగ నుండును. ఈరోజున (అర్థోక్తి)

బిల్వ—అతిరహస్యముగ మనము పోయి రావలయును.

మధు—నీయపకీర్తి యొకటియు, నాయపకీర్తి యొకటియు నా? భయపడకుము. (తెలవారిలును)

రంగము:—[చింతామణి-గృహము లోగది-ప్రవేశము-చింతామణి]

చింతా—(తనలో) అహా! మహానుభావుండగు బిల్వమంగళుని దివ్యమంగళగ్రహము నాహృదయము నాకర్షించివేసినది.

శా॥ ఆదాక్షిణ్యము, నావిలాసగరిమం ♦ బస్తోక, మావిద్య మ
ర్యాదాచార మపార, మా విభవ మా ♦ ర్యస్తుత్య మా రూపు స
మ్మోదం బా ఘనదేహసౌష్ఠవము సం ♦ పూర్ణంబు; వేయేల; యా
పాదుద్భావము మంగళాస్పదము చె ♦ ప్పన్ శక్యమేవానికిన్.

సీ. ఆసుందరాకారు ♦ నతిమోదమునఁగూడు
చెలువసౌఖ్యంబును ♦ జెప్పవశమె?
ఆపురుషోత్తము ♦ నారాధనముసేయు
కలికి భాగ్యంబును ♦ బలుకవశమె?
ఆరవితేజు గా ♦ ఢాలింగనముగాంచు
మగువవైభవమును ♦ బొగడనగునె?
ఆమహాత్మునితోడ ♦ ననిశంబునుండెడి
తరుణివైభవము నిం ♦ తనగఁ దరమె?
తే. గీ. ఔర వినికిడగునట్టి ♦ యందగాడు
మూడులోకములందు నే ♦ వాడఁజూడ

గానిపించునె; నిరతంబు ♦ వాని దగిలి
యుండు సతిజన్మమే జన్మ ♦ ముర్వియందు.

సీ. వాని మోమును మోము ♦ బరపంగగల్గిన
నిరత భోగములంది ♦ పరలినట్లు
వాని సంకేత కృపా ♦ వైభవంబొందనిన
సమిత రాజ్యశ్రీని ♦ సందినట్లు
వానిచెక్కిలి ముద్దుఁ ♦ బూనంగనేర్చిన
ఖండచంద్రస్ఫూర్తి ♦ గాంచినట్లు
వాని కెమ్మోవిని ♦ నానగాగల్గిన
కండచక్కెర రుచి ♦ గాంచినట్లు

తే. గీ. భళిర వానితో సరసవా ♦ క్యంబులాడ
గల్గినను నభీష్టములెల్లఁ ♦ గాంచినట్లు
వేయునేటికి నతఁడు ల ♦ భించెనేని
క్షితి దరిద్రునిఁ బెన్నిధిఁ ♦ జెందినట్లు.

ఆ విద్యావిశారదుఁడు నాకు లభించునా? ధర్మపరుఁడును, నతి నిష్ఠాపరుఁడును, సుగుణమూర్తియు, బరాంగనా సోదరుఁడును నగు నాతని మదీయసదనంబున కరుదెంచి మదీయాభీష్టము దీర్చుటకు సమ్మతించునే? (ఆలోచించి) మధుసూదనుం డెట్లయిన నాతని నిచ్చోటకు వచ్చునట్లు జేసెనేని, యాతనిని నా క్రేగంటి చూపులచేత, మృదువాక్యములచేత, చేష్టలచేత వశము జేసికొనలేక పోవుదునా? ఆతనికి నాపై మోహము గలుగునట్లు జేసికొనలేక పోయితినేని నా చతురత్వ మేమున్నది?

ఆ. వె. కామరహితుడయిన ♦ కైవల్యరతుఁడైన
నిర్మలాత్ముఁడైన ♦ నిపుణుఁడైన
వితతచతురుఁడైన ♦ వేదాంత విదుఁడైన
దన్విచూపులకును ♦ దాళఁగలఁడె.

మహానిష్ఠాగరిష్ఠాత్ములయిన మునులకంటె నీత డెక్కువవాఁడా!

సుబ్బలక్ష్మి—(ప్రవేశించి) అక్కయ్యోవ్! చుబ్బిచెట్టి యియ్యాల మాసోకు చేసుకొచ్చాడు. పెద్దమ్మతో మాట్టాడుతుండాడు.

శ్రీహ— (ప్రవేశించి) అమ్మాయీ! సుబ్బిసెట్టి వచ్చినాఁడు. అంగీ జేబు బరువుగానే యున్నట్లున్నది.

చింతా—ఆసంగతి నీవెట్లు గనిపెట్టితివి?

శ్రీహ—వైశ్యవిటునియొక్క యుత్సాహము మనమిట్లే కనిపెట్ట వచ్చును.

సీ. కనకాంగుళీయముల్ ♦ గణికకు గన్పడఁ
జేయిద్రిప్పుచును భా ♦ షించుచుండు
మేనిపై ఖండువా ♦ మీఁదజరీని వీ
క్షించు నట్టులు సవ ♦ రించుచుండు
ముంజేతి తోడాలు ♦ మురుగులు గనిపింప
గాఁ "గమీజు" ను పైకి ♦ లాగుచుండు
చొక్కాయి జేబులో ♦ రొక్కమున్న దటంచు
జెప్పఁగాఁ జప్పుడు ♦ సేయుచుండు

తే. గీ. మేటి సరసుం డటంచును ♦ మెలతకెఱుఁగ
జేయవెట్టి సంభాషణ ♦ సేయుచుండు
వైశ్యవిటుడన్న వెలదిరో ♦ వట్టిపిచ్చి
వాడు; మాటలాడియె వానిఁ ♦ బటపవచ్చు.

సుబ్బిసెట్టితో నాలుగు కబురులు చెప్పి త్వరగా బంపి వేయుము. (నిష్క్రి)

(సుబ్బిసెట్టి ప్రవేశించును.)

సుబ్బి—(తనలో)

కం. మురుగులు తోడాల్గొల్సులు
సరిలే నుంగరము సూచి ♦ సక్కనివాఁడే
దొరికెను తక్కువ యేవని
సిరి నవ్వున మీఁదబడదె ♦ సింతామణియుఁ.

(చింతామణినిఁ జూచి) ఇదుగో! సింతామణి తీరుబడిగా కూసుండది.

సుబ్బ—బావయ్యగారొత్తారనే?

సుబ్బి—నిజవుగా అమ్మతోడే.

సుబ్బ—నువు సచ్చినట్టే, అబద్దమాడుతానా!

సుబ్బి—అందుకనే కావోసు ముస్తాబయింది.

చింతా—ఈముస్తాబంతా యెవరికోసమనుకొన్నావు? నిలచుంటివేమి. ఆ కుర్చీమీదఁ గూర్చుండుము.

సుబ్బ—బావయ్యకి కుర్చీఅలవాటుంటేనా! దుకాణవులో గల్లాపెట్టె సొక్కాని పీటమీదేగా కూకోడం.

సుబ్బి—మంచిమాటన్నావే. (కుర్చీమీదఁగూర్చుని) అమ్మయ్యా.

చింతా—బురదలో దిగఁబడిన దున్నవలెనే కుర్చీలోగూర్చుంటిరిగదా.

సుబ్బి—అబ్బో! సరసాలు! ఏవి సుకఁవైన మాటేశావు. ఏది రవ్వొంత ముద్దియ్యి. (లేవబోయి) నేనుముద్దెట్టుకోడానికి కడుపడ్డవెంది.

చింతా—నీసరసం మండినట్టేవుంది.

సుబ్బ—బావయ్యగారికి వాతంవలస దేహంపెటిగింది. కసింత సిత్రిక పట్టించ లేకపోయినారూ.

(సిప్కి)మించును.)

సుబ్బి—సింతామణీ! దూరంగా కూసుంటావే దగ్గరగారా! కుర్సీకసింత జరువుకోఁదూ. ఇద్దరవు దగ్గిరసా వుంటేనేగాని సరసంసాగదు.

చింతా—వుదుచ్చేరీనానుసకుఁ దెచ్చెదనన్న కాసులేవి?

సుబ్బి—అబద్దవాడుతా ననుకున్నావా యేంటి. ఇయిగో! తీసుకో ఆరుకాసులు. (యిచ్చును.)

చింతా—ఇంతేకదా! ఈపాటిదానికేనా యింతముస్తాబై దాష్టీకపంతులు వేషము వేసికొని వచ్చినావు. ఈకోటుక్కడిది? ఈవాళే పెట్టెలోనుంచి తీసినట్లున్నావు.

సుబ్బి—ఇదా నాచోబనానికి కుట్టించుకొండా. ఆమూడురోజులు తొడిగి పెట్టెలో పెట్టేశాను. యియ్యాల సీకోసం తీసినాను.

చింతా—అవునుగాని యెనిమిది కాసులు తెచ్చెదనని చెప్పితివే. తక్కిన రెండును నెక్కడ? జేబులో దాచితివా యేమి? చూచెదను. (జేబులో చెయి బెట్టబోవును.)

సుబ్బి—కోటు సిరుగుతుంది. దాయలేదే. ఈపాలి తెచ్చిస్తాలే. కోంప మునుకు. కోమటోడి సెయ్యి లాంబొంట సెయ్యి. ఒక్కపాల్తో వురుకుండేదికాదు. నచ్చిందా మాట? ఏమనుకొన్నావో.

చింతా—చూచెదనుగా. ఈసారినీవు తీసికొనిరాక పోయినచో.

సుబ్బి—రెండు సెంపకాయలెయ్యి.

చింతా—అప్పుడుకాదు. ఇప్పుడేవేసెదను. (చెంపపై చేయి వేయును.)

సుబ్బి—వహవ్వా! వహవ్వా! వొళ్ళెల్లా కదలవారింది.

(శ్రీహరి ప్రవేశించును.)

శ్రీహరి—అమ్మాయీ! విద్యావిషయమునుగూర్చి ముచ్చటించుటకు పండితులు వచ్చినారు.

చింతా—ఇదిగో! వచ్చుచున్నాను. (నిష్క్రమించును.)

సుబ్బి—అత్తమ్మా! మంచిసమయంలో సరసం సెడగొట్టావు.

శ్రీహరి—సెట్టిగారు! పాపము ఎవరో పండితులు వచ్చినారు. ఇప్పుడే మరలవచ్చును. మీరాగదిలో గూర్చుండవచ్చును. రండు.

సుబ్బి—(నిష్క్రమించును.)

(బిల్వమంగళుఁడు - మధుసూదనుఁడు - ప్రవేశింతురు.)

శ్రీహరి—(బిల్వమంగళునిఁ జూచి) బాబూ! దయచేయుఁడు.

మ. మనమా వెన్న, నిదానమా ఘనము, ధా ♦ మంబా స్థిరంబా, యశో
ధనమా పూర్ణము, సద్గుణావలియు, వి ♦ ద్యాబుద్ధియా మెండటం
చును లోకంబున నెల్లవారు మిము సం ♦ స్తోత్రంబుగావింపఁగా
విని మిమ్మెప్పుడు జూతునో యనుచు ను ♦ వ్విళ్లూరు చుంటిం గదా!

నేటికి మాభాగ్యవశమున దర్శనమొసంగితిరి. మీపాదధూళి సోకుటంజేసి మాభవనము పవిత్రమైనది. ఈయాసనముపైఁ గూర్చుండుఁడు.

బిల్వ—(మధుసూదనునిఁ జూచి) మిత్రమా! నీవును గూర్చుండుము.

(ఇరువురును నాసీను లగుదురు.)

శ్రీహ—(అపర్ణఁ జూచి) అమ్మాయీ! సిగ్గుపడుచు నచ్చట నేయుండెద వేల! అనుదినంబును నీ వేమహాత్ముని దివ్యమూర్తిని హృదయపీఠమున నిలిపి స్మరించుచుంటివో, యాపండితచక్రవర్తియే యరుదెంచెను. సిగ్గుపడక వచ్చి దర్శనముఁ జేసికొనుము.

(చింతామణి ప్రవేశించును.)

చింతా—(బిల్వమంగళునిఁ జూచి) ఆర్యా! నమస్కారములు; భవద్దర్శనంబున నేను గృతార్థురాల నయితిని. మీరు సామాన్యులు గారు.

మ॥ సకలమ్నాయ పురాణశాస్త్రముల భా ♦ షాకాంతనాధుండు, వా
సుకియున్ దేవగురుండు జాలరని ని ♦ చ్చల్ వింటి, నిప్పట్ల తా
వక కారుణ్యము నాపయింబఱప దే ♦ వా వచ్చియున్నావు; నా
సుకృతంబుల్ ఫలియించెనేటికి; గుణ♦స్థామున్ నినున్ జూచుటన్.

బిల్వ—(చింతామణినిఁ జూచి తనలో)

మ॥ భళిరా! కన్నులతీరు; మోమురుచి జె♦ప్పన్ రాదు; మేల్ గుబ్బలన్
దరమామెంచ; నొయ్యారమా మిగులవిం ♦ తల్ గొల్పు; లేనవ్వుని
గ్గులునయ్యారె; సదామనోహర మృదూ ♦ క్తుల్ వహ్వారే! యిట్టిని
స్తులసౌందర్యవతీ శిరోమణిని నె ♦ చ్చోఁజూడ భూమండలిన్.

(ప్రకాశముగా) చింతామణీ! నీవిద్యాసౌందర్యమే నన్ను రావించినది.

చింతా—పంతులుగారికి నాయెడల సంపూర్ణవాత్సల్య ముండుటంజేసి యరుదెంచిరి.

మధు—నామిత్రుఁడగు బిల్వమంగళుఁడు సాధారణముగ నొకరిగృహమునకు వచ్చువాఁడుగాఁడు. ఈతఁ డరుదెంచుట నిజముగా నీ భాగ్యవిశేషమే యని చెప్పవచ్చును.

చింతా—(బిల్వమంగళునిఁజూచి) దేవా! మీవంటి పండితులను జూచి నప్పు డేదోయొకటి యడుగఁబుద్ధిపుట్టుచుండును.

శ్రీహ—(చింతామణినిఁజూచి) వెఱ్ఱిదానా! నీవా విద్యావిశారదుని ప్రశ్నయడుగునంతటిది దానవా?

చింతా—సరిసరి! ఎంతమాట బలికితివి. నేను వారిని బరీక్షింతునా? శ్లోకార్థము నొక్కింత యెఱుఁగుటకు.

బిల్వ—సందేహింపకుము. నీవడుగఁ దలచిన శ్లోకమేదో చెప్పుము.

చింతా—శ్లో॥ "అవిదితసుఖ దుఃఖం నిర్గుణం వస్తుకించి
జ్జడమతిరిహ కశ్చిన్మోక్షఇత్యాచ చక్షే
మమతుమతమనంగ స్మరతారుణ్యఘూర్ణ
న్మదకల మదిరాక్షీ నీవిమోక్షోహి మోక్షః".

దీనిభావము ననుగ్రహింపఁగోరెద.

బిల్వ—ఈశ్లోకము నాకొఱకె వెతకి యుంచితివా! (తనలో) దీని భావము తెలిసియుండియే నన్నడిగినది. ఈకాంత విషయమై నేను తలంచిన తలంపు సఫలము నందునా? కానిమ్ము. (ప్రకాశముగా) చింతామణీ! దీనిభావము నీకుఁ దెలియకున్నదా? నానోట వినఁదలంచి యడిగితివి. "మూఢులు కొందఱు నిర్గుణమై యించుకేని సుఖమీయని వస్తువును మోక్షమందురు. కాని, నామతమునుబట్టి చూడ సకలకళా విశారదమైన మదిరాక్షితో నుండుటయే మోక్షము" అనియేకదా దీని యభిప్రాయము.

॥—చిత్తము. దీనిని గుఱించి మీయభిప్రాయమేమి?

బిల్వ—(తనలో) ఇది కష్టమైన ప్రశ్నయే. దీనిని నే నిప్పుడు చర్చింప రాదు. (ప్రకాశముగా) ఇట్టి విషయముల కప్పటికప్పుడే ప్రత్యుత్తరము రాదు. ఇది మిగుల జర్చింపవలసిన యంశము. నెమ్మదిగా దీని విషయము జూతము.

చింతా—చిత్తము.

శ్రీహ—అమ్మాయీ! పెంయెద్ద నీవేవియా శాస్త్రముభ్యసింప వలెనని చెప్పితివే. బాబుతో యిప్పుడు మనవిఁజేసికొనరాదా!

బిల్వ—చింతామణీ! సంశయమేల?

చిం తా—అయ్యది మీరు నాకుఁ దప్పక చెప్పుదుసని వాగ్దాన మొసం గినఁగాని చెప్పను.

బిల్వ—సంగతి దెలియకుండ నే నెట్లు వాగ్దానమీయఁగలను? ఒకవేళ నయ్యది నాకురానిశాస్త్రమైనచో.

చింతా—తమకు వచ్చినదే.

బిల్వ—అట్లయిన సంశయమేల?

చింతా—శ్లోకము తమసన్నిధిఁ జదువవలయునని చిరకాలము నుండి కోరికయున్నది.

బిల్వ—(తనలో)అన్నా! ఇప్పుడు నేనేమిసేయుదును?

చింతా—ఆర్యా! ఆలోచించుచుంటిరే. వాగ్దత్తమునకు భంగముగలుగునా యేమి?

బిల్వ—అట్లెప్పుడును చేయువాడనుగాను.ఉస్!ఉస్(నిట్టూర్పువుచ్చును)

శ్రీహ—అమ్మాయీ! పంతులుగారికిక్కడ గాలి వచ్చుటలేదేమో! విసరరాదూ!

బిల్వ—పోనిండు. తోటలోనున్న విహారమందిరమునకుఁ బోవుదము. రండు.

(అందఱునిష్క్రమింతురు.)

రంగము:—[రాజవీధి—మధుసూదనుఁడు ప్రవేశము]

మధు—(తనలో)ఔరా! ఎంతమోసము జరిగినది!

సీ. నీమీఁదనే నాకు ♦ నిజముగా వలపున్న
దంచువచించిన ♦ యతివమిన్న
నినుబాసియుండిన ♦ నిముస మోర్వఁగజాల
ననినమ్మఁజెప్పిన ♦ వనజనేత్రి
నీ నిమిత్తము నేను ♦ నిఖిలధనాఢ్యుల
జెల్మి బాసితినన్న ♦ జిగురుబోఁడి
యర్థంబులేకున్న ♦ ననురాగమేముఖ్య
మంచును జాటిన ♦ హంసయాన

తే. గీ అరరె! కామశాస్త్రంబును ♦ నభ్యసింప
వలయునని చెప్పి బిల్వమం ♦ గళునిఁ జేర్చి
సారమేయముగఁ జేసి నఁ ♦ సాగనంపె
మోసపోయితి మఱియింత ♦ మోసపోతి.
తే. గీ. బిల్వమంగళు వంచించి ♦ వేడ్క దెచ్చు
ధనముచే నీకు సుఖ మిత్తు ♦ ననుచుఁ బలుక
సంతసించితిగాని యీ ♦ సరణి నాకు
నెత్తిపైనను శఠగోప ♦ మెత్తుననుచు
దలఁపనైతిని గలనైనఁ ♦ వెలవెలంది.

కామశాస్త్రాభ్యాసమని బిల్వమంగళునిఁ జేర్చుకొని నన్ను వెడలనంపుటకే కాఁబోలు.నాకిట్టిపని జరుగవలసినదే. ప్రాణమిత్రుఁడైన బిల్వమంగళుని వంచించి తద్ధనముచేఁ జింతామణియు నేనును సుఖింపఁదలఁచుట మహాపాపకార్యమే. కావున భగవంతుఁడు నాకుఁదగినట్లు చేసినాఁడు.

సీ. కోరినవస్తువుల్ ♦ కొఱఁతలేకుండఁగా
దెచ్చి యభీష్టంబు ♦ దీర్చినాఁను
చీరెసారెలుఁ లేవు ♦ చెచ్చెరఁ దెమ్మన్న
నిల్లాలి నగలమ్మి ♦ యిచ్చినాను
నిల్లుగట్టఁగ నర్థ ♦ మేదన్న నాయిల్లు
నారులకమ్మి ధనంబు ♦ నొసంగినాను
ముసలిదౌ శ్రీమాత ♦ పోరుబడగలేక
యున్న భూముల నెల్ల ♦ యొసగినాను
తే. గీ. తిట్టినను దన్నినను నామ ♦ దిని సహించి
దాసునిగ దానియింటిలో ♦ దనరినాను
వీనినెల్లను మరచి యీ ♦ వేశ్యకాంత
కుక్కగాఁ జేసినట్లు దోలె ♦ నక్కటకట.

ఇదియంతయు దానిలోపము కాదు. ఇయ్యది దాని కుల వృత్తి ఆచింతామణి నాపైఁజూపిన యనురాగమంతయు నా

రొద్ద ధనములాగుటకే. ఈవేశ్యలకుఁ గరుణపూజ్యము. నిజమైన వలపు చుక్కెదురుగానుండును.

చం॥ అనలుని సాక్షిగా గొనిన ♦ యట్టి తలోదరినిఁ ద్యజించి; సజ్జను లొగిదూషణంబులను ♦ నల్పఁగ మిత్రుల కీసుబుట్ట నీ
ధనసతిపజ్జఁజేఁతిని ♦ దద్దయు మోహము కప్పఁగప్ప హా
మనుటిక నెట్టులోకద స ♦ మస్తము గోల్పడినాఁడ దానికై.

ఎంతటి పండితుండైనను వేశ్యా వ్యామోహమున బడెనేని యాజ్ఞానమంతయు నశించును గదా!

సీ. పరకాంతలన్ను మాతృ ♦ భావముతోడ వీ
క్షించుచునుండెడి ♦ శిష్టగుణుఁడు
తండ్రియానతి మౌళి ♦ ధరియించి నిరతంబు
వర్తించు చుండెడి ♦ భవ్యచరితు
డనలుసాక్షిగగొన్న ♦ యతివను బ్రేమతో
నాదరించుచు నున్న ♦ యమలమూర్తి
యెపుడుజూచినఁ బురా ♦ ణేతిహాసంబుల
బోద్ధుపుచ్చుచునుండు ♦ పుణ్యమూర్తి

తే. గీ. యట్టి బిల్వమంగళమూర్తి ♦ యకట! వారకాంతమోహంబులోబడి ♦ జ్ఞానమెల్ల
బాసి మదిలోన నొక్కింత ♦ భయములేక
సంచరించుచు నుండె వే ♦ శ్యగృహమందు.

వేశ్యా సంపర్కము గలిగించుకొనిన వాడెవ్వడును బాగుపడఁడు. నన్నెట్లుజేసెనో యీ బిల్వమంగళుని మాతరి మట్లు చింతామణి సేయక యుండునా? (ఎదుటఁజూచి) సుబ్బిసెట్టి గాబోలు వచ్చుచున్నాఁడు. వీడివ్యాపారము గూడ సగమైనది.

(సుబ్బిశెట్టి ప్రవేశము.)

సుబ్బి—(మధుసూదనునిఁజూచి తనలో) యీపారిపంతులు మొగం. సంతకెల్లొచ్చి నట్టేవుంది. ఈణ్ణి సిఁతామఁణి సెవులట్టుకొని

యీడిశేసిందంట. కాకపోతే యితడివల్ల కొంప గసుత్తుందా యేవిటి. యేవయినా కోవటేపారం కోవఛేపారమే.

మధు—(సుబ్బిశెట్టినిఁ జూచి) సుబ్బిశెట్టియా యేమి! ఈమధ్య నెక్కడను గనుపించుట లేదేమి?

సుబ్బి—పంతులుగారా యేవిటి? పైత్తం జాస్తిఅయి కడుపులో పసరు పెరిగితే బేదిమం దుచ్చుకొన్నాను.

మధు—అవును. అదేపనిగా సుబ్బలక్ష్మి మధరామృతపానము చేయుటవలన, పసరు పెరిగినది కాబోలు.

సుబ్బి—అనే! పెత్తముండ. సుబ్బలక్ష్మి! సట్టకాల్చిన సొల్లునీళ్లు కార్చుకోంటు వుంటుంది.

మధు—అదియేకదా నీప్రియురాలు. చింతామణి నెమ్మదిగా దానిని నీకుఁ దగిలించి నిన్ను చెప్పడ మెందుకులే.

సుబ్బి—నాకేం గెహచారం సింతామణుండగా. ఈకిటుకు నీకు తెలియదులే. అవునుగాని అడగడంమఱచాను. చింతామణీ నీవు యిడాకులిచ్చుకొన్నారట యేంటి?

మధు—అవును. ఇప్పుడు దానికన్ను బిల్వమంగళునిమీద నున్నది.

సుబ్బి—సరేగాని మీరు యాపారులు. భారీమనస్సుగలవారు. పైకం యిప్పించారుకాను. మాకంతాలాబుకాదు. (తనలో) అడగడవేకాని యింకా యితడిచ్చేదేవిటి, నేనుపుచ్చుకొనేదేవిటి.

మధు—చిక్కులుతీరనిమ్ము. పైకమునకేమి. నీతోకొంతరహస్యమున్నది. అటుపోయి మాట్లాడుకొందము-రా. (నిష్క్రమింతురు.)

ఇది పంచమాంకము.

చింతామణి

లేక

లీలాశుకః.

షష్ఠాంకము.

రంగము:—ఉద్యానవనము.

ప్రవేశము:—బిల్వమంగళుఁడు-చింతామణి.

బిల్వ—

చ॥ నవ నవ పుష్పజాతులు మ ♦ నంబునకున్ ముదమొందఁ గూర్చుచు
న్నవి; కనులారఁ జూచితివె ♦ నాతిరొ యింతయుఁ గందకుండ నీ
పువ్వులను గోసితెచ్చెదను ♦ బొందుగ వేణి నలంకరించి; మ
త్ప్రవిమల మానసంబును వి ♦ రాజిలఁ జేయుము సుందరీమణీ.
(అని పువ్వుల గోసితెచ్చి చింతామణి జడయందు బెట్టును.)

చింతా—(తనలో) ఆహా! ఈతఁడెట్టి మోహసాగరమున మునిఁగిపోయి నాఁడు! ఎట్టివా డెంతలో మాఱిపోయెను!

చ॥ కలనయినన్ బరాంగనను ♦ గాంచి యెఱుంగని పుణ్యమూర్తి; ని
ర్మల సుగుణాకరుండు; జన ♦ మాన్య చరిత్రుఁడు; నైన బిల్వమం
గళుఁడిటు సర్వమున్ మఱచి ♦ కామిని సౌఖ్యమె స్వర్గమంచు నన్
విడువక యుండె నీగతి, వి ♦ వేకము సర్వము గోలుపోవుచున్.

బిల్వ—అట్లయిన నేను చాలా తొందరపనిమీఁదనున్నానని చెప్పుము. పొమ్ము.

చింతా—ఆర్యా! అతఁడు మీమిత్రుఁడు. ఏమిపనిమీఁదవచ్చెనో కనుఁగొనుటమంచిది.

బిల్వ—నాకెవ్వరితోడను నేమియుఁబనిలేదు.

మ॥ నినునొక్కప్పుడునైన వీడక సదా ♦ నీతోడనేయుండి, నీ
మనసింపారఁగ సర్వభోగములు సా ♦ మాన్యంబుగాఁ గాంచుచుం
డిన, నాకయ్యెడిచాలు, సంతసముగన్ ♦ వేయేల: సర్వంబు నీ
వని, భావించుచు నున్నవాడ మదిలో ♦ నబ్జాతపత్రేక్షణా!

చ॥ వదలితి నన్నియుం జపత ♦ పంబులతోఁ బనియేమిలేదు, నా
సుదతినినైనఁ జూడఁ బని ♦ శుద్ధచరిత్రయెయైన; మిత్రులన్
వదలితి; తండ్రిసేవ నెడ ♦ బాసితి; బంధులు దిట్టినన్ సరే
వదలగజాల నిన్ను నవ ♦ పంకజపత్రవిశాలలోచనా.

చింతా—(తనలో) ఎంతలో బరమనైష్ఠికుఁ డిట్లుమారినాడు!

చ॥ తనసతి శోకమందునని ♦ తల్పడు, దుఃఖము నొందు తండ్రియుం
చనితలపోయ డాప్తు లప ♦ హాస్యముజేయుదురంచునైన నె
మ్మనమునఁ జూడబోవక స ♦ మంచితధర్మము లెల్లవీడి; న
న్ననిశముగూడి యుండుటె మహా ♦ సుఖమంచుదలంచుచుండెఁగా.

ఈతఁడీరీతిని మారిపోవుటకు నేనేకదా కారణము.

తే. గీ. సకలవిద్యా విశారదు ♦ సచ్చరిత్రు
మహితవిజ్ఞాను సద్వంశ ♦ మణిని నిట్లు
వలపుఁజూపించి వంచించి ♦ యాలరునాకు
నేమిగతి సంభవించునో ♦ యెఱుఁగఁజాల.

(తెరలో)

నేను కొట్టుకొనుచున్నానయ్యా! పుండడల్లోయి. బతికి సచ్చినోణ్ణి. మరేద తీయకండి. నెనొస్తాను. యిడవండి.

చింతా—(ప్రక్కను జూచి) సుబ్బలక్ష్మీ! వీథిలో నాగండ్రగోళ మేమి?

సుబ్బ—(ప్రవేశించి) అక్కయ్యా! చుబ్బిసెట్టిని కోర్టుబంట్రోతులు లాక్కెళ్లుచున్నారు. ఒకటే గోలెత్తుచున్నాడు.

బిల్వ—మన సుబ్బలక్ష్మి కొఱకు వచ్చుచుండు సుబ్బిసెట్టియేనా?

చింతా—అవును. వీనికి మీరేదైన నుపకారము సేయవలయును.

బిల్వ—నీసెట్టికెంత యున్నను ఋణములు నేను దీర్చివేసెదను రమ్ము.

(నిష్క్రమించుచున్నారు.)

రంగము:—[బిల్వమంగళుని మందిరము:—
ప్రవేశము:—విచారముతో రాధ]

రాధ—(తనలో) హా! పరమేశ్వరా!

మ. పతియే దైవమటంచు సంతతము సం ♦ భావించు నాకిప్పుడీ
గతిఁ గారుణ్యము బూనకుండ మదిలోఁ ♦ గల్పింతువే సిగ్గులే
క్షితి నేఁ జేసిన పాపమేమి యకటా ♦ జీవేశు సత్సేవ సం
తతముం జేయని కాంత జీవితము వ్య ♦ ర్థంబౌగదా యెంచఁగన్.

అక్కటా! నాస్థితికి నేమనివగతును!

సీ. పరకాంత నెన్నఁడు ♦ బరికించి యెఱుగని
పూజ్యుండు వేశ్యకై ♦ పోవుచుండె
తండ్రి దైవంబుగాఁ ♦ దలచుచుండెడివాఁడు
తండ్రినే యెప్పుడు ♦ దలపకుండె
నామీఁద నెప్పుడు ♦ ప్రేమ జూపెడివాఁడు
నేనన్న కోపియై ♦ నెగడుచుండె
ననిశంబు హితునితో ♦ నలరుచుండెడివాఁడు
స్నేహితునే దరిఁ ♦ జేర్పకుండె

తే. గీ. సకల శాస్త్రరహస్య వి ♦ చారమెపుడు
సేయువాఁడు దానిని జెవిఁ ♦ జేర్పకుండె
శ్రీరమాధీశు చింతనన్ ♦ జెలఁగువాఁడు
భక్తికి నిదూరమై నేడు ♦ బరగుచుండె.

అయ్యో! నాప్రాణేశ్వరుఁడు నాయందెంత నిర్దయుఁడై యుండెను!

సీ. భోజనార్థముగృహ ♦ మునకువచ్చుటెగాని,
భ్రాంతితోనంతయు వేశ్య ♦ పైననుండు
అతిభక్తి నెదురుగా ♦ నరిగినంతనెచూచి
ననుజూడకయె తప్పు ♦ కొనుచునుండు
దరిఁజేరి భాషింపఁ ♦ దలచిన దొందర
పనియున్న భంగిని ♦ దనరుచుండు
నిలువుఁడీ యొక్కింత ♦ పలుకాడవలెనన్న
సమయంబుగాదని ♦ చనుచునుండు
తే. గీ. ఎవరు నాయార్తిదీర్చెద ♦ రేమి సేతు
నెవరితో మొరవెట్టుదు ♦ ధవునకిట్లు
నిష్కరుణకల్గె నామీద ♦ నేనుపూర్వ
భవమునందునఁ జేసిన ♦ పాపమేమొ.

అక్కటా! నామనోహరుఁడు నాయెడల నెంతనిర్దయుఁడై యుఁడెను!

సీ. ఒకసారి కేల్గింట ♦ నొప్పగాజూచుటే
పదివేలటంచునుఁ ♦ బల్కుయుండ
సంప్రీతితోఁజేయు ♦ సంభాషణమెనాకు
దృప్తియానంచును ♦ దెలుపుకొంటి
సావకాశముగ భో ♦ జనముఁజేసి యరుగు
మంచును వేడ్కఁబ్రా ♦ ర్థించియుంటి
నిమిషంబు గృహములో ♦ నిలిచి చరణసేవ
నైన నిమ్మంచును ♦ నడిగియుంటి
తే. గీ. ఎంతవేడినఁగాని కా ♦ సంతయైన
గరుణఁజూపక యుండెనా ♦ కాంతుఁడకట
యెంతభాగ్యముగల్గిన ♦ నేమిఫలము
కానఁగాచిన వెన్నెల ♦ కరణిగాదె.

నానాథుని చిత్తమీరీతిగా మారునని నేనెన్నఁడును గలనైనఁద లంపనైతిని. పరమపావన చరిత్రుఁడైన యీతఁడీరీతిని వర్తించు

చుండుట నాదురదృష్టముగదా! పతిపదాంబుజసేవఁజేసి కృతార్థురాలుకావి సతిబ్రతుకేల! నాస్థితి యీరీతినున్నది. ఇంకమామగారి చింతకు మేరయేలేదు.

తే. గీ. పరమపావన చరితుఁడై ♦ వరలుకొడుకు
వెలవెలంది మఱగెనను ♦ బెంగచేత
మంచమునఁబట్టి మిగుల దుః ♦ ఖించుచుండె
దిక్కునాకేది దైవమే ♦ దిక్కుగాక.

నిరంతరమును మామగారు కుమారునికై పడుచున్న దుఃఖమును జూడఁజాలక యున్నాను. (ఇంచుక యూరకుండి) అక్కటా! మిట్టమధ్యాహ్నమైనను, నింతవఱకును భోజనమునకు రాలేదు. (ప్రక్కఁజూచి) అదిగో! అడుగుల చప్పుడు వినవచ్చుచున్నది. (పరికించి) ప్రాణేశ్వరుండే వచ్చుచున్నాఁడు.

(బిల్వమంగళుఁడు ప్రవేశించును.)

రాధ—(ఎదురుగాబోయి) ఆర్యపుత్రా! నమస్కరించుచున్నాను. భానుఁడు తన ప్రచండ కిరణపంక్తులను పాంథాళిపైఁ బ్రసరింపఁజేయుచు మలమల మాడ్చివేయుచున్నాఁడు. మిగుల ప్రొద్దుపోయినది. నిండువేసవి. ఇంతవఱకును భుజింపక యుంటిని. మీరెప్పుడరుదెంతురోయని వేచియుంటిని. త్వరగా స్నానముజేసి మడిగట్టుకొనుఁడు. ఉష్ణోదకము దొడ్డిలోనున్నది.

బిల్వ—నాకొఱకు నిన్ను వేచియుండవలసినదని చెప్పియుంటినా?

రాధ—భర్త భుజింపకపూర్వము భార్యభుజించుట ధర్మమా?

బిల్వ—కడుపునింపుకొను విషయములోఁగూడ ధర్మాధర్మములు జూడవలయునా?

రాధ—నాథా! త్వరగా స్నానముసేయుఁడు.

బిల్వ—స్నానము సేయుటకు నాకు వ్యవధిలేదు. ఈపూటకు గాళ్ళు గడుగుకొని భుజించెదను. (ఇంచుక యూరకుండి) నీవు భోజనము పెట్టుట కాలస్యమగును. కావున నేనే పెట్టుకొని తిందును.

(లోపలికి బోవును.)

రాధ—(తనలో) అయ్యో! నేనేమి సేయుదును. ఈతఁడు భ్రాంతి యంతయు వేశ్యయింటిమీఁదనే పెట్టుకొని వచ్చెనుగదా! (ఎదుటఁ జూచి) అదిగో! భోజనముగూడ నైనది.

(బిల్వమంగళుఁడు ప్రవేశించి తొందరగా బోవఁదలచును.)

రాధ—మనోహరా! ఇంతలోనె భోజనముచేసి వెళ్లుచుంటిరా?

బిల్వ—ఇప్పటికే యాలస్యమైనది. నేనుతొందరగా బోవలయును.

రాధ—ఎక్కడికి?

బిల్వ—అట్లడుగరాదని నీకుఁదెలియదా? అట్లడుగుట దుశ్శకునము. నేనిప్పుడు చింతామణియింటికిఁ బోవలయును. నన్ను వారింప వలదు.

రాధ—నాథా! మీరియిచ్చవచ్చినట్లరుగవచ్చును. కాని యాదీనురాలు పలుకువాక్యము లొకనిమిష మాలించి యరుగుఁడు.

బిల్వ—ఇప్పుడేమంతతొందర పని మిగిలిపోవుచున్నది? మఱియొకప్పుడు మాట్లాడరాదా!

రాధ—ఏమైననుసరే. నాయందు గృపవహించి మీరొక్కింతకాల మిటనుండుఁడు. సమ్మతింపరేని మీపాదముల కడ్డువడియైన నాపెదను.

బిల్వ—బాగున్నది. నీయిష్టమేదో కానిమ్ము.

(కూర్చుండును.)

రాధ—ప్రాణేశ్వరా!

సీ. గణికయింటికి బోవ ♦ గారాదనుచు మీకు
బలుమారు నేనెప్పు ♦ పలుకలేదు
అదిలేకునాకు ని ♦ య్యదలేదు తెమ్మంచు
నోరెత్తిమిమ్మెప్పు ♦ గోరలేదు
చింతామణికి మీరు ♦ చేకూర్చు పరమ సౌ
భాగ్యంబునకు నేను ♦ వగవలేదు
వేశ్యచేఁజిక్కి దు ♦ ర్వృత్తి నుంటిరటంచు
జెగి మిమ్మెప్డు దూ ♦ షింపలేదు

తే॥ గీ॥ భవ్యభవదీయ చరణసే ♦ వయె యొసంగ
వేడుచుంటిని; నామాట ♦ వినుచుఁ గరుణ
బూని నాయభీష్టము దీర్చి ♦ బ్రోవఁదగుఁ
ధర్మమేమియుఁ జెప్పఁడీ ♦ ధర్మచరిత.

మహాభాగా! నేను మీరు సేయుకార్యముల కెన్నఁడును నాటంకము గలిగించియుండలేదు. చింతామణిని విడనాడుమని చెప్పలేదు. గృహంబున కరుదెంచినప్పు డొకఘడియకాలమయిన నుండి, ప్రీతితో నాతో భాషించి భక్తితో నేజేయు సర్యల గైకొనుమని వేడితిని. ఇదియే నాప్రార్థన.

చ. పడతికి సర్వభాగ్యములు ♦ భర్తనుబట్టియె కల్గుగాదె; యె
ప్పుడు పతిసేవమూరమయి ♦ పొల్చునొ నాతికి, దానిజన్మ మీ
పుడమిని వ్యర్థమౌనుగద ♦ పూజ్యుఁడ వన్ని యెరింగియుంటి యీ
వడువున నాదలంప వడ ♦ భావ్యము శ్రేయము సంప్రదాయమే?

నాకేమియు భాగ్యము లవసరములేదు. మీ పదాంబుజ సేవమాత్రము నాకు దయసేయుఁడు. ప్రాణకాంతుని పాదసేవయే సాధ్వికి సకలసౌభాగ్యములకును నాలవాలము. అదియే యశంబునకుఁ బట్టుగొమ్మ. అదియే మోక్షసౌధారోహణమునకు సోపానము. వేయేల! పతిభక్తిలేని సతిబ్రతుకు వ్యర్థము. (విచారించును.)

బిల్వ—ఇంతీ! నీవేల విచారించెదవు? నేను నీకుఁ జేసినకొఱంత యేమున్నది?

రాధ—మహానుభావా! మీపదసేవ నాకొసంగకపోవుటకన్న వేరేమి కొఱతయున్నది? పోనిండు. నేను సాధ్వినికానని తలంచితిరా! విద్యలేని దాననా! రూపహీననా! ఏకారణముచేత నాయెడల మీరింత నిష్ఠురత వహించితిరి?

బిల్వ—

మ. వనితా! నీవు మహాపతివ్రతవు లో ♦ పంబెద్ది నీయందుగం
టినటంచుం బచియి పనేర్తు వినుమిా ♦ డెందంబు చింతామణీ

వనితా మోహనిబద్ధమయ్యె, నిక నే ♦ వారింప లేరెవ్వరుణ్
మనమందున్ ననుగూర్చినీవు వగవం ♦ భావ్యంబుగా దింకిటన్.

రాధా! నీవు విచారించినందువలనం బ్రయోజనము లేదు. నే నా చింతామణీమోహపాశమునం గట్టువడితిని. అదియే మోక్షమని భావించి యితర వ్యసనంబుల విడిచి వేసితిని.

రాధ—(ఏడ్చుచు) హా! నాథా! వారాంగనకొఱకై కులకాంత నిట్లు నిరాదరంబునం జూచుట న్యాయముగాదు. మీ కృపాంబువులు నాపై వర్షింపకపోయినచో నేనొక్క నిమిషకాలమయిన జీవింపంజాలను. భవదీయ దివ్యచరణకమలస్మరణ సేయుచు బ్రాణంబులు విడిచెదను. పిదప మీరు పశ్చాత్తాప మందెదరు.

బిల్వ—నీవు విచారింపవలదు. ఇప్పుడు నీపలుకులు నాచెవింబడవు.

ఉ. శ్రీరమణీకళత్రపద ♦ చింతనమాధురికన్న; మేటిద్రా
క్షారసతీరురన్న; ఘన ♦ శర్కరకన్నం బవిత్రమైన భా
గీరథి నీరుకన్నంగడుం ♦ గీర్తిదమై, మధురంబునౌచు నొ
ప్పారు ధనాంగనాయధర ♦ పానము నన్నుం గృతార్థుంజేయుతన్.

మ. జలకేళిన్ సవరింపం జేలమును ని ♦ చ్చన్ విప్పంగాంజూచి, చ
ప్పుడుగాకుండను పెన్కకేగగను నన్ ♦ బొల్పార వీక్షించి, యె
వ్వడురా వచ్చెనటంచునుం బలికి యా ♦ పై నన్ను వీక్షించి నా
వలవంగల్గిన తప్పుసైపుమనుచున్ ♦ బ్రార్థించు చింతామణీ
జలజాతేక్షణ వాక్యజాలము నను ♦ సంప్రీతితో నేలుతన్.

(కొంతదూరము నడువగా- రామశాస్త్రి బ్రవేశించును.)

రామ—(ప్రవేశించి) ఓహో! మిత్రుండగు బిల్వమంగళుండా! చింతామణీ మోహపాశమునం జిక్కి స్నేహితుండనైన నన్నుం గూడ జూడక యుంటివికదా! దిక్కుమాలిన ముండ నీకెక్కడ దాపరించినది. ఏమయినను రెండు నిమిషములు నాతో మాట్లాడెదవా?

బిల్వ—రామశాస్త్రీ! నేను సత్వరముగ నరుదెంతునని చింతామణితో
 జెప్పియున్నాను. అది నారాకకై వేచియుండును.
రామ—ఇదియేకదా తొందరపని.

చ॥ గురుపితృభక్తియుఁ శమముఁ ♦ గూర్మియు, జ్ఞానము సర్వశాస్త్ర వి
 స్ఫురణవివేకముఁ వినయ ♦ ముఁ మొదలైనసమస్త సద్గుణో
 త్కరము బరిత్యజించి ధన ♦ కామిని కెట్లు వశుండవైతివో
 యరయఁగ నీ చరిత్రమిపు ♦ డద్భుతమై కనుపట్టె మిత్రమా.

 అనేకకొంప లార్చిన యామముండకుఁ జిక్కి యెట్లయితివి?
బిల్వ—రామశాస్త్రీ! నీవుదానిని దూషింపకుము. వలయునెడ నన్ను
 దూషింపుము.
రామ—నిన్నేల దూషింపవలెను? ఆ మాయముండయగు చింతామణి
 వలలో నెట్లుదగులుకొంటివో యూహింపజాలకున్నాను. నీ
 వేదాంతశాస్త్ర వివేకమంతయు నేమైనది? నీపితృభక్తి యిప్పుడే
 మూలదాగినది? భార్యపైనున్న నీప్రేమ యెందడంగినది?

చ. అనలునిసాక్షిగాఁ గొనిన ♦ యట్టితలోదరి యాత్మగుంద; నీ
 జనకుఁడు నిన్ను గూర్చి కడు ♦ స్వాంతమునఁ దపియింప నెల్లస
 జ్జనులు హసింపఁగా సకల ♦ శాస్త్రములఁ బఠియించినట్టి యా
 ఘనతచెడంగ నిట్లు ధన ♦ కామినిఁగూడి చరింతువే కటా.

బిల్వ—మిత్రమా! చింతామణి లోకములో వేశ్యలవంటిది కాదని
 నేనుఘంటాపథముగఁ జెప్పగలను. సర్వశాస్త్రార్థ సంచయ
 రహస్యసారమంతయు జింతామణి యధరామృతమునందే యు
 న్నది. సకలసత్కర్మలఫలంబు చింతామణి ముఖమండల
 దర్శనమునందే యిమిడియున్నది. వేయేల! సంపూర్ణశశాంకర
 బింబ ప్రతిమానమగు చింతామణీవదనాంభోరుహవీక్షణ
 మే నాకు సర్వమునని భావించి యుంటిని.

రమ—సఖుడా! ఆగ్రహింపకుము. మానము విక్రయించుకొని జీవ
 యాత్రఁగడుపు చింతామణిని శ్లాఘించుటకే కాబోలు నీవింత

పాండిత్యమార్జించితివి. చింతామణి తక్కిన వెలకాంతలవంటిది కాదని పలికితివి. వేశ్యాజాతియందు ద్వివిధములులేవు. నీవు వెఱ్ఱివాడవై పలుకుచుంటివి.

సీ. మాయలెన్నో పన్ని ♦ మాన్యచరిత్రుల
మోహాబ్ధిలోపల ♦ ముంచుచుందు
కపటానురాగంబు ♦ విపరీతముగఁజూపి
విత్తంబుగ్రొని ♦ వెలయుచుందు
వలపుమందుల దంప ♦ తుల కెడబాపి వి
టుల కుక్కలుగ జేసి ♦ పిలుచుచుందు
పలుబాసలనుజేసి ♦ వలపును గలిగించి
దాసులుగాఁజేసి ♦ దనరుచుందు

తే. గీ. నేయునేటిక భూమిలో ♦ వేశ్య కెట్టి
లేనితంత్రి మొక్కటియును ♦ లేదు; దానిఁ
వలచి, వర్తించుచుండెడి ♦ వానిబ్రదుకు
పరమనీచంబుగాఁ గందు ♦ భవ్యమతులు.

నీ విన్నిగ్రంథములఁ జదివితివి. నీ వెంతైన వేశ్యలతోఁగూడి యుండుట యోగ్యమైనదని జదివితివా?

బిల్వ—గ్రంథావలోకన మేల? స్వానుభవమే.

రామ—చింతామణివలన నేనా?

బిల్వ—అవును. నీవుచెప్పిన సంగతులన్నియు పక్కిన వేశ్యల విషయమై వర్తించునేమోగాని చింతామణికి మాత్రముగావు. చింతామణి నిశ్చయముగా సమస్తసద్గుణమణియని నాయభిప్రాయము. ఆశరదిందు బింబప్రతిమాన వదన, ఆనీలకుంతల, ఆసరోరుహ పత్రవిశాలలోచన, ఆహేమాంగి, అసింహేంద్రమధ్య, ఆమద గజయాన, నిజముగా వేశ్యలలోఁ బుట్టవలసినదికాదు.

రామ—అవు నవును. చింతామణిని వర్ణించుటకు నీకుక్షిలోఁ బదములు చాలకున్నవని తెలుచెను. "తాన వలచిన దంభ, తానుముని

గిఁదిగఁగ" యనువాక్యము సార్థకము జేసితివి. ఆమాయవేష
ములే యింతమంది కొంపలు మ్రింగివేయుచున్నవి.

సీ. గబ్బువాసన యింత ♦ కన్పట్టకుండంగ
సబ్బుతో దేహంబు ♦ చమిరి చమిరి
మొలక కంపింత్రైన ♦ మీఁదికి రాకుండ
దలపైసువాసనఁ ♦ బులిమి పులిమి
చుట్ట కాల్చిన కంపు ♦ చూపట్టకుండంగ
పెక్కుసార్లాకులు ♦ కుక్కికుక్కి
కనుబొమల్ నల్లగా ♦ గనిపింపఁ గాటుక
బల్ పసందుగ నెంతో ♦ బ్రామిబ్రామి

తే. గీ. వీధిగుమ్మంబు కడఁజేరి ♦ విటులువచ్చు
వేళఁజూచుచు నీమాయ ♦ వేషమునను
వారి లోఁగొనుచుందురు ♦ వారసతులు
వారిజేరెడివారల ♦ బ్రతుకురోత.

బిల్వ—హితుఁడా! చింతామణి సహజసౌందర్యవతి. నామీఁదనున్న దాని
వల పసారము.

తే. గీ. బిల్వమంగళ స్మరణమే ♦ వెలదికెపుడు
రామనామ సన్మంత్రపా ♦ రాయణంబు
భవ్యచింతామణి నామ ♦ భజననాకు
మోక్ష సామ్రాజ్యలక్ష్మినిఁ ♦ బొందఁ దెరువు.

రామ—బిల్వమంగళా! ఎంత వెఱ్ఱివాడవు. వేశ్యకెక్కడనైనను నిజ
మైన వలపుండునా? ధనమిచ్చు ప్రతి విటునియందును వలపుఁ
జూపుచునేయుండును. కాకిజాతియందు తెలుపును, వేశ్యకు
నిజమైన వలపును జూడలేము. ఇంక నీతర్కము గట్టిపెట్టి నా
మాటవినుము. వేశ్యామోహసాగరంబునఁబడి మునిగిపోయిన
వారల నెందరనో చూచినాను. ఇంక నీవా చింతామణిపేరు
స్మరింపక,

తే. గీ. నిన్నె దైవంబుగా నెంచు ♦ నీరజాక్షి
రాధపైనఁ జూపింపుమా ♦ రమ్యకరుణ
నిన్నుఁగూర్చిన బెంగచే ♦ నెగడుచున్న
తండ్రిపైఁ బ్రేమ జేర్పుము ♦ ధన్యచరిత.

బిల్వ—ఇదియేనా నీవుచెప్పుసంగతి. చాలుచాలు. చింతామణి నాకై నిరీక్షించుచుండును.

(నిష్క్రమించును.)

రామ—ఆహా!

తే. గీ. వలదు వలదంచు గొంతెత్తి ♦ పలుకుచున్న
వినక చని గోతిలోఁబడు ♦ మనుజుకరణి
నెంతచెప్పిన నామాట ♦ నింతయేని
వినక చనుచుండె నీతఁడు ♦ వెఱ్ఱిదగుచు.

ఓ వేశ్యావ్యామోహాయంత్రమా! నీయొద్ద నెట్టి యాకర్షణశక్తియున్నది! అంటువ్యాధివలెఁ బ్రాకుచున్న యీచీడ యెప్పటికి నశించునో! ఎప్పుడు భారతవర్ష ముద్ధరింపబడునో!

(నిష్క్రమించును.)

ఇది షష్ఠాంకము.

చింతామణి.

— లేక —

లీలాశుక.

సప్తమాంకము.

[రంగము:—గదిలో మంచముపై వాసుదేవమూర్తి-
ప్రక్క రాధ - ప్రవేశము]

రాధ—(తనలో) ఆహా! పుత్రవాత్సల్యము వర్ణనాతీతముకదా!

తే. గీ. పుత్రుఁ డవివేకియైననుఁ ♦ బూజ్యుడైన
పరమ గుణవంతుడైన ని ♦ ర్భాగ్యుఁడైనఁ
దండ్రి ప్రేమను బల్కంగఁ ♦ దరముగాదు
కడుపువంటి తీపినిఁ గానఁ ♦ గలమె జగతి.

ఈ మహానుభావు డింతకుమున్నె యనేకసారులు 'అబ్బాయి వచ్చెనా, వచ్చెనా' యని యడిగి కన్నుమూసినాడు. ఏమి యుపద్రవము తటస్థించునో తెలియకున్నది. చింతామణి గృహముననున్న నా నాథున కనేకవార్తలఁ బంపితిని. ఇంత వఱకును రాలేదు. ఇప్పు డెటుబోయి యెటు వచ్చినను నాకు రెండవదిక్కు లేదు. జగమంతయు నంధకార బంధురమై యున్నది. అదిగో! అంధకారమునకుందోడు దట్ట

ముగ మబ్బు గ్రమ్మినది. భగవంతుఁడా ! దీన శరణ్యుఁడ వగు నీవే నాకీసమయమున దిక్కు.

వాసు—ఊ! ఊ! ఓహో! ఏమి విమానము. నాయనలారా ! మీ రందఱు విష్ణు కింకరులా! నాకొఱకే వచ్చినారా! ఆహా! ఏమి నాభాగ్యము!

రాధ—(భయమును నటించుచు) అయ్యో! ఈయనమాటలు నాకు మిగుల భయమును గలుగఁజేయుచున్నవి. ఈరాత్రి గడచు నట్లులేదు. (వాసుదేవమూర్తినిఁ జూచి) మామగారూ! మామగారూ! ఏమిటి పలుకుచున్నారు? యొత్తిగిలిపరుండుఁడు.

వాసు—ఆ. ఆ. ఏమీలేదు. అబ్బాయి వచ్చినాఁడా!

రాధ—కబురు పంపినాను. ఇప్పుడే రాగలరు. మీకెట్లున్నది?

వాసు—అమ్మాయీ! రాధా! గుండెనొప్పి కొద్దిగా తగ్గినట్లున్నది. నీవు భయపడకుము. (ఇంచుక యూరకుండి) అబ్బా! అది యొక విధమయిన మమత నాకన్నులఁగప్పుచున్నది. నాయనా బిల్వమంగళా!

రాధ—(తనలో) అక్కటా! ఈయన కుమారుని విషయములో నెంతగా బలవరించుచున్నాఁడు ! చింతామణి గృహమునకు మరల నెవ్వరినైనఁ బంపుటకు మనుష్యులయిన లేరు.

వాసు—అమ్మాయీ! ఈరోజున కృష్ణాష్టమికదా! ఆహా! ఏమి మంచిరోజమ్మా. అబ్బాయి వచ్చినాఁడా?

రాధ—(ఎదుటఁజూచి) అదుగో! వచ్చుచున్నారు.

[బిల్వమంగళుఁడు - ప్రవేశము.]

రాధ—(బిల్వమంగళునిఁ జూచి) ప్రాణేశ్వరా! మామగారు స్థితిలో నున్నారు. మీవిషయమై యనేకపర్యాయము లడిగినారు.

వాసు—నాయనా! బిల్వమంగళా! (ఇంచుక తలయెత్తి) వచ్చితివా? ఇటురమ్మా.

బిల్వ—(వెండి)సి సమీపించును.)

వాసు—కుమారా! నాకు వచ్చేప్రాణము, పోయేప్రాణము! ఇట్టిస్థితిలో భార్యను నోటిగా విడిచి వేశ్యాగృహమున నున్నచో నిక్కడ నెవ్వరుదిక్కు? ఇంత వివేకశూన్యుడ వైతివేమి? అహర్నిశ లాచింతామణియింటనే యుండవలయునా? చచ్చుటకు సిద్ధముగానున్న నాయొద్ద రెండు నిమిషము లుండకూడదా? ఇంకను నీకు బుద్ధి యెప్పటికి వచ్చునది? ఆపాడుముండ నిన్నెట్లు కట్టివేసినదిరా?

బిల్వ—ఇట్లు దూషించుటకేనా నేను రాలేదని కలువరించితిరి? మీరేమయినను సరే చింతామణిని దూషించవలదు.

వాసు—వేశ్యయన్న నీకంత యభిమానమురా! అయ్యో! దానిని మఱగి సుగుణశీలయగు యీరాధను జూడకుంటివిగదా. తండ్రిని నేను బ్రదికియుంటిని గనుక చెప్పుచుంటిని. నాయనంతరము నీకుం జెప్పువారెవ్వరును లేరు. నీ నిమిత్తము కంటికి మంటికి నేకధారగాం నేడ్చుచున్న రాధనైనం జూడవేమిరా! ఈమెయందు నీవేమి దోషము గనిపెట్టితివి. ఎప్పుడును నీసేవ తప్ప యన్యమెఱుగని సాధ్వి. అట్టిఈపవిత్రచరిత్రను దుఃఖపెట్టుటధర్మమా? "కలకంఠకంఠి కన్నీరొలికిన" అని చిన్ననాడు చదివిన పద్యము మఱచి పోయితివా?

బిల్వ—తండ్రీ! ఈసమయమున నావిషయమై మీరనవసరమైన యాందోళనము మనస్సులో బెట్టుకొనకుడు. నేను చిన్నవాడనుగాను. నామంచిచెడ్డలు నాకు దెలియును.

వాసు—తెలిసియే యిట్లు చేయుచుంటివా? ఏమో చదువుకొంటివనియు, వంశమునకుం గీర్తి దెచ్చి నన్ను గృతార్థుని జేయు కుమారుండవనియు దలంచితినిగాని, యిట్లా విషపూరిత మధుఘుటికయగు చింతామణికి దక్కి యీగతి నగుదువని నేనెన్నడును దలంపలేదు. ఇప్పుడైనను బుద్ధి తెచ్చుకొని సాధ్వీమణియగు రాధం జూచుకొనుచు, సతిశాంతముగ గాలమును వెళ్ళదీయుము.

బిల్వ—ఎప్పుడు చెప్పిన నిదియే సోదికదా! చింతామణి చింతామణి యని దూషించుచుందురు. అదేమి చేసినది? మీకు జబ్బుగా నున్నదని మీయందుండు ప్రేమచే జూచివచ్చుటకు నన్ను మెడ పట్టుకొని నెట్టినది. ఇప్పు డర్ధరాత్రి సమయమైనను మరల నేనచ్చటి కేగి మీ దేహస్థితిసంగతి జెప్పువఱకు నిద్రింపక వేచియుండును.

రాధ—(తనలో) ఈ యర్ధరాత్రి సమయమున చావుబ్రతుకులతో నున్న తండ్రినివిడిచి మరల జింతామణి యింటి కేగును గాబోలు. హా! దైవమా! నాకిప్పు డేమిదారి. (ఆలోచించి) కానిమ్ము. ఈరాత్రికి పడవదాటించు పల్లెవాడు రేపున లేకుండ జేసివచ్చెద గాక. (నిష్క్రమించి వెంటనే బ్రవేశించును)

వాసు—అమ్మాయి! రాధా!

రాధ—(సమీపించి) మామగారూ! ఏమి సెలవు?

వాసు—అమ్మా! నాకాయాసము హెచ్చుచున్నది. నాకు జీవితాశ యేమియును లేదు. కుమారునికంటె నెక్కువ వాత్సల్యముతో నన్నరసిన నీఋణమును నేను దీర్చుకొనజాలను. నీవాప్రాణేశ్వరుడు చింతామణికి దగులబెట్టిన యాస్తిగాక నావశమున నున్న యాస్తి నీకిచ్చుచున్నాను. ఇదిగో! ఆసంబంధమైన పత్రములు.

రాధ—(సందేహించును.)

వాసు—అమ్మా! సందేహించెద వేల? రమ్ము.

రాధ—(వాసుదేవమూర్తిని సమీపించి కాగితములు దీసికొనును.)

బిల్వ—కన్నకొడుకు నిట్లు సేయుట ధర్మముగాదు.

వాసు—ఇదియంతయు నీవశము జేసితినేని రేపుసాయంత్రమునకే యంతయు మండబెట్టెదవు. ఇప్పటికైనను నీకుగలిగిన కొంత యేమియు లేదు. అంతయు రాధ స్వాధీనమున నుండును. నీవు బుద్ధిమంతుడవైతివా, పదిమందికిబెట్టి నీవనుభవింపవచ్చును. లేదా నీకర్మ మెట్లున్న నట్లగును.

బిల్వ—పోనిండు. అట్లేయగును.

రాధ—(బిల్వమంగళునిఁజూచి) ప్రాణేశ్వరా! ఈపత్రములు ఈయాస్తి నాకుఁగావలయునా? నాకు మీ పాదసేవతప్ప మఱియేదియు నవసరములేదు. ఇవిగో పత్రములు. మీచిత్తము వచ్చినట్లుసేయుఁడు. (కాగితము లిచ్చును.)

వాసు—అయ్యో, అయ్యో, వాసి కీయవలదు. కొంప ముంచివేయును. (ఇంచుక యూరకుండి) అబ్బా! ఆయాస మంత కంత కధికమగుచున్నది. గుండెలలో బరువుగా నున్నది. (కన్నులు మూయుచున్నాఁడు)

రాధ—మామగారూ! మామగారూ!

బిల్వ—తండ్రీ!

వాసు—నారాయణ. నా+రా+ణ

రాధ—నాథా! చూచెదరేల. ఈయన మనల విడిచిపెట్టి వెళ్లుచున్నారు. మంచమునుండి క్రిందికిదింపి పరుండఁ బెట్టుదము. రండు! రండు! (ఇరువురును బట్టి వాసుదేవమూర్తిని క్రిందికిదింపి పరుండఁ బెట్టుదురు.)

రాధ—(పరికించి) అయ్యో! యింకేమున్నది! మామగారు మనలవిడిచి పెట్టినారు.

బిల్వ—హా! తండ్రీ!

ఉ॥ చిన్నతనంబునుండి యర ♦ చేతిని నప్పముఁ బెట్టి పెంచి, వి
ద్వన్నుతు గాఁగఁ జేసి కృప ♦ భాసిల నాపయిఁ జూపుచుండి, స
న్నెన్నివిధంబులో యరసి ♦ యీగతి ప్రేమను బాసి యక్కటా
నన్నునుఁ గోడలిన్ విడువ ♦ న్యాయమె! మమ్మెవ రింక గాంతురో.

రాధ—నాథా! ఈసమయమున మీరు చింతించినందువలన బ్రయోజనములేదు. మనల నోదార్చువా రెవ్వరును లేరు.

బిల్వ—అయ్యో!

తే. గీ. సంతతము నాదు క్షేమమే ♦ స్వాంతమందు
దలచి, బుధులఁ జెప్పెడి ♦ ధర్మచింతు

డట్టి నాతండ్రి ననుబాసి ♦ యమరపురికి
నరుగ; నెట్లోర్వఁగలవాడ ♦ దరుణిమిన్న.

రాధ—పితృశోకము దుర్భరమైనదే! కాని,

మ॥ తనువుల్ శాశ్వతమే; యశోవిదితమాం ♦ ధాతాది భూమీశ్వరుల్
జనరే! యైహిక సౌఖ్యముల్ సతములా ♦ జాయాత్మజుల్ నిత్యులా
ఘనసౌధంబులు, భాగ్యముల్ ధనము వీ ♦ కన్ వెంట నేతెంచునే
యనఘా! సర్వమెఱింగియుండి యిటులే ♦ లా చింత స్వాంతంబునన్.

(పెద్దధ్వని వినవచ్చును.)

బిల్వ—(ఉలికిపడి) ఆధ్వని యేమి?

రాధ—నాథా! అది పిడుగుపడినచప్పుడు.

బిల్వ—(ఆతురతతో) హా! ఏమీ! పిడుగే. చింతామణిమీఁద పడినదేమో! నేను సత్వరముగఁబోయి చూచివచ్చెదగాక!

(నడుచుచున్నాఁడు.)

రాధ—(వెంటఁబడి) నాథా! ఏమిది? ఇప్పు డెక్కడికిఁబోవుదురు ? అర్థరాత్రిసమయము.

బిల్వ—చింతామణి యింటికి. దాని కేమియుపాయము వాటిల్లెనో యరయవలయును.

రాధ—అక్కటా? ఈయధర్మమేమి! అర్థరాత్రి సమయంబున నీశవముయొద్ద నన్నొంటిగనుంచి యిప్పు డయ్యెడకుఁ బోవుదురా? ఏమిసాహసము. ఈశవమునకుఁ బ్రేతసంస్కారాదిక్రియలు నిర్వర్తించినపిదప మీయిష్టమువచ్చినట్లు సేయుఁడు.

బిల్వ—అంతవఱకును నాచిత్తము నిలువదు. అయిన నీరాత్రి నేను చేయవలసినపని యేమియు లేదు.

(నిష్క్రమించును.)

రాధ—హా! ఎంతయధర్మము! హా! ప్రాణేశ్వరా! నీ వెంతకఠినహృదయుఁడవైతివి? అర్థరాత్రి సమయమునఁ దండ్రిశవంబు నిట్లు విడిచి వారాంగన గృహమున కరుగుచుంటివే! (దైవమునుద్దేశించి) హా! పరమేశ్వరా! నీతికోవిదులగు మహాపురుషులకుఁ

గూఢ మాయవలపుఁజూపించి, మోహసాగరంబున ముంచి పెక్కుకొంపలు మాపుచు, ననేక సాధ్వీశిరోమణుల నేత్రముల నుండి నీరుగారఁజేయుచున్న యీవేశ్యల నేలసృజించితివి? వీరి వలన బరమపవిత్రమైన భారతవర్షమునకుఁ గళంకమువచ్చుచున్నది. వీరమహాపతివ్రతల శాపవాక్యాగ్నిజ్వాలలు మిమ్మేల దహింపకున్నవి. మీరేల వివాహములఁజేసికొని సుఖింపరు. ఓ సంఘసంస్కరణాభిలాషులారా! వేశ్యకాంతాగృహంబుల కరుగవలదనియు, వారిమేళముల బిలువరాదనియు, నిచ్చకంబులకు నుపన్యాసములిచ్చినందువలనఁ బ్రయోజనములేదు. నిజమైన దీక్షవహించి, వేశ్యలను వివాహితలగాఁజేసి యశమునార్జింపుఁడు. ఈపాపవృత్తిని భస్మీపటలము జేయుఁడు. ప్రక్కలోని నల్లులవలె బాధింపుచు, ననేకసంసారముల గంగలోఁగలుపుచున్న యీ పడుపుగత్తెలను నలిపివేయుఁడు. వారాంగనామారణమహాధ్వరకార్యమున కుపక్రమింపుఁడు. (ఇంచుకయూరకుండి) ఎవరో పిల్చుచున్నట్లున్నారు. ఎవరులేరు. కృష్ణవేణియే నన్ను దనలోఁ జేరి స్వర్గమున కరుగుమని ప్రబోధించుచున్నది. నేనిప్పు డామెనే శరణుఁబొంది శాశ్వతపదవి నందెదఁగాక!

(నిష్క్రమించును)

రంగము.—[చింతామణిసౌధము:—ప్రవేశము—చింతామణి]

చింతా—(తనలో) ఆహా! నేఁడు శ్రీకృష్ణాష్టమి యగుటంజేసి యాలయములోని గోపాలవిగ్రహమును సంపూర్తిగ నలంకరించినారు. ఆహా! విగ్రహసందర్శనము జేసినప్పుడు నాయొడలు మఱచిపోయితిని. అమ్మహాత్ముని సేవించి యెంతమంది భవబంధములఁబాసి కృతార్థులయిరి. (శ్రీకృష్ణుని నుద్దేశించి) హా! కృష్ణా!

సీ. కడుపు చల్లగ నిన్ను ♦ గన్నయా దేవకి
తొలినేమి వ్రతములా ♦ సలిపెనో కా

బిడ్డగా నిన్నెత్తి ♦ పెంచినట్టియశోద
వాసిగా నేవ్రాజ ♦ జేసెనొక్కొ
యనిశంబు నీతోడ ♦ నాడుపాడినగోప
బాలు రెంతటి భాగ్య ♦ వంతులొక్కొ
భవదీయ మహిమంబు ♦ బాగుగా నెఱిగిన
యక్రూరుఁ డెంతపు ♦ ణ్యాత్ముఁడొక్కొ
తే. గీ. విమలమౌ నీకరుణగాంచి ♦ వెలయుకుబ్జ
యెంత ధన్యాత్మురాలొక్కొ ♦ యిట్టివచ్చి
పిడికెడటుకుల నర్పించి ♦ విభవమెంతొ
యందిన కుచేలుడెంత కృ ♦ తార్థుఁడొక్కొ.

దేవా! నందనందనా! భవదీయ నామము చ్చరించుటకైన నర్హతలేని నీచజన్మమందిన నన్ను రక్షింపుము.

(నిద్రించును.)

[శ్రీకృష్ణుండు ప్రవేశించును.]

శ్రీకృ—(తనలో) పగచేనైనను, ప్రేమచేనైనను, భక్తిచేనైనను, నన్ను భజించువారికి శుభంబుల జేకూర్చుచుందును. నేడీ చింతామణి మదీయాలయంబునకు వచ్చి నన్ను దర్శించుటంజేసి మనంబున నాయందొక విధమైనభక్తి యేర్పడినది. ఇయ్యది యింతవఱకును నీచవృత్తి నవలంబించియున్నను, నేటికి నాపై భక్తిగలుగుటంజేసి కృతార్థురాలు కాగలదు. దీనివలన బిల్వమంగళుండునుగూడ ధన్యుఁడయ్యెడుగాక! (అంతర్థానుడగును.)

చింతా—(దిగ్గున లేచి) కృష్ణా! నిలువుము. నిలువుము.

ఉ. ఆర్తను నైననన్నుఁ గృప ♦ నాదరణంబొనరింపఁ గ జగ
త్కర్తవు వచ్చినాడవిటు ♦ గావున దీనికి సత్ఫలంబుగా
ధూర్తవిదారి! నామనము ♦ దోరముగా భవదీయచింతనా
వర్తిలజేయుమయ్యా ముని ♦ వందిత! నిన్నికనాశ్రయించెదన్.

(ఇటునటు బరుగెత్తును.)

సుబ్బలక్ష్మి—(ప్రవేశించి) ఏవిటక్కయ్యా! నిద్దరలోనుంచి గభాలున లేచి పరుగులెడుతుండావు. మేళాని కెళ్లినప్పు డెక్కడైనా జడుసుకొన్నావా యేవిటి?

చింతా—కృష్ణా! పిలుచుచుండఁగాఁ బోవుట ధర్మముకాదు.

మ. మునులున్ జ్ఞానులు సాధుమార్గచరులే ♦ పుణ్యాత్ము నిం జూడగా
ఘననిష్ఠం దప మాచరించియు వెసన్ ♦ గానంగలేకుందు రా
సనకాద్యుత్తమ మౌనిపూజిత పదా ♦ బ్జాతున్ రమాధారునిన్
నినువీక్షించితి సంతసంబొదవె తం ♦ డ్రీ నన్నురక్షింపవే.

మ. ధనమే మోక్షమటంచు నెంచుచును జి ♦ త్తంబందు శంకింపకే
జనులన్ మోసముసేయు నీచమగు వే ♦ శ్యావృత్తినింబూనినా
నని శంకింపకుమయ్య మ్రొక్కెదను నే ♦ నావృత్తివర్జించి నీ
ఘనపాదంబులగొల్తు దీనజన ర ♦ క్షా! నన్నురక్షింపవే.

(ఇటునటు జూచును)

సుబ్బ—ఏవిటక్కయ్యా! పిచ్చిదానికిమల్లె ఇటూ అటూ పరుగు లెడ్తావు. (పట్టుకొనును.)

చింతా—ఏడీ! భగవంతుఁడగు వాసుదేవుఁ డెట్లరిగినాఁడు?

సుబ్బ—వాసుదేవు డెవరు?

చింతా—కృష్ణుఁడు.

సుబ్బ—కుష్టుడు మనింటికెల్లా వస్తాడు?

చింతా—వచ్చినాడే.

మ. తొలు కార్మబ్బునమించువోలె నొడలం ♦ దున్ జాళువా పుట్టపున్
వలెవాటొప్పగఁ గౌస్తుభం బురమునన్ ♦ భాసిల్ల మౌళిన్ శిఖం
వళపింఛంబలరన్ రథాంగదరముల్ ♦ బాహుద్వయిందాల్చి; ని
స్తుల కారుణ్యముబూని నిల్వగను; ని ♦ చ్చోటన్ విలోకించితిన్

సుబ్బ—నాకు సూపించావు కాదే వక్కయ్యా! నీతో యేవన్నా సెప్పినాడా?

చింతా—చెప్పకేమి!

మ. కులకాంతా మణులెల్ల దిట్టఁగను నె ♦ గ్గున్ సిగ్గు లేకుండ; ని
ర్మలచిత్తంబుననుండు ధీరులఁ జలిం ♦ పఁ జేసి; ద్రవ్యార్జనం
బిలగావింపుచు గాలమున్ గడపగా ♦ నీక్షింప శ్రేయంబె ని
శ్చలభక్తిన్ భజియింపుమీ నను మహా ♦ సౌఖ్యంబు జేకూరెడిన్.

అని చెప్పినాఁడు.

సుబ్బ—నువ్వు డబ్బు తెచ్చుకుంటూ వుండావని ఆయనక్కూడా కన్ను కుట్టింది కావోసు.

చింతా—ఆమహాత్ముఁడు నాకు భక్తిప్రబోధము జేసినాఁడు. సుబ్బలక్ష్మీ! నేనొనర్చిన పాపమునకు మేరయున్నదా?

సీ. పాపమూలంబైన ♦ పడుపువృత్తినిబూని
వారి వీరికి కొంగు ♦ పఱచినాను
ప్రేమఁ జూపించియో ♦ బెదరించియో సర్వ
జేసియొ ధనమునా ♦ ర్జించినాను
పడతు లెందఱో తమ ♦ ప్రాణనాథులకును
జీవముల్ వాయఁగా ♦ జేసినాను
భాగ్యవంతులను ని ♦ ర్భాగ్యులుగ నొనర్చి
తిండికై తిరిపె మె ♦ త్తించినాను
తే. గీ. రాత్రియనక పవలనక ద్రవ్యమే ని
జేశుగానెంచి నాదరిఁ ♦ జేరినట్టి
వారి నెల్లరఁ గూడి పా ♦ పంబుగట్టు
కొంటి నక్కటా! నాజన్మ ♦ కూలిపోను.

సీ. పిటకాండ్రచే నుండి ♦ విత్తముల్ గొన మాయ
వేషము లెన్నెన్నో ♦ వేసినాను
సిగ్గన్న మాటను ♦ చిత్తమందున జేర
గానీక గజ్జను ♦ గట్టినాను
వృద్ధిలోనికి వచ్చు ♦ బుద్ధిమంతుల జేర్చి
పదిమంది కొంపల ♦ బాపినాను

పలుబాసలనుజేసి ♦ వలపుమగల్గించి
మించివిటులను న ♦ మ్మించినాను

తే. గీ. కుంటిదైన గుడ్డిదయినను ♦ కుష్ఠుదైన
నిక్కమా విటకాడవు ♦ నీవెయంచు
బలికియున్నాను మిగుల పా ♦ పంబు గట్టు
కొంటి కటకటా నాజన్మ ♦ కూలిపోను.

(తలుపుచప్పుడువిని,)

సుబ్బలక్ష్మీ! ఎవరో పిలుచుచున్నారు. అర్థరాత్రి సమయమున నెవ్వరువత్తురు? కనుఁగొనిరమ్ము.

సుబ్బ—(నిష్క్రమించి) అక్కయ్యా! బావయ్యగారె వచ్చింది.

(బిల్వమంగళుఁడు తడిబట్టలతో బ్రవేశించును.)

చింతా—(బిల్వమంగళునిఁజూచి) వర్షములో దడిసితిరా యేమి!

బిల్వ—వర్షములోఁ గొంత, కృష్ణా ప్రవాహములోఁ గొంత.

చింతా—అదియేమి! అట్లుపలుకుచుంటిరి? మీనాయనగారు సుఖులై యున్నారుకదా!

బిల్వ—ఆ-దినంబున సుఖులై యున్నారు.

చింతా—హరిహరీ! ఎంతమాటవింటిని. (ఇంచుకయూరకుండి) అక్కటా ఈసమయమున నేల యరుదెంచితిరి?

బిల్వ—నీమీఁదనున్న యనురాగమే నన్నిట్లు జేసినది.

చింతా—అక్కటా! ఎంతసాహసకార్యము!

తే. గీ. జనకుఁడేగెను మిము వీడి ♦ స్వర్గమునకు
నింటభార్య యొంటిగనుండె ♦ నేరుపొంగి
గట్టులకుదాకి యుండెను ♦ నంధకార
మందు వానగురియుచుండె ♦ నట్టిస్థితిని
వత్తురే యక్కటా! వార ♦ వనితకొఱకు.

చింతా—ఈయర్ధరాత్రి సమయమున మిమ్ము నదినిదాటించిన పల్లెవాఁడెవఁడు?

బిల్వ—పల్లవా దెవ్వడును లేడు. భగవంతుడే దొకమార్గము జూపును. ఏటియొడ్డున పడవలేకుండుటంజూచి, నెమ్మదిగా నెట్లయిన నీదుకొనిరాఁదలంచి రేవులో దిగుసరికి నా కాలికొక శవముతగిలినది. దానిం దెప్పగాఁ జేసికొని యీవలకుఁ జేరితిని. కాని నేనొక పనిమాత్రము జేసితిని. ఆశవమును మరల ప్రవాహములోఁ బడవేయక యొడ్డుననే పడవైచితిని

చింతా—ఏమీ! మీవాక్యములు నిజమైయుండునా?

బిల్వ—సందియ మేమియు లేదు. దీపము పట్టుకొనిరమ్ము, జూపెద.

చింతా—(దీపము పుచ్చుకొని) రండు.

బిల్వ—(కొంతదూరము దీసికొనిపోయి) అదిగో! సందేహనివారణము జేసికొనుము.

చింతా—(దీపపు వెలుతురునజూచి) ఓహో! ఇదొక్కట స్త్రీశవము. పాపము! ఎవరోకదా!

బిల్వ—చింతామణీ! దీపము కొద్దిగా ముందునకుదెచ్చి చూపుము.

చింతా—(అట్లు సేయును.)

బిల్వ—(శవమును బరిశీలించి) హా! పరమేశ్వరా! (మూర్ఛనొందును.)

చింతా—ఆర్యా! ఏమిది! (లేవ నెత్తును.)

బిల్వ—చింతామణీ! ఇంకేమున్నది?

సీ. పతిభక్తియం దరుం ♦ ధతిమించి వెలలేని
యశమును నార్జించి ♦ యలరుదాని
తాలిమియందున ♦ ధామణికీడంచు
బలువురువచియింపఁ ♦ బరగుదాని
సద్వివేకసుగుణ ♦ సంపదయందు మ
దాలస కీడౌచు ♦ దనరుదాని
పుట్టినయింటికి ♦ మెట్టినింటికిగూడ
గౌరవంబును నిల్పి ♦ క్రాలుదాని

తే. గీ. సంతతము మనోవల్లభు ♦ చరణకమల
సేవయే ముక్తియంచు నీ ♦ క్షించుదాని

నాకు నిల్లాలయినదాని ♦ నాదుచేతు
లారఁ జంపుకొంటినిగదా ♦ యక్కటకట.

చింతా—అక్కటా! ఈమె మీభార్యయగు రాధయా! ఎంతఘోర మెంతఘోరము! ఈ సాధ్వీలలామ కిట్టిపాటెట్లు సంభవించినది?

బిల్వ—చింతామణీ! ఏమిచెప్పుదును. ఈయర్ధరాత్రి సమయమున శవజాగరణంబున కీమె నాంటిగ విడిచివచ్చుచుఁడ నన్ను బో వలదని ప్రార్థించెను. నేనీమె ప్రార్థన నిరాకరించిన కారణంబున బ్రిదుకును రోసి కృష్ణానదిలోఁ బడియుండును.

చింతా—ఆహా! ఈసాధ్వీమణి నాస్మరణ జేసినచో బంచమహా పాతకములును నశించునుగదా!

చ. సతు లిలనెందఱో కలరు ♦ స్వాంతమునం గడు భక్తి బూనుచుఁ
బతులకు సేవఁ జేసలుపు ♦ వారలు ప్రాణములుండ; గానియీ
గతి మరణించియున్ బతిక ♦ గణ్యతరంబగు సేవఁజేయు నీ
సతికి సమానమైనసతి ♦ క్ష్మాతలమందున నుండఁబోవునే.

సాధ్వీలలామయు, బావనచరిత్రయు నగు నీమె మృతికి మీరేకదా కారణము. దీనివలన మీరెట్టిపాపమున బొందు దురో!

బిల్వ—తరుణీశిరోమణీ! నాకు నీమీదనున్న మోహము పాపపుణ్య ములఁ జూడనిచ్చుటలేదు. నీకూటమియే నాకు స్వర్గపదముగ నున్నది.

చింతా—ఆగ్యా!

తే. గీ. అఖిల శాస్త్రార్థ సంవేది ♦ వైననీవ
ధనమె ధర్మనిగా నిరతంబు ♦ దలచుచుండు
నాట వెలదికై యింత మో ♦ హంబునందఁ
దగునె; ధర్మమే యియ్యది ♦ తలఁచిచూడ.

బిల్వ—చింతామణీ! నేడు నీనోటినుండి క్రొత్తపలుకు వచ్చినది. నా విద్యాజ్ఞానమంతయు భవదీయ జగన్మోహన విగ్రహాభివర్ణనంబు

నకే పనికివచ్చినది. అయినను నీవు సామాన్య వేశ్యవుగావు. నీకును దక్కిన పడపు గత్తెలకును హస్తిమశకాంతరము.

చింతా — ఇట్లేపత్రితవిటులును దలంచుచుందురు. ఈ వెట్టియే యనేక విటుల కొంపలుదీసినది. అంతియేకాని మీరు తలంచినట్లు తక్కిన వేశ్యలకంటె నేనెక్కువదానినిగాను.

బిల్వ — అది యెంతయు నాకుం దెలియదు. నీ సౌందర్యము నన్ను బూర్తిగ మోహసముద్రములో ముంచివేసినది.

చింతా — సౌందర్యమును జూచియా మీరు భ్రమించితిరి? బాగున్నది. నేను క్షణములో వచ్చెదను. మీరిచ్చటనేయుండుడు.

(నిష్క్రమించును)

బిల — (పశ్చాత్తాపముతో) చింతామణి పలుకులయం దసత్యమేమి యనులేదు. వేశ్యలు ధనముకొఱకే తమవలపు జూపుదు రను మాటలో సంశయమేమున్నది? ఈచింతామణికి నాకు బూర్వమెంతమంది విటులుండిరో! (ఇచుక యూరకుండి)

తే. గీ. పండితుండనౌచు నొప్పిన ♦ ఫలమదేమి

జ్ఞానమెల్లను మంటలోఁ ♦ గలిపి; వేశ్య

మఱిగి కన్నతండ్రినిఁ గను ♦ మాన్యచరిత

యాసతిని జంపుకొంటెని ♦ నక్కటకట.

చింతామణీవ్యామోహము నన్ను ప్రపంచకమునే మఱపించినది. అక్కటా! నేనెంత పాపిని! (భార్య నుద్దేశించి)

సీ. పతిమాట నిరతంబు ♦ పైడిమూటగ నెంచి

భక్తిజరించిన ♦ పరమసాధ్వి

ఎంతభాగ్యంబున్న ♦ నింతయేనియు గర్వ

మనుమాట యురుగని ♦ యమలచరిత

నేనెంత కొట్టినన్ ♦ దిట్టినగాని ప

రమశాంతమూనిన ♦ రమణిమిన్న

మందునకైన మో ♦ మందు జీగాకెప్పుడు

గనిపించి మెరుగని ♦ కలుషంహిత

తే. గీ. సకల విద్యలనరసి వి ♦ శారదయున
పడతులెల్ల జెప్పకొనగ ♦ వరలుకాంత
యకట! నాకతంబునగాదె ♦ యంతమందె
నతపాపచిత్తుండనో ♦ యెంచిచూడ.

అటువంటి పరమపావన చరిత్రియగు భార్యనాకుఁ దక్కునా! నేనెట్టి నిర్భాగ్యుడను.

సీ. పుడమియందున ఖ్యాంతి ♦ వడసిన నాకుల
గౌరవమును మంటగలిపినాను
పెంచిపెద్దగజేసి ♦ వలసినతండ్రినా
కయి బెంగచేఁ జావఁ ♦ గాంచినాను
నేనెదైవంబుగా ♦ నెంచిన భార్యను
ముప్పతిప్పలుబెట్టి ♦ ముంచినాను
అన్నివిద్యలనేర్చి ♦ యార్జించినట్టి వి
ఖ్యాతిని గంగలో ♦ గల్పినాను

తే. గీ. గణికనామోహు దివ్యమో ♦ హంబటంచు
నెంచి, సిగ్గుబూనక చరి ♦ యించినాను
బ్రతికియుండిన నింకేమి ♦ ఫలముగలుగు
నన్నివిధముల భ్రష్టుండ ♦ నైతిగాదె.

చింతా—(అలంకార రహితయై ప్రవేశించి) అర్యా! నేనిప్పుడెట్లున్నాను? సౌందర్యవతి నగుదునా? కాదా?

బిల్వ—చింతామణీ! చింతామణీ! ఇదియేమివేషము! నీవు చింతామణివేనా?

చింతా—నేనుచింతామణినే.ఇప్పుడునేనుసౌందర్యవతి నందురా కాదా!

బిల్వ—నాకాశ్చర్యముగ నున్నది.

చింతా—ఇందాశ్చర్య మేమియును లేదు.

సీ. చంద్రాస్యవంచును ♦ సన్నుతింతురుగాని
కడునీచ వాసన ♦ గాంచబోరు

చూపులంగని మరు ♦ తూపులందురుగాని
పాణముల్ బాపు క ♦ రంబు లనరు
కుచములు బంగారు ♦ కుండలందురుగాని
బొత్తిగా జర్మపు ♦ దిత్తులనరు
పసిడిబొమ్మయటంచు ♦ భావించెదరుగాని
జలబుద్బుదంబంచు దలపబోరు

తే. గీ. కటకటా! యిట్టితుచ్ఛసౌఖ్యంబుకొఱకు
కలితమోహాబ్ధిబడి కనుల్ ♦ గానలేక
ధనము మానంబు గోల్పోయి ♦ జనములెల్ల
బరిహసింప నొప్పెడువాని ♦ బ్రతుకుగోత.

బిల్వ—(లేచి) హా! చింతామణీ! కాదు కాదు నన్ను గృతార్థునిం జేయందలంచిన జ్ఞానస్వరూపిణివి. తల్లీ! నమస్కారము లందు కొనుము.

చింతా—(తప్పించుకొని) మీ సేవకురాలనగు నా యెడల నిట్టి యనొచితకార్యము సేయుచుంటిరేల?

బిల్వ—నీవు సేవకురాలవు కావు.

తే. గీ. తల్లి! నీ ప్రబోధంబుచే ♦ యుల్లమందు
సంతసం బెంతయో గల్గె ♦ సత్యముగను
నాదుదోషముల్ గ్రహించి ♦ నాన మేలు
కాంచితిని నిద్రలేచి నీ కరుణవలన.

ఓ చిత్స్వరూపిణీ! నీ విట్టి మహాజ్ఞానవంతురాలవై యుండియు నన్నేల యిట్లంధకారమునం దిన్ని దినములనుండియు నుంచితివి?

చింతా—నేనును మీవలెనే యంధకారమునందే యుంటినిగాని, యింతకుమున్నే నిద్రించుచుండం భగవంతుండగు శ్రీకృష్ణుండు సాక్షాత్కరించి నాకు బ్రబోధము చేసినాడు.

బిల్వ—ఆహా! నీ వెంతధన్యాత్మురాలవు? నేనెంతయు నిర్భాగ్యుండను.

సోమగిరియోగి—(ప్రవేశించి) నీవు నిర్భాగ్యుడవుకావు. చింతింపకుము. భగవత్సంకల్పముననే నేను నీకడ కరుదెంచితినని తలంపుము. దేవాలయమునకు ప్రక్కనున్న మఠములోనున్నాను. పాపమొనర్చియుం బశ్చాత్తాపము నందుచుండిన కారణమున నీవు కృతార్థుడవగుచున్న వింక నీవు లీలాశుకుండవన బఱగెదవు. రమ్ము. వాసుదేవమంత్రము నుపదేశించెద.

బిల్వ—మహాత్మా! ధన్యుడనైతిని. (ఆకసమువంక జూచి.)

తే. గీ. దేవ నిన్నెంతయైన నుతింపవచ్చు
నెఱిగియుండియు నిటువిష యేచ్ఛనున్న
నాకుఁ వేశ్యా ప్రబోధమున్ గల్గఁజేసి
గురుని జూపించి నాడవు కరుణబూని.

(సోమగిరితో నిష్క్రమి)

రంగము:—[రాజవీథి-మధుసూదనుండు ప్రవేశము.]

మధు—(తనలో) ఆహా! తుద కెట్టిస్థితిలోనికి మారితిని? అఖండైశ్వర్యముతోఁదులదూగిన నే నిప్పు డుదరపోషణార్థమై వంటవాడనైతినిగదా!

మ. కపటస్నేహముజేసి నమ్మికలు వ ర్తకాంక్షించి ద్రవ్యార్థమై
యుపలాలింపుచు ద్రవ్యమెల్ల గరమం దున్నంత యుఙ్ఞ లాగి, బు
క్కపకీరుఙ్ఞ వలె సేయఁజాలెడి లస త్కాంతామణుల్, వేశ్యలఙ్ఞ
జపలస్వాంతల నమ్మరాదు జనముల్ సత్యంబు ముమ్మాటికిఙ్ఞ.

(తెరలో)-స్వదేశీ చేగోడీ-స్వదేశీ చేగోడీ-తాజా-అల్వా)

మధు—(తనలో) ఆహా! సుబ్బిసెట్టికిగూడ యెట్టిగతి సంభవించినది! వేశ్యలను నమ్మినవాఁడెవఁడు బాగుపడినాడు?

(సుబ్బిసెట్టి-ప్రవేశము.)

సుబ్బి—పంతులుగారా యేవిటి, దండాలు, దండాలు.

మధు—ఈపట్లై మేమిటి?

సుబ్బి—సిన్నప్పు మాఅయ్యచేసిన యాపారం. మల్లీయిప్పు సింతామణి మూలాన్న సేతికొచ్చింది. పంతులుగారుకూడా సాలా నష్టపడ్డట్లున్నారు.

మధు—ఇప్పు డేమి విచారించిన నేమిప్రయోజనమున్నది? చింతామణి యోగినియైనదట. వింటివే?

సుబ్బి—యిన్నాను. అందరికి నున్నంగా గొరిగి దొంగసన్యాసం పుచ్చుకొందా యేవిటి?

(తెరలో)

ఇదిగో! మీరెక్కడేవుండారేమి! మాఅక్కయ్య యెవరెవరి దగ్గిఱ సొమ్ములుతీసుకొందో అందరికీ యిచ్చేస్తాంది, రండి.

మధు—సుబ్బిశెట్టీ! విన్నావా! చింతామణికి మంచిబుద్ధిపుట్టినది. పోయి తెచ్చుకొందము రమ్ము.

సుబ్బి—ఇకనే, మల్లీ వొక యెటుగు యెలిగిత్తాం.

(నిష్క్రమించి వెంటనే ప్రవేశింతురు.)

మధు—చూచినావా! చింతామణిచెప్పిన మాట నిజము. వేశ్యాసంపర్కమువలన గలిగెడు నష్టములను బహిరంగముగా సమస్తజనులకు దెలుపుమని చెప్పియున్నది. ఇప్పుడు మన మట్లు సేయవలయును.

సీ. భార్యలేడ్చుచునుండఁ ♦ బసుపుకత్తెలఁ బొందు
నాశించునట్టి పా ♦ పాత్ములార
సానితో సౌఖ్యమే ♦ స్వర్గమంచును గల
భాగ్యమర్పించు ని ♦ ర్భాగ్యులార
కల్ల ప్రియమునుజూప ♦ కడుపుబ్బినెత్తిపై
నెక్కించుకొనుచుండు ♦ హీనులార
పీకుదానునుబోలు ♦ వెలదినోట విడెంబు
చవిజూచుచుండెడి ♦ చవటలార

తే. గీ. ఇప్పుడైన తెలిపెఁబూని ♦ యెన్నడికను
వేశ్యకడ కేగమని యొట్టు ♦ బెట్టుకొనుడు
దానిసంపర్క మెప్పుడు ♦ దలపవలదు
స్వానుభవమిది చెప్పుచు ♦ న్నాను వినుడి.

సీ. రొక్కంపు వెలదికిఁ ♦ దృప్తిని గలిగింప
భారతీపతికైన ♦ వశముగాదు
విత్తమొసఁగి తెచ్చిన ♦ వేశ్యకునిజమైన
వలపును గలిగింప ♦ వశముగాదు
వారాంగనా పాశ ♦ బద్ధుఁడైన విముక్తి
నందు నెవ్వనికిశ ♦ క్యంబుగాదు
ధనకామినీవహ్ని ♦ ఘనమోహాశరముల
దప్పించుకొనుటకు ♦ దరముగాదు

తే. గీ. ఇప్పుడైన తెలివిబూని ♦ యెన్నడికను
వేశ్యకడ కేగమని యొట్టు ♦ బెట్టుకొనుడు
దాని సంపర్క మెప్పుడు ♦ దలపవలదు
స్వానుభవమిది చెప్పుచు ♦ న్నాను వినుడు.

(నిష్క్రమించును.)

సుబ్బి—యెనకా ముందు సూడకుండ బోగంవోళ్ళదగ్గిరకెల్లే సవట
పీనుగుల్లాలా యినాడి.

సీ॥ తైతెక్కలాడంగ ♦ తబ్బిబ్బుసెందుచు
యేశ్యయింటికి పరు ♦ గెత్తినాను
సెయిన్నైన తగిలితె ♦ సేసని తలపోసి
సేరిదానికి సేవ ♦ సేసినాను
సిరునవ్వు నవ్వితే ♦ సిత్తమందుబ్బుచు
ముదవంది పాదాలు ♦ మొక్కినాను
యెలదిమాటలు సూచి ♦ యెట్టోడిన్నై పేరిమ
కలదంచు నెంతయో ♦ దలసినాను

తే. గీ. సేతిలో ముష్టి సె బోటి ♦ సేరుదాక
యింటిసుట్టును కుక్కలా ♦ గల్లినాను
మొగ్గలింటికి మీారెప్పు ♦ యెల్లవద్దు
యెల్లితే కొంపకూల్తుంది ♦ యినుడు యినుడు.

సీ॥ మీాదసెస్కృస్తైనే ♦ మేలని, యెన్నోన్నొ
కాసులుమీాద పా ♦ రేసినాను
యింటిలోపల కార్య ♦ వంటేను వలసిన
యెచ్చాల కెచ్చాలు ♦ యిచ్చినాను
సంతోసమందుటే ♦ సాలని సరదాకి
పదిసార్లు పాదాలు ♦ పట్టినాను
నీమీాద మోజుంటె ♦ నిజమని నమ్ముచు
యెట్టోడిలాగున ♦ యెళ్ళినాను

తే. గీ. కొంతయిచ్చిన తుదకిట్లు ♦ యెల్లగొట్టె
నారు; పేరివయుండదు యేశ్య ♦ నారులకును

మేళ్ళయింటికి మీరెప్పు ♦ డెల్లవద్దు
మెల్లితే కొంపకూల్తుంది ♦ యినుడు యినుడు.

(నిష్క్రమించును.)

చి. తా—(ప్రవేశించి) చేయవలసిన పనులన్నియుఁ జేసినాను. (ఇంచుక నడచి)

సీ. పడుపువృత్తినిబూని ♦ కడుపునింపుకొనుచుఁ
గాలంబుఁబుచ్చెడి ♦ గరితలార
సతులఁతోనుండెడి ♦ పతులను నెడఁబాపి
పాపంబునార్జించు ♦ పడతులార
పిత్తమేవిభుసిగాఁ ♦ జిత్తమందుననెంచి
కుకర్మలైచరియించు ♦ కుమతులార
అతిసీచచిత్తులై ♦ ప్రతిపూరుషునకును
కొంగుపఱచుచుండు ♦ కుమతులార

తే. గీ పడుపుజీవనం బిల ఘోర ♦ పాపభరిత
మనెడిమాటను దలపోసి ♦ యిట్టివృత్తి
మాని; పరమేశుసమ్మోక్ష ♦ న్మార్గపథము
ననుసరింపుడు మీరు వే ♦ శ్యసతులార.

(తెరలో)

శ్లో॥ చింతామణిర్జయతు సోమగిరి ర్గురుర్మే
శిక్షాగురుశ్చ భగవాన్ శిఖిపింఛమౌళిః
యత్పాద కల్పతరు పల్లవ శేఖరేషు
లీలా స్వయంవర రసంలభతే జయశ్రీః.

చింతా—అహా! ఏమి కర్ణామృతము.

బిల్వ—(పై శ్లోకమును చదువుచు ప్రవేశించును.)

చింతా—ఆహా! ఏమి! శుకుని చందమున వెలుంగుచున్న యీమూర్తి వైభవము!

బిల్వ—కృష్ణా!

శ్లో. ఫుల్లేందీవర కాంతి మిందువదనం ♦ బర్హావతంసప్రియం
శ్రీవత్సాంక ముదార కౌస్తుభధరం ♦ పీతాంబరం సుందరం
గోపీనాం నయనోత్పలార్చితతనుం ♦ గోగోప సంఘావృతం
గోవిందం కలవేణునాద నిరతం ♦ దివ్యాంగ భూషం భజే.

శ్లో. పల్లవారుణపాణిపంకజ సజ్గవేణు రవాకులం
ఫుల్లపాటలపాటలీ పరివాది పాద సరోరుహం
ఉల్లసన్మధురాధరద్యుతి మంజరీ సరసాననం
వల్లవీకుచ కుంభకుంకుమ పంకిలం ప్రభుమాశ్రయే.

చింతా—(తనలో) ఈమహానుభావునకు శ్రీకృష్ణ భగవాను డెంతలో సాక్షాత్కరించినాడు? (సమీపించి) యోగీంద్రా! తామిప్పు డెక్కడికి దయచేయుచున్నారు?

బిల్వ—నీ వెవరవు?

చింతా—మీ సేవకురాలను.

బిల్వ—ఓహో! నీవునన్నుద్ధరించిన మాతృదేవతవు.

“చింతా”—(అనశ్లోకమును జదువును.)

చింతా—మహాత్మా! మీరిప్పు డెచ్చటికిబోవుదురు?

బిల్వ—నాభార్యకును, తండ్రికిని, సంస్కారవిధులు రామశాస్త్రిచే

జేయించితిని. నేనిప్పుడు బృందావనమునకుఁ బోవుచుంటిని.తల్లీ! ఇక నేనేమైన సేయవలసిన కార్యమున్న యానతిమ్ము.

చింతా—దేవా! ఇంకేమియును లేదు. ఇట్లుమాతృమాశీర్వదింపుడు.

సీ. పాపభూయిష్ఠమై ♦ పణ్యాంగనల్ సేయు
వ్యభిచార జీవన ♦ మణఁగుగాక
ధనము నార్జింపంగ ♦ ధనకామినీమణుల్
బురుషుల జేర్పక ♦ పోల్తురుగాక
పురుషులెవ్వరు తమ ♦ తరుణులవిడిచిదు
ర్వృత్తి బూనకయుండి ♦ వింతురుగాక
పరమసాధ్వీమణుల్ ♦ పతులతోఁగూడి సౌ
ఖ్యంబుల నెప్పుడు ♦ గాంతురుగాక

తే. గీ. పరమపావనమైన యీ ♦ భరతభూమి
యందు మచ్చుమైయున్న వే ♦ శ్యాన్వయంబు
నందు మార్పుజెంది పరిణ ♦ యంబులగుచు
నుండి వెలలేని కీర్తిని ♦ నొందుగాక.

(తెరవాలును)

సప్తమాంకము

సంపూర్ణము

నూతన నాటకరాజములు.

(గ్రంథకర్తలు: రామనారాయణకవులు.)

సంపూర్ణ కృష్ణచరిత్రము.

ఇందు శ్రీకృష్ణావతారము జన్మించుట, శ్రీకృష్ణలీలలు, కంసవధ, జరాసంధునితో పోరు, కాలయవనవధ, రుక్మిణీకళ్యాణము, శ్యమంతకము, నరకాసురవధ, శిశుపాలసంహారము, కుచేలోపాఖ్యానము, శ్రీకృష్ణ నిర్యాణము ఉండును. అందరును తప్పక చదువదగినది. వెల 1—0—0.

ద్రౌపదీ వస్త్రాపహరణము.

ఇది క్రొత్తగా రచించినది. రంగస్థలములకెక్కువ యుపయుక్తముగానుండునట్లు వ్రాయబడినది. శైలి మనోహరముగా నుండును. ఇందు రాజమండ్రి చింతామణి థియేటర్ యాక్టరగు అల్లక చంద్రశేఖరకవిగారి కీర్తనలు వేయబడినవి. రాయల్ సైజులో అందమగు దళసరి అట్టవేసి ముద్రించబడినది. వెల 1—0—0.

ప్రహ్లాద విజయము.

అతిభక్తిరసముగల నాటకము. ఇందు బ్రహ్మశ్రీ గూడూరు కోటీశ్వరరావు గారిచే రచియింపబడిన (మట్లు) కీర్తనలు వేయబడినవి. ఈనాటకమున్ను కీర్తనలున్ను ఎక్కువ ఆనందముగా నుండును. వెల 1—0—0.

ఆంధ్ర మంత్రులు.

ఇది ప్రతి గ్రంథాలయములయందును ముఖ్యముగా నుండదగినది. దీనిని పాఠశాలలలోగూడ పిల్లలకు చదువ నుపయోగింపవచ్చును. ప్రతివారును చదువ దగినది. శైలి మనోహరము. వెల 0—8—0.

ప్రకటన.

మావద్ద పాఠశాల గ్రంథములు, వాచకములు, కంపెనీ నాటకములు, శతకములు, పాటలు, వైద్యగ్రంథములు, హాస్యగ్రంథములు, కాగితములు, కలములు, బ్లాక్ బర్డు, వగైరా ఫౌంటెన్ కలములు, సబ్బులు, సిరామందుడబ్బాలు వగైరా అనేక రకములు సరసమైన ధరలకు విక్రయింపబడును.

శ్రీ సీతారామాంజనేయ కంపెనీ,

మెయిన్ బజారు, బెజవాడ.

సతీ తులసి.

(గ్రంథకర్త: ముత్తినేని వేంకట చెన్నకేశవులు, జగ్గయ్యపేట.)

ఇది బైస్కోపు ప్లాటుననుసరించి వ్రాయబడిన 6 అంకముల నాటకము. కథానాయికయగు తులసి నిజపాతివ్రత్య ప్రభావంబున దేవేంద్రుని గడగడవడఁకించినది. శేషశయనుని పాషాణమొనర్చినది. లక్ష్మీదేవికిఁ బతిభిక్ష పెట్టినది. ఈసాధ్వీమణి పతి తన్నొల్లకయున్నను భర్తనే పరమేశ్వరునిగా భావించి పూజించినది. తుదకతడు గతింపఁ జితిం జొచ్చినది. ఈసుచరిత్ర చరిత్రము పఠించినచో గన్నీరు విడువనివా రుండరు. గుండె నీరుగానివా రుండరు. జలంధరుని దుండగములు—తులసింగాంక్షించి యింద్రుడు పడుపాట్లు—నారదునిపన్నుగడలు— తులసింజెరుపవచ్చి విష్ణుదేవుఁడొందుదురవస్థ— చదివితీరవలయును. కొద్దిప్రతులు మాత్రమే గలవు. వెల 1—0—0.

ఉ॥ చెల్లునె తండ్రి! యిట్టిచెను ♦ చేఁతలఁ జేతముఁజేస్ప దేవతా
వల్లభుఁ డైతినర్చు నిను ♦ వంటి మహాత్మున కీవె యీవిధిన్
దల్లులనంగఁ జెల్లు పర ♦ దారలఁగోరిన నుల్లమందు భీ
తిల్లెదరే దురాత్ములు ప ♦ తీమణులన్ బలవంత పెట్టఁగన్॥

గీ॥ విబుధవిభుఁడనంచు ♦ విఱ్ఱవీఁగెద వింద్ర!
నీకు నాకు నెల్ల ♦ లోకములకుఁ
బ్రభుఁడు రక్షకుండు ♦ పర్వతకన్యా మ
నోహరుఁడు లేఁడె ♦ యాహరుండు?

ఉ॥ వారిధినీఁదు మీనుగతి ♦ వ్రయ్యఁగ మోఁదఁ దిమిప్రజంబుఁ, గుం
భీరములన్ దొరల్చెదుఁ, ది ♦ మింగిలవారములన్ నొగిల్చెదున్
గ్రూరసహస్ర దంష్ట్రములఁ ♦ గూల్చెదుఁ దూల్చెదు గ్రాహకోటి న
య్యారె యొకింతలేఁదు త్రిద ♦ శాధిప! వీఁడిదియేమి మాయరో!

గీ॥ దయిత నొసఁగియుట్ట ♦ దగదంటి వీఁకనట్టి
తరుణియేటికింట ♦ దాఁచుకొననె?
పఁడునిచ్చెదాని ♦ భక్షింపవలెనంట
యెందు నేర్చికొంటి ♦ విందునాథ!

శ్రీ సీతారామాంజనేయ కంపెని,

బుక్కు సెల్లర్సు & పబ్లిషర్సు, బెజవాడ.